RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



29 మే 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:308

## విద్యార్థులంతా రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

### వందేళ్ల చరిత్రలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తొలిసారి దళితుడిని వీసీగా నియమించాం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



జీవితంలో తొలి మెట్టు ఎక్కబోతున్న విద్యార్థినీ విద్యార్థులంతా కష్టపడి చదువుకుని భవిష్యత్తులో మరింతగా రాణించి రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. చదువుకోవడం ద్వారా కుటుంబానికే కాకుండా, సొంత ఊరికి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తేవొచ్చని ఉద్బోధించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలోని ఎస్సీ గురుకులాల నుంచి ఐఐటీ, ఎన్ఐటీల్లాంటి ప్రఖ్యాత సంస్థల ప్రవేశాలతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 10 వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవార్డుల బహూకరణ, ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకులాలకు ప్రోత్సాహకాలు అందించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి ముందుగా ప్రాంగణంలో విద్యార్థుల చిత్రకళా గ్యాలరీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "అసమానతలు తొలగించి సమసమాజం నిర్మించాలన్న ఆనాటి పోరాటయోధుల స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తోంది. గురుకులాల్లో చదువుకుంటున్న మా పిల్లలు రేపటి రోజున ఉన్నత శిఖరాలను అధిరోహించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కాంక్షిస్తున్నా.

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి, మహిళా విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును.. ఇలా ఎందరో త్యాగమూర్తుల స్ఫూర్తితోనే సమసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం పనిచేస్తోంది. జవహర్ లాల్ నెహ్రూ , డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నాం.

ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువు చాలా ముఖ్యం. చదువులో మరో మెట్టు ఎక్కబోతున్న విద్యార్థుల ముందు రకరకాల రంగుల ప్రపంచం ఆకర్షణీయంగా ఉంటుంది. ఊహాగానాల్లో తిరగకుండా జీవితంలో 25 సంవత్సరాలు వచ్చే వరకు కష్టపడి చదువుకుంటే ఈ సమాజంలో గౌరవంగా బతకడానికి, భవిష్యత్తులో రాణించడానికి వీలవుతుంది. దారితప్పితే తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి వస్తుంది. చదువుకుంటే గ్రామం నుంచి రాష్ట్రం వరకు గర్వంగా బతికేలా చేస్తుంది.

వందేళ్ల చరిత్రలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తొలిసారి దళితుడిని వీసీగా నియమించాం. ఆ కోవలోనే సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీకి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా, విద్యా కమిషన్ చైర్మన్‌గా, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా, రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా గతంలో ఎప్పుడూ లేని విధంగా దళిత బిడ్డలు ఈ పదవులు చేపట్టారంటే వారికి కేవలం కులంతోనే అవకాశాలు రాలేదు. వారు ఉన్నత స్థాయిలో చదువుకుంటే వచ్చాయి.

దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు ఆత్మన్యూనతా భావాన్ని వీడాలి. ఆ లక్ష్యంతోనే రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడున్న గురుకుల పిల్లల్లో ప్రతిభ ఉంది. ఆత్మవిశ్వాసం ఉంది. భవిష్యత్తులో కచ్చితంగా రాణించగలుగుతారన్న నమ్మకం నాకుంది. కుటుంబానికే కాకుండా గ్రామానికి, దేశానికి పేరుప్రతిష్టలు తీసుకొస్తారు.

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉన్నదని సంపూర్ణంగా విశ్వసించే వాడిని. కష్టపడి చదివితే రాణిస్తారు. మీరు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. మీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటున్నా. మీకెప్పుడూ తోడుగా ఉంటా. భవిష్యత్తులో రాణించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా..." అని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ , సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , షబ్బీర్ అలీ , పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

## జూన్ 8 వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ..



వార్తా 2 లో

## టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు - 'మహానాడు'లో ప్రమాణ స్వీకారం

### 43 ఏళ్లుగా టీడీపీ జెండా రెపరెపలాడుతుందంటే కార్యకర్తలే కారణం:చంద్రబాబు

### మళ్లీ జన్మ ఉంటే తెలుగు జాతి కోసం తెలుగుగడ్డపైనే పుడతాను



కడప, మే 28 కడపలో మహానాడు రెండోరోజు అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ నేతలు, శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. మహానాడు తొలిరోజు పలు కీలక అంశాలపై చర్చించుకున్నట్లు చెప్పారు. పార్టీ బలోపేతం, రాష్ట్ర ప్రజలకు మేలుచేసేలా చర్చలు సాగాయని వివరించారు.

తెలుగుజాతి మొత్తం ఆరాధించే ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు జయంతి అంటే తెలుగుజాతికి పండగరోజని తెలిపారు. ఒకే వ్యక్తి రెండు రంగాల్లో రారాజుగా రాణించడం చరిత్రలో చూడలేదన్నారు. తెలుగు సినీచరిత్రలో ఎవరె-స్ట్?గా ఆయన ఎదిగారని వివరించారు. నీతి నిజాయతీ, పట్టుదల ఎన్టీఆర్ ఆయుధాలని తెలియజేశారు. ఆత్మగౌరవం, ఆత్మాభిమానాన్ని వీడని నేతని వ్యాఖ్యానించారు.

నా తెలుగు కుటుంబం కోసం ఆరు శాసనాలు చేసుకున్నాం

నందమూరి తారక రామారావు 33 సంవత్సరాలు వెండితెరకు 13 ఏళ్ల రాజకీయాల్లో అద్వితీయ చరిత్ర సృష్టించారు. ఎన్టీఆర్ అంటే పేదవాడికి భరోసా రైతులకు నేస్తం. అన్ని వర్గాలు కీర్తించే ఏకైక నాయకుడు ఎన్టీఆర్. అధికారమంటే బాధ్యత పదవి అంటే సేవ అని నిరూపించారు. పాలకులంటే సేవకులని చెప్పి దేశ రాజకీయాల అర్థాన్నే మార్చారు. ఆయన రూపొందించిన పసుపు జెండా శాశ్వతంగా ఉంటుంది. తెలుగుజాతి ఉన్నంతవరకు ప్రజలకు నందమూరి తారక రామారావు గుర్తుంటారు. తెలుగు ప్రజల నమ్మకం, విశ్వాసం, భరోసా టీడీపీ జెండా. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో కొత్త ఒరవడి సృష్టించారు. తెలుగుజాతిని 2047కు ప్రపంచంలోనే ప్రథమస్థానంలో ఉంచాలి. రాబోయే 40 ఏళ్లకు రోడ్‌మ్యాప్‌నకు రూపకల్పన చేసుకున్నాం. నా తెలుగు కుటుంబం కోసం ఆరు శాసనాలు చేసుకున్నాం. మళ్లీ జన్మ ఉంటే తెలుగు జాతి కోసం తెలుగుగడ్డపైనే పుడతా. కార్యకర్తే అధినేత శ్రేణులే సుప్రీం ఇది పార్టీ సిద్ధాంతం. 45 రోజుల్లో కోటికి పైగా సభ్యత్వం నమోదు చేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం. తొలిసారి అసెంబ్లీకి 65 మంది యువతకు సీట్లు ఇచ్చిన చరిత్ర టీడీపీది. 61 మంది గెలిచారు. నూతన నాయకత్వం తీసుకొచ్చాం. అతి చిన్న వయస్సులో కేంద్రంలో మంత్రిగా రామ్మోహన్‌నాయుడు ఉన్నారని' పేర్కొన్నారు.

తెలుగుదేశం కొత్త తరహా పాలనకు శ్రీకారం చుట్టిందని వివరించారు. ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. 43 ఏళ్లుగా టీడీపీ జెండా రెపరెపలాడుతుందంటే కార్యకర్తలే కారణమని తెలిపారు. శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రజలకు దగ్గరగా కార్యకర్తలు ఉండాలన్నారు. ప్రజలు మెచ్చే పాలన అందించాల్సిన బాధ్యత మనపై ఉందని వెల్లడించారు."వివేకా హత్యకేసు విషయంలో నాలాంటి నాయకుణ్నే మోసంచేయగలిగారు.గుండెపోటుతో వివేకా చనిపోయారని ప్రచారం చేశారు. అందరిలా నేనూ నమ్మా. సాయంత్రానికి గొడ్డలిపోటు విషయం బయటికి వచ్చింది. నాపై నెపం వేసేందుకు దుష్ప్రచారాలు చేశారు. రాజకీయాల్లో కరడుగట్టిన నేరస్థులను ఎదుర్కొంటున్నాం. కోవర్టులుగా ఉంటూ ఇష్టారీతిలో హత్యా రాజకీయాలు చేస్తున్నారు. నేరస్థులు చేసే కనికట్టు మాయపై అందరూ అప్రమత్తంగా ఉండండి".

నేరస్థులూ ఖబడ్దార్ తన దగ్గర ఎవరి ఆటలు సాగవని హెచ్చరించారు. కోవర్టులను పార్టీలోకి పంపాలనుకుంటే మీ ఆటలు సాగవని చెప్పారు. వలస పక్షులు వస్తాయి పోతాయన్నారు. నిజమైన కార్యకర్త శాశ్వతంగా ఉంటారని తెలిపారు. కోవర్టుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కార్యకర్తలకు చెబుతున్నట్లు పేర్కొన్నారు. నేరస్థులు చేసే కనికట్టు మాయపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సోషల్ మీడియాలో ఆడబిడ్డలపై దుష్ప్రచారాలు చేస్తే సహించం. ఆడబిడ్డలపై అసభ్యంగా ప్రవర్తించిన వారికి అదే చివరిరోజు అవుతుంది. రాజకీయంగా, ఆర్థికంగా నా ఆడబిడ్డలు మగబిడ్డలతో సమానంగా ఉండాలి. అన్నదాతగా అండగా ఉంటూ సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చాం. అరకు కాఫీని ప్రపంచానికి పరిచయం చేశాం. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు, పోలవరం పూర్తిచేస్తాం. రాష్ట్రం మొత్తం సస్యశ్యామలం చేసే బాధ్యత మాది. యువశక్తి నిర్వీర్యం కావడానికి వీల్లేదని' అన్నారు.



**గురువారం నాడు జై హింద్ యాత్ర ర్యాలీ ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పర్యవేక్షించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్**

ప్రజాబలం

29 మే 2025 గురువారం

# ముందే రగిలిన ఎన్నికల వేడి

బీహార్ 18వ శాసనసభకు వచ్చే అక్టోబర్ –నవంబర్‌లో జరిగే ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలు సమాయత్తమై అప్పుడే రణభేరి మ్రోగించాయి. భారత్‌లో 13.1 కోట్ల జనాభాతో రెండో పెద్ద రాష్ట్రంగా ఉన్న బీహార్‌లో సామాజిక న్యాయం, కులాల ప్రభావం అధికం. ప్రధాని నరేంద్ర మోడీ ఉగ్రవాద స్థావరాల విధ్వంసానికి దాడులు జరిపిన తర్వాత నేరుగా బీహార్‌కు వచ్చి మధుబని బహిరంగసభలో ప్రసంగించారు. మళ్ళీ ఈ నెల 29–, 30వ తేదీలలో బీహార్‌లో పర్యటించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. దీనిని శాసనసభ ఎన్నికలకు ప్రధాని మోడీ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న సంగతి స్పష్టమవుతోంది. ఆర్‌జెడి అధినేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కూడా శాసనసభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సంప్రదాయంగా మద్దతు ఇచ్చే యాదవ, ముస్లిం వర్గాలనేగాక మహిళలు, వ్యాపారులు, అత్యంత వెనుకబడిన వర్గాలను మహా కూటమి వైపు ఆకట్టుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల పాట్నాలో ఆర్‌జెడి ఇబిసి విభాగం ఆధ్వర్యంలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తూ నితీశ్ కుమార్ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ పాలనలో అత్యంత వెనుకబడిన కులాల వారెవరూ బాగుపడలేదని, బాగుపపడింది కుటుంబమేనని నిప్పులు చెరిగారు. ఇబిసిలు బాగుపడాలి అంటే మహాకూటమిని అధికారంలోకి తెచ్చి తేజస్వి యాదవ్‌ను ముఖ్యమంత్రిని చేయాలని వక్తలు పిలుపు ఇచ్చా రు. ఇబిసిలకు భద్రత, గౌరవం, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, నేరాల నుండి, నేరస్థుల నుండి రక్షణ కల్పిస్తామని, అవమా నించిన వారిని కఠినంగా శిక్షిస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. తన తండ్రి లాలూప్రసాద్ యాదవ్ ఆటవిక పాలన సాగించారని, శాంతి భద్రతలు లేవనే విమర్శలను తిప్పికొడుతూ సామాజిక న్యాయం జరిగింది ఆర్‌జెడి పాలనలోనేనని తేజస్వి గుర్తుచేశారు. ఆర్‌జెడికి దూరంగా ఉన్న అగ్రవర్ణాలను కూడా ఆకట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఏప్రిల్ నెలాఖరున పాట్నాలో వైశ్యుల భారీ ర్యాలీ నిర్వహించారు. 16వ శతాబ్దినాటి వైశ్య ప్రముఖనేత భామాషా జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించి తేజస్వి వైశ్యులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. వైశ్యులు ఎంతో పరిశ్రమించి ఎన్నో సంస్థలు స్థాపించి వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ బీహార్ పురోభివృద్ధికి తోడ్పడుతున్నారని తేజస్వి కొనియాడారు. 2022 ఆగస్టు నుండి 2024 ఆగస్టు వరకు తాను బీహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నపుడు రూ. 50 వేల కోట్ల కొత్త పెట్టుబడులు తెచ్చి లక్షలాది ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని తేజస్వి గుర్తు చేశారు. 2020 శాసన సభ ఎన్నికల్లో హెూరాహెూరీగా తలపడినా బిసిలు అధికంగా ఉన్న 15 స్థానాలను ఆర్‌జెడి కోల్పోయింది. అందుకే సంప్రదాయ ఓటర్లు గాక ఇతర సామాజిక వర్గాల మద్దతును కూడగట్టుకుంటేనే విజయం సాధ్యమనే వాస్తవాన్ని గుర్తించి తేజస్వి ఇబిసిలు, అగ్రవర్ణాలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల ఆర్‌జెడికి ఓటు బ్యాంకుగా ఉన్న యాదవ ముస్లిం వర్గాల్లో అసంతృప్తి రేగుతుందేమో ననే ఆందోళన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అదీగాక తేజస్వి మొదట మహాకూటమి భాగస్వామ్య పక్షాలు కాంగ్రెస్ తదితర పార్టీల మధ్య ఈ అంశాలపైనేగాక సీట్ల పంపిణీలో ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంది. బీహార్‌లో అంత బలం లేని కాంగ్రెస్ పార్టీ పట్టుపట్టి 70 స్థానాలు తీసుకుని వాటిలో కేవలం 19 స్థానాల్లో గెలుపొందిన ది. కాగా సిపిఎంఎల్ పార్టీ 19 స్థానాల్లో పోటీచేసి 12 స్థానాలు గెలిచి సత్తా చాటింది. ఒకప్పుడు బీహార్‌లో గణనీయంగా బలం కలిగిన సిపిఐ ప్రాభవం కోల్పోయినా 2 స్థానాలు, సిపిఎం 2 స్థానాలు, ఒక స్వతంత్రుడు గెలిచారు. గత ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమిలో ఉండి 13 స్థానాలకు పోటీ చేసిన వికాస్ శీలు ఇన్ సాన పార్టీ ఈసారి మహా కూటమిలో చేరినందున ఆ పార్టీకి నాలుగైదు స్థానాలు అయినా ఇవ్వక తప్పదు. కాంగ్రెస్ పోటీ చేసే స్థానాలను 50కి తగ్గించు కోవాలని ఒప్పించడం తేజస్వికి సవాలే. 2020 ఎన్నికలలో బిజెపి, జెడియు పార్టీలు ఎన్‌డిఎగా పోటీ చేసి 125 స్థానాలు గెలిచి మళ్ళీ నితీష్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మహా కూటమి 110 స్థానాలు గెలవగా అందులో 144 స్థానాలకు పోటీ చేసిన ఆర్‌జెడి 75 స్థానాలు గెలిచి తేజస్వి ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యారు. ఎన్‌డిఎకు 37.26 శాతం ఓట్లు రాగా, మహా కూటమికి 37.23 శాతం ఓటు అంటే కేవలం 0.3 మాత్రమే తక్కువగా వచ్చాయి. బిజెపికి 19.46 శాతం, మజ్లిస్ పార్టీ ఉత్తర బీహార్ 'సీమాంచల్ ప్రాంతంలో పోటీ చేసి 5 స్థానాలు గెలిచి మహా కూటమిని దెబ్బతీసి ఎన్‌డిఎ గెలిచేలా చేసింది చిరాగ్ పా స్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ సొంతంగా 54 స్థానాల్లో బరిలోకి దిగి 25 స్థానాల్లో జెడియు గెలుపును దెబ్బతీసింది. జెడియును తగ్గించడానికి ఇది కమలనాథులు పన్నిన కుతంత్రం అనే విమర్శలు గమనార్హం. అందుకే జెడియు స్థానాలు 43కు తగ్గాయి. ఇన్నాళ్లూ దూరంగా ఉన్న నితీశ్ కుమారుడు నిశాంత్ ఇప్పుడు తన తండ్రికి ముఖ్యమంత్రిగా మరో అవకాశం ఇవ్వాలని మోడీని కోరుతున్నారు. ఈసారి గెలిస్తే బిజెపికే ముఖ్యమంత్రి పదవి అని కొన్నాళు గా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. నితీశ్ కుమార్‌కు కేంద్రంలో పదవి ఇచ్చి బిజెపి నేతకు సిఎం పదవి ఇస్తారని అంటున్నారు. అది నిజం కాకపోతే 35 యేళ్ళ తేజస్వి కి, 73 యేళ్ల నితీశ్ కు పోటీ జరిగితే బీహార్ ప్రజలు ఎవరిని గెలిపిస్తారు అనేది ఆసక్తికరంగా ఉంది. బీహార్ సామాజిక స్వరూ పాన్ని పరిశీలిస్తే అగ్రవర్ణాలు 16 శాతం కాగా, బిసిలు 27 శాతం, అత్యంత వెనుకబడిన తరగతుల వారు 36 శాతం, దళితులు దాదాపు 20 శాతం, ముస్లింలు 17 శాతం, యాదవ్‌లు 14 శాతం ఉన్నారు. బీహార్‌లో నెలకు 6 వేల కంటే ఆదాయం గలవారు 34 శాతం ఉన్నారు. చంద్రగుప్తుడు, అశోకుడు యేలిన మౌర్యసామ్రాజ్య వైభవం, గౌతమ బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు వంటి మహాత్ములు జన్మించిన పుణ్యభూమి, ఒకప్పుడు నలందా వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు యెంతో వైభవంగా విల'సిల్లిన' చారిత్రక భూమి స్వాతంత్ర్యం లభించి 77 ఏళ్లు గడిచినా ఇంకా వెనుకబడి ఉండటం విచారకరం. అపార మానవ వనరుల వినియోగానికి కులమత ,ప్రాంతీయ ధోరణులు లేకుండా అభివృద్ధే ఏకోన్ముఖంగా. నడిపే దక్షత గల నాయకత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యం.

# కేడీ దినేష్ ఆధ్వర్యంలో టీడీపీ పార్టీ పతాకావిష్కరణ





**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీ రామారావు 102 వా జన్మదిన సందర్భంగా గోషామహల్ నియోజకవర్గం గోషామహల్ డివిజనులలో చుడి బజార్ లో కేడీ దినేష్ తెలంగాణా తెలుగుదేశం పార్టీ రాష్ట్రనాయకుడు ఆధ్వర్యంలో టీడీపీ పార్టీ పతాకావిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ నాయకుడు రామ్ నారాయణ యాదవ్ విచ్చేసి పార్టీ పతాకావిష్కరణ చేసినారు. ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించి కేక్ కట్ చేసి అందరికీ తినిపించి శుభాకాంక్షలు తెలుపుకుంటూ కార్యక్రమాలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సోమశేఖర్ కురుమ ,ఉపాధ్యక్షుడు ప్రేమ్ ప్రకాష్ శర్మ, జనరల్ సెక్రటరీ ఎ. శివరాజ్, సతేందర్ సింగ్, సాంబశివ ముదిరాజ్, దామోదర్ శర్మ, కిషన్ రావు, సతీష్, ధీరజ్ శర్మ, గౌతమ్, తదితరులు యుగపురుషుడు ఎన్టీఆర్ గారి జన్మదిన పండుగ గా జరుపుకున్నారు.

# జూన్ 8 వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ..

**చేప ప్రసాదం పంపిణీ కోసం ఫిషరీస్ డిపార్ట్మెంట్ నుండి 1.5 లక్షల చేపల ఏర్పాటు**

**చేప ప్రసాదం కోసం వచ్చే భక్తులకు గత సంవత్సరం కంటే అదనంగా మరిన్ని ఏర్పాట్లు చేయాలి**

**నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలి , అగ్నిమాపక బృందాలు అప్రమత్తంగా ఉండాలి**

**పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి జీహెచ్ఎంసీ,విద్యుత్ తదితర డిపార్ట్మెంట్లు సమన్వయం చేసుకొని పని చేయాలి**

**చేప ప్రసాదం పంపిణీ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** జూన్ 8 వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో చేయాల్సిన ఏర్పాట్ల పై సచివాలయంలో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జీహెచ్ ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్ వివిధ విభాగాల అధికారులు సమీక్షా సమావేశం లో పాల్గొన్నారు.

హైదరాబాద్ లో 185 సంవత్సరాలుగా ఉబ్బస వ్యాధిగ్రస్తులకు బత్తిని సోదరులు పంపిణీ చేస్తున్న చేప ప్రసాదం పై ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. లక్షలాది మంది పాల్గొనే చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో పోలీసులు పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకోవాలని లా అండ్ ఆర్డర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీస్ అధికారులకు సూచించారు. ఈసంవత్సరం చేప ప్రసాదం పంపిణీ కోసం 1.5 లక్షల చేప పిల్లలను ఏర్పాటు చేసినట్లు ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు తెలిపారు. చేప పిల్లల ఖర్చును నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ భరించాలని సూచించారు. వచ్చే భక్తులకు క్యూ లైన్ లో ఇబ్బందులు లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ,మహిళలకు వృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ పాస్ లు లిమిట్ గా పెట్టడం వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని సూచించారు.

చేప ప్రసాదం కోసం బయట రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉండడంతో వారికి సరిపడ తాగునీటి సౌకర్యాలు , టాయిలెట్స్ ఏర్పాటు , స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే బోజన సౌకర్యాలకు ఇబ్బందులు లేకుండా వారికి జీహెచ్ఎంసీ నుండి సహకారం అందించాలని పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ చుట్టూ పది పార్కింగ్ ప్రదేశాలు ఎరోటి చేసినట్టు వెల్లడించారు. వాహనాలు మొరాయించినప్పుడు వాటిని తీసుకెళ్లడానికి క్రేన్ వాహనాలు సిద్ధం చేసుకోవాలని సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఉండేలా చూడాలని,మొబైల్ టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు.గార్బేజ్ తరలింపునకు వాహనాలు సిద్ధం చేయాలని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ లు ఫిష్ పర్యవేక్షణ చేస్తారని , ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పర్యవేక్షణ ఉంటుందని అధికారులు మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లారు. దూద్ బౌలి, నాంపల్లి లో కరెంట్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కి రావడం కోసం ఆర్టీసీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ ,చర్లపల్లి నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నారు. చేప ప్రసాదం పంపిణీ జరిగే ప్రదేశాల్లో వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ,నాలుగు హెల్త్ క్యాంపులు ,నాలుగు అంబులెన్స్ లు ఏర్పాటు చేస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. చేప ప్రసాదం వేసే వాలంటీర్లకు సీపీఆర్ శిక్షణ ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. చేప ప్రసాదం కోసం టోకెన్ లకు అదనపు కౌంటర్ లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఐ అండ్ పీఆర్ ఎప్పటికప్పుడు ప్రకటనలు ఇవ్వడం చేప ప్రసాదం కోసం వచ్చే సౌకర్యాలు తదితర వాటిపై చూసుకోవాలని తెలిపారు. లయన్స్ క్లబ్ ,ఎన్‌సీసీ నుండి వాలంటీర్ లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అన్ని డిపార్ట్మెంట్ లను కోఆర్డినేట్ చేసుకోవడానికి 20 ప్రాంతాల్లో ఒక ఆర్డీవో,ఒక అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

సమీక్షా సమావేశంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి,అడిషనల్ సిపి విక్రమ్ సింగ్ మాన్, సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి,రెవెన్యూ ,హెల్త్,ఫైర్, వాటర్ వర్క్, ఆర్ అండ్ బి , బత్తిని కుటుంబ సభ్యులు బత్తిని అమరనాథ్ గౌడ్ , గౌరీ శంకర్ ,చంద్రశేఖర్ ,శివ శంకర్ , సంతోష్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కొండగట్టులో చెత్త చెదారంతో దుర్గంధ వాసన

**–నిర్లక్ష్యానికి నిదర్శనం చెత్త చెదారంతో ఉన్న క్యూ లైన్**

**దర్శనానికి వచ్చిన భక్తుల ఆవేదన**

చొప్పదండి జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా లక్షలాది భక్తుల దర్శనాలతో కాషాయ రంగుతో కళకళలాడుతుంది...ఎంతో లక్షలాదిమంది భక్తిప్రపత్తులతో నియమ నిబంధనలతో గుండంలో పవిత్ర స్నానాలు చేసి స్వామి వారి దర్శనం కొరకు భక్తులు క్యూ లైన్ లో వేచి చూస్తుంటారు.. ఆలయం పరిసర ప్రాంతాలలో క్యూ లైన్ లలో చెత్త చెదారంతో దుర్గంధ వాసన వెదజల్లుతూ భక్తులకు అసౌకర్యంగా ఉందని పలువురు భక్తులు తమ ఆవేదన వ్యక్తంచేశారు. ఇతర రాష్ట్రాల నుండి మరియు తెలంగాణా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి లక్షలాది భక్తులు స్వామి వారి దర్శనం కొరకు వ్యయ ప్రయాసాలకు ఓర్చుకుని భక్తులు వస్తుంటారు.కోట్లాది రూపాయలు హుండీలో కానుకలు వస్తుంటాయి..కాని కనీసం పారిశుధ్యం.క్రమంగా లేదని కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారని ప్రతి సంవత్సరం ఇదే తంతుగా మారిన పట్టించుకునే నాథుడే లేదని భక్తులు అంటున్నారు.. కొబ్బరికాయలు అధిక ధరలకు అమ్ముతున్నారని పలువురు భక్తులు మీడియాకు తెలిపారు.దేశంలో కొండగట్టు ఆంజనేయస్వామికి మంచి పేరు ప్రతిష్టలు ఉన్నాయని కొండగట్టులో పరిస్థితి మారడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.ఇప్పటికైన అధికారులు,పాలక వర్గాలలో లో మార్పు వచ్చి కొండగట్టు అభివృద్ధి పరచాలని భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

# మొక్క జొన్న కాల్చే యంత్రంతో స్వయం ఉపాధి.

జయశంకర్ భూపాలపల్లి మొక్క జొన్న కంకులు కాల్చడం, ఉడికించడం మరియు మొక్క జొన్నతో వివిధ రకాల తిను బండారాలు చేస్తూ, ఇన్నోవేటివ్ ఆలోచనతో స్వయం ఉపాధి పొందుతున్న రైతు మధుకర్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అభినందించారు. జిల్లాలోని చిట్యాల మండలం, జూకల్ గ్రామానికి చెందిన మధుకర్ బిటెక్ (సివిల్ ఇంజినీరింగ్) విద్యానభ్యసించారు. ఆర్థిక ఇబ్బందులు వల్ల ఉద్యాబ్యాసం మధ్యలో మానేయాల్సి వచ్చింది. స్వయం ఉపాది కొరకు ఆలోచన చేసిన మధుకర్ 50 వేల రూపాయల విలువతో విద్యుత్తు ద్వారా మొక్క జోక్క కంకులు కాల్చి, ఉడికించే యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఈ యంత్రం వినియోగం ద్వారా త్వరగా కంకులు కాల్చడం, ఉడికించడం చేస్తూ ఉపాధి పొందుతున్నారు. నెలకు 30 నుండి 50 వేల రూపాయల వరకు ఆదాయం వస్తుందని మధుకర్ తెలిపారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా డీఆర్డీఓ ద్వారా కేటాయించిన స్టాల్ లో మొక్క జొన్నలు విక్రయిస్తూ ఆదాయం పొందానని ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి స్టాల్ పరిశీలించి కాల్చిన మొక్క జొన్న కంకులు తిని బావున్నాయని అభినందించారని తనకు ఇదొక ప్రేరణగా నిలిచిందని తెలిపారు. మహిళా సంఘాలకు ఉపాధి కల్పనకు ఇలాంటి యూనిట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ డిఆర్డీఓ కు సూచించారు.

# ఆహారపు అలవాట్లపై అవగాహన ఏదీ?

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ప్రతి ఒక్కరూ వారు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు. మనిషి బతకడానికి తిండి అత్యవసరం. అయితే తిన్న తిండి జీర్ణం కావడం అతి ముఖ్యం. అందుకే ఎలాంటి ఆహారం తినాలి? ఎంత తినాలి? అదెంత శుభ్రంగా ఉండాలి? ఉప్పు, కారం వంటి వాటితో పాటు ఎంత మోతాదులో ఆహారం తీసుకోవాలి? అనే అంశాలపై కనీస అవగాహన ఉండి తీరాలి. ఆరోగ్యానికి ఆహారమే పునాది. రోజును ఆరోగ్యకరమైన అల్పాహారంతో ప్రారంభించాలి. చాలావరకు జబ్బులకు గతి తప్పిన ఆహార అలవాట్లే కారణం. భోజనం చేసేటప్పుడు ప్రశాంతంగా ఉండాలి. భోజనం మీదే దృష్టి పెట్టి, రుచిని ఆస్వాదిస్తూ తినాలి. బాగా నములుతూ, నెమ్మదిగా తినాలి. పూర్తిగా నమలి తింటే ఆహారం బాగా జీర్ణమై, పోషకాలు సరిగా ఒంట పడతాయి. ఆహారంలో ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు అన్నీ సమతులంగా ఉండేలా చూసుకోవాలి. రోజుకు 400 గ్రాముల పండ్లు, కూరగాయలు తినాలన్నది ప్రపంచ ఆరోగ్యసంస్థ సిఫారసు. వీటిల్లో 150 గ్రాముల పండ్లు, 250 గ్రాములు కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. మనిషి ఆరోగ్యం జీర్ణ వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. కొవ్వు పదార్థాలు కాకుండా, ఎక్కువగా పీచు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలి. తద్వారా జీర్ణ క్రియ సమస్యలు మటుమాయం అవుతాయి. గుండె, ఎముకల ఆరోగ్యం, శరీరంలోని మిగిలిన భాగాల ఆరోగ్యాన్ని కాపాడు కోవడం వెనుక జీర్ణ వ్యవస్థ పనితీరు చాలా ముఖ్యం. ఆరోగ్యం మన చేతుల్లో ఉండాలంటే , జీర్ణవ్యవస్థలో ప్రధానమైన కాలేయం ను జాగ్రత్త గా కాపాడు కోవాలి. జీర్ణ వ్యవస్థలో వచ్చే మార్పుల ద్వారా

గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యల వల్ల గుండె మంట, కడుపు నొప్పి, అతిసారం, కడుపు ఉబ్బరం, వికారం, వాంతులు కలిగే అవకాశం ఉంటుంది. చిరు తిండ్లు, ఘాటైన ఆహారం అధిక కెఫిన్, పంచదార సేవనం, తదితర అనారోగ్యకరమైన ఆహారం వల్ల ఉదర నాళంలో సమస్యలు వస్తాయి. అధిక కొవ్వుతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల పేగుల గీతలలో మార్పులు కలిగించి ఉదర నాళంలో కణితులు ఏర్పడే అవకాశం కలుగుతుంది. ఎక్కువగా పీచు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల, ఐబిడి, హెమరాయి, మలబద్ధం కలిగిన వ్యాధులను నివారించ వీలు కలుగుతుంది. తీసుకునే ఆహారంలో సరిపడా ప్రొటీన్ ఉండేలా, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. జీర్ణ వ్యవస్థ ప్రక్రియను తగ్గించే అధిక కొవ్వు కలిగిన ఆహారాన్ని పరిమితం చేసుకోవాలి. వంటకాల్లో ఆలీవ్ ఆయిల్ను వినియోగించడం చేయాలి. ఆహారం జీర్ణం కావడానికి సమయం ప్రకారం ఆహారాన్ని తీసుకోవడం అతి ముఖ్యం. పసిరకలు, పాంక్రియాస్ సమస్యలతో పాటు మలబద్ధకం, మలంలో రక్తం రావడం, కొలన్ క్యాన్సర్ వంటి సమస్యలు, జీర్ణ సంబంధిత ఇబ్బందులు తరుచూ వస్తుంటాయి. పొగ తాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. నిరంతర ఒత్తిడి వల్ల కూడా అల్సర్ రావడానికి అవకాశాలు ఉంటాయి. మామూలుగా త్రేన్పులు వచ్చినా, అపాన వాయువులు ఎక్కువగా వచ్చినా గ్యాస్ట్రిక్ సమస్య ఏర్పడిందని అనుకోవడం, అలా ప్రపంచంలో గ్యాస్ట్రిక్ నివారణకు ఏటా రూ లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నారు. దోసకాయలు, పుచ్చకాయ, మామిడి మొదలైన పండ్లలో నీరు ఉంటుంది. ఈ పండ్లు అవయవాలను, జీర్ణ వ్యవస్థను శుభ్రపరచ డానికి సహాయ పడతాయి. ఆహారంలో వీలైనంత ఎక్కువ తాజా పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు ఉండాలి. సమతుల్య భోజనం తినడానికి ప్రయత్నించాలి. రుచిగా ఉందని అతిగా తినకుండా చూసుకోవాలి. గింజలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. చిరుతిండి, కృత్రిమ మధుర పదార్థాలు, రంగులు లేదా అధిక చక్కెరను కలిగి ఉన్న అధిక ప్రాసెస్ చేసిన ఆహారాలను నివారించాలి. మానసిక ఒత్తిడి... గుండె సమస్య నుండి జీర్ణ సమస్యల వరకు అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఒత్తిడి స్థాయిల క్రమబద్ధీకణకు వ్యాయామం, ధ్యానం, యోగా, ఇష్టపడేదాన్ని చేయడం, శరీరంపై ఒత్తిడి వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను తగ్గించడంలో సహాయపడతాయి.

# పర్వతారోహణకు పెరుగుతున్న ఆదరణ

1953 న్యూజీలాండ్కు చెందిన 'సర్ ఎడ్మండ్ హిల్లరీ', నేపాల్కు చెందిన 'టెన్సింగ్ నారే షెర్పా' ద్వయం తొలిసారి అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ పర్వాతాన్ని అధిరోహించి పర్వతారోహణ క్రీడా ప్రపంచ చరిత్రలో రికార్డు సృష్టించారు. 2008లో ప్రఖ్యాత పర్వతారోహకులు ఎడ్మండ్ హిల్లరీ తుది శ్వాస విడిచిన వేళ ఈ చారిత్రాత్మక ఘటనకు గుర్తుగా 29 మే 2008 నుంచి నేపాల్ ప్రభుత్వం 'అంతర్జాతీయ ఎత్తైన ఎవరెస్టు పర్వతం సముద్ర మట్టానికి 8,848, 86 మీటర్ల (29,031.7 " అడుగులు) ఎత్తున ఉన్నది. మౌంట్ ఎవరెస్టు పర్వతాన్ని నేపాలీలు 'సగరమతా' అని అలాగే టిబెటన్లు 'చోమోలున్గమా' పర్వతమని పిలుస్తారు. 1830–43 శ్రీ మధ్య తొలిసారి సర్వే చేసిన భారత సర్వేయర్ జనరల్ 'సర్ జార్జ్ ఎవరెస్ట్' ఈ పర్వతాన్ని గుర్తించారు. వారి స్మారకార్థం ఈ పర్వతానికి 'ఎవరెస్ట్' అని నామకరణం చేశారు. అంతర్జాతీయ ఎవరెస్ట్ దినం వేదికగా పర్వతారోహకులు, ఔత్సాహిక పర్యాటక సంస్థలు పర్వతారోహణ క్రీడ పట్ల అవగాహన కల్పిస్తూ సదస్సులు, కార్యశాలలు ప్రదర్శనలు, ఆసక్తికర పోటీలు నిర్వహిస్తారు. హిమాలయాల్లోని 'మహాలంగూర్ హిమల్' సబ్–రేంజ్లో అత్యంత ఎత్తైన ఎవరెస్టు పర్వతం చైనా–నేపాల్ సరిహద్దుల్లో ఉన్నది. ఎవరెస్ట్ పర్వతారోహణలో ప్రతికూల వాతావరణం, బలమైన గాలులు, అవలాంచ్ ప్రమాదాలు, అల్టిట్యూడ్ సిక్నెస్, మంచు చెరియలు విరిగి పడడం లాంటి ప్రాణాంతక ప్రమాదాలు ఉ 1 ఎవరెస్ట్ దినం' జరుపు కోవడం ఆనవాయితీగా మారింది. ప్రపంచంలోనే అత్యంత ంటాయి. 2019 గణాంకాల ప్రకారం 306కు పైగా ఎవరెస్ట్ పర్వతారోహకులు అధిరోహించాలనే ప్రయత్నాలలో ప్రాణాలు విడవడం, అలాంటి సాహసికుల పార్థివ దేహాలు ఆ మంచు కొండల్లోనే కలవడం జరిగింది. ఆక్సీజన్ బాటిల్ వెంట ఉ న్నప్పటికీ పర్వతారోహకులు వాంతులు, అలసట, వికారం, హిమఘాతం (ఫ్రోస్టైట్), అల్పోష్ణస్థితి లాంటి పలు అనారోగ్యాల పాలు అవుతారు. పర్వతారోహణాన్ని పూర్తి చేసి గర్వంగా దిగువకు వచ్చిన వారు పలు శారీరక, మానసిక బలహీనతలతో బాధ పడడం సాధారణంగర్వంగా దిగువకు వచ్చిన వారు పలు శారీరక, మానసిక బలహీనతలతో బాధ పడడం సాధారణంగా జరుగుతుంది. నేటి వరకు 4,042 మంది పర్వతారోహకులు ఎవరెస్టు అధిరోహించగా, అందులో 635 మంది మహిళలు కూడా ఉన్నారు. పర్వతారోహణకు అనేక మాసాల శిక్షణ, తయారీ మరియు సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించుటకు దాదాపు 65,000 డాలర్ల రుసుము, ఖరీదైన పరికరాలు అవసరం అవుతాయి. ఎవరెస్ట్ పర్వతాన్ని అత్యధికంగా 21 సార్లు అధికోహించిన రికార్డును 'అపా షెర్పా' మరియు 'పుర్బా షెర్పా'లు దక్కించుకున్నారు. ప్రతి ఏటా మే, సెప్టెంబర్ మాసాలు ఎవరెస్టు ఎక్కడానికి అనువైన సీజన్లుగా గుర్తించారు. పర్వతారోహకులకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు 19 రోజులు, అక్కడి నుండి ఎవరెస్ట్ శిఖరాగ్రానికి దాదాపు 40 రోజుల సమయం పడుతుంది. ప్రతి ఏటా దాదాపు 800 మంది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహిస్తున్నారు. ఎన్ని అవాంతరాలు, ప్రతికూలతలు ఎదురైన పర్వతారోహకులు ఎవరెస్ట్ లాంటి అత్యంత ఎత్తైన మంచు పర్వతాన్ని అధిరోహించాలని తపన పడడం అభినందనీయం. ప్రాణాలకు తెగించి సాహసం చేసే పర్వతారోహణ సాహస వీరులకు శుభాకాంక్షలు తెలియజేద్దాం, ఆ క్రీడ పట్ల యువతను ప్రోత్సహిద్దాం.

# సాహిత్యానికి ఇంద్రగంటి సేవలు

తెలుగు సాహితీ ప్రపంచంలో సుపరిచితులైన సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ దాదాపు లేదనే చెప్పాలి. పండిత వంశంలో జన్మించి, సాహితీ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని, సినిమా పాటలు రాసిన కవిగా, పండితునిగా, కథా రచయితగా, పత్రికా సంపాదకునిగా, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు. తూర్పు గోదావరి జిల్లా, రామచంద్ర పురంలో శ్రీకాంత శర్మ మే 29 1944 న జన్మించారు. ఆయన తండ్రి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గొప్ప కవి. తెలుగు పొట్టి కథలకు "కథానిక" అనే అద్భుతమైన పేరు సూచించి, ఆ సాహితీ ప్రక్రియకు ఒక సమున్నత స్థానాన్ని కల్పించిన హనుమచ్ఛాస్త్రి గొప్ప కవి కావడం మూలాన, చిన్ననాటి నుండే సాహిత్య వాతావరణం లో పెరిగిన శ్రీకాంత శర్మ, విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగం చేపట్టారు. తెలుగులో ఎం.ఏ. పట్టభద్రులై, తర్వాత అభ్యుదయ కవిగా శర్మ పేరొందారు. అనేక లలిత గేయాలు కవితలు, సాహిత్య వ్యాసాలతో పాటు రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలను రచించారు. జన్మనిచ్చిన పితృ దేవుల వారసత్వాన్ని నిలబెట్టడంతో పాటు, అర్థవంతమైన రచనలెన్నో చేసి, సాహితీ ప్రియుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు శ్రీకాంత శర్మ. అపురూపమైన భావావేశం సొంతం చేసుకొని, ఆవేశాన్నైనా, ఆవేదననైనా అక్షరాల్లో లయబద్ధంగా అమర్చ గలగడం, పాఠకుల మనసులతో పాటు, మెదళ్ళనీ రచనల ద్వారా కదిలించ గలగడం శ్రీకాంత శర్మ ప్రత్యేకతలు. పలు తెలుగు సినిమాల్లో ఆయన పాటలు రాశారు. 'కృష్ణావతారం', 'నెలవంక', 'రావుగోపాల రావు', 'రెండుజెళ్ల సీత', 'పుత్తడి బొమ్మ', 'చైతన్య రథం' వంటి చిత్రాల్లో శ్రీకాంత శర్మ పాటలు రాశారు. తన కుమారుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తెరకెక్కించిన 'సమ్మోహనం' సినిమాలోనూ ఆయన పాటను రాశారు. ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఉప సంపాదకులుగా ఉద్యోగ జీవితం మొదలు పెట్టినా, కొంతకాలం సినిమా రంగంలో పని చేసినా, ఆలిండియా రేడియోలో అడుగు పెట్టాకనే శ్రీకాంతశర్మ సృజనాత్మకత పూర్తిగా రెక్కలు విప్పుకుంది. ఆయన రచించిన ఎన్నో సంగీత రూపకాలు జాతీయ స్థాయిలో బహుమతులు అందు కున్నాయి. ఆయన రచించిన లలిత గీతాలు ఈనాటికీ బహుళ ప్రాచుర్యంలో ఉన్నాయి. తెలుగు నాటక రంగానికీ, తెలుగు సాహిత్య రంగానికీ ఆయన చేసిన కృషి ఎన్నదగినది. 1976లో ఆకాశవాణి విజయ వాడ కేంద్రంలో అసిస్టెంట్ ఎడిటర్ గా శర్మ చేరాడు. తెలుగు ప్రసంగాల శాఖకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాసంగికులు ఉషశ్రీకి సహాయకునిగా సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. శర్మ వివిధ పత్రికలలో గేయాలు, కవితలు, సాహిత్య వ్యాసాలు వాశారు. అనేక రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలు రచించారు. రేడియో ప్రసంగాలు చేశాడు. 1994లో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్గా నిజామాబాద్ కేంద్రంలో పని చేశాడు. 1995లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకులుగా చేరారు. 1977లో అనుభూతి గీతాలు కవితా సంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం, 1979లో నూతలపాటి సాహితీ పురస్కారం, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో అమరామరం డాక్యుమెంటరీకి ప్రథమ బహుమతి, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో వర్షానందిని సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1986లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నేనుకాని నేను సృజనాత్మక రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మాటా – మౌనం సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నిశ్శబ్దగమ్యానికి ద్వితీయ బహుమతి, 1990లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మెట్లకు ద్వితీయ బహుమతి, తదితరాలు సొంతం చేసుకున్నారు. ఆయన సతీమణి ఇంద్రగంటి జానకీబాల ప్రముఖ రచయిత్రి. నవలా రచయిత్రిగా, రేడియో కళాకారిణిగా, లఘు కథల రచయిత్రిగా, కవయిత్రిగా సుపరిచితులు. కుమార్తె కిరణ్మయి కూడా లఘు చిత్రాలు తీస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్నారు. కుమారుడు ఇంద్రకంటి మోహన కృష్ణ సినీ దర్శకునిగా మంచి గుర్తింపు పొందారు. దర్శకునిగా ఆయన తొలి చిత్రం 2004లో గ్రహణంకు భారత జాతీయ చలన చిత్ర పురస్కారం, ఉత్తమ నూతన దర్శకులుగా నంది పురస్కారంతో పాటు ఆ సినిమాకు 11 అవార్డులు దక్కడం విశేషం. 2006లో మాయాబజార్, 2008 లో అష్టా చమ్మా, 2011లో గోల్కొండ హైస్కూల్, 2013లో అంతకు ముందు ఆ తర్వాత ( ఉత్తమ కథా రచయిత గా నంది అవార్డు), 2015లో బందిపోటు, 2016లో జెంటిల్ మాన్, 2017 లో అమీతుమీ, 2018లో సమ్మోహనం, 2020లో వి. తదితర చిత్రాలలో తన ప్రతిభను చాటారు.

# కన్నడ రెబల్ స్టార్ అంబరీష్



అంబరీష్ (1952 మే 29 – 2018 నవంబర్ 24) సినిమా నటుడు, రాజకీయ నాయకుడు. కన్నడ సూపర్‌స్టార్, రెబల్ స్టార్. అంబరీష్ అసలు పేరు మాలవల్లి హుచ్చే గౌడ్ అమర్నాథ్. ఆయన 1952 మే 29వ తేదీన మైసూర్ స్టేట్ (ప్రస్తుత కర్ణాటక రాష్ట్రం), మండ్య జిల్లా, దొడ్డ రాశినకెరే గ్రామంలో హుచ్చె గౌడ, పద్మమ్మ దంపతుల ఏడుగురు సంతానంలో ఆరవ వాడిగా జన్మించాడు. ఆయన పోషించిన పాత్రలకు గాను రెబల్ స్టార్‌గా పేరు పొందాడు. ఆయనకు మాండ్యా మనిషి అనే ముద్దు పేరు ఉంది. అమర్‌నాథ్ ప్రాథమిక విద్యా భ్యాసం మండ్య పట్టణంలో జరిగింది. మైసూరులో ఉన్నత విద్యాభ్యాసం చేశాడు. సినిమాల్లో మొదటగా ప్రతినాయక పాత్రలు పోషించి తర్వాత కథానాయకుడిగా మారి సుమారు ఐదు దశాబ్దాల పాటు సినీ రంగంలో ఉన్న ఆయన 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు తెలుగు సినిమాల్లోనూ కీలకపాత్రలు పోషించారు. ఆయన చివరి సినిమా 'అంబి నింగె వయస్సాయ్తో' సైతం బాక్సాఫీసు వద్ద కలెక్షన్లు కురిపించింది. ప్రముఖ కన్నడ చలనచిత్ర దర్శకుడు పుట్టణ్ణ కనగాళ్ తన నాగరహావు చిత్రానికి ప్రతినాయకుని పాత్రకు సరైన నూతన నటుని కోసం వెదుకుతూ అంబరీష్‌ను ఎంపిక చేశాడు. ఆవిధంగా అంబరీష్ 1972 తొలి సారిగా సినిమాలలో అడుగు పెట్టాడు. ఇదే నాగరహావు చిత్రం ద్వారా విష్ణువర్ధన్ కథా నాయకునిగా పరిచయ మయ్యాడు. అప్పటి నుండి అంబరీష్ అనేక కన్నడ, తమిళ, మలయాళ, తెలుగు, హిందీ చిత్రాలలో నటించాడు. ఇతడు అత్యధిక సినిమాలలో నటించి రాజ్‌కుమార్ (206 చిత్రాలు), విష్ణువర్ధన్ (230 చిత్రాలు)ల రికార్డును బద్దలు చేశాడు. చక్రవ్యూహ, నాగరాహువు, రంగనాయకీ, మసండ హూవు, గండు బేరుండ' వంటి పలు ప్రఖ్యాత ప్రేక్షక, అభిమానుల ఆదరణ పొందిన సినిమాలు ఆయన ఫిల్మోగ్రఫీలో ఉన్నాయి. చిరంజీవి 'శ్రీమంజునాథ' సినిమాలో మహరాజు పాత్రలో అంబరీష్ కనిపించాడు. ఆ చిత్రం తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కింది. అంబరీష్, ప్రముఖ తెలుగు నటి సుమలత హీరో హీరోయిన్లుగా 'ఆహుతి, అవతార పురుషా, శ్రీమంజునాథ, కళ్లరాలై హూవగీ' తదితర సినిమాల్లో నటించారు. వీరి పరిచయం ప్రేమగా మారడంతో 1992లో సుమలత అంబరీశ్ వివాహం చేసుకున్నారు. వారి కుమారుడు అభిషేక్ గౌడ కూడా సినిమా నటుడే. 1994 లో అంబరీష్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. నటనకు స్వస్తి చెప్పిన ఆయన కన్నడ రాజకీయాల్లో కీలక పాత్రను పోషించాడు. కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించాడు. 1996 ఎన్నికల్లో పార్టీ టికెట్ దక్కక పోవడంతో జనతాదళ్ పార్టీలో చేరి 1998 నుంచి మండ్య నియోజక వర్గం నుండి ఎన్నిక య్యాడు. మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో చేరి రెండు పర్యాయాలు మాండ్య లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందాడు. 1998 నుంచి 2009 వరకు లోకసభ సభ్యుడిగా కొనసాగారు. 2006 నుంచి 2008 వరకు14వ లోక్‌సభలో కేంద్రమంత్రి వర్గంలో సమాచార శాఖా మంత్రిగా కొనసాగారు. కావేరి జలాల విషయంలో నిరసనగా తన పదవికి రాజీనామా చేశాడు. 2009లో సాదరణ ఎన్నికల్లో పరాజయం పాలయ్యాడు. 2013 ఎన్నికల్లో శాసనసభకు ఎన్నికైన అంబరీష్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. అనారోగ్యం కారణంగా తర్వాతి ఎన్నికలలో పోటీ చేయలేదు. సహాయం కోసం వచ్చే ఎవరినీ అంబరీష్ వట్టి చేతులతో పంపేవాడు కాదనీ, సాయం చేసి, ధైర్యం నింపేవారని చెప్పేవారు. కన్నడ ఇండస్ట్రీ 'ట్రబుల్ షూటర్' అనే పేరుని గడించాడు. ఇండస్ట్రీలో ఎటువంటి మనస్పర్థలు ఏర్పడినా, చిన్న చిన్న గొడవలైనా కూడా వాళ్ల మధ్య సఖ్యత కుదిర్చే వారట. పలు రాష్ట్ర ప్రభుత్వ, ఫిలింఫేర్ అవార్డులు ఆయనకు లభించాయి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎన్.టి.ఆర్. పురస్కారం, ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ నటుడు పురస్కారం, ఫిల్మ్‌ఫేర్ జీవిత సాఫల్య పురస్కారం, కర్ణాటక ప్రభుత్వం నుండి విష్ణువర్ధన్ పురస్కారం మొదలైన పురస్కారాలు లభించాయి. 2005లో ఆయన ఎన్టీఆర్ జాతీయ అవార్డును అందుకున్నారు. 2013లో ధార్వాడ్ యూనివర్సిటీ ఆయనను డాక్టరేట్‌తో సత్కరించింది. ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ, 2018, నవంబర్ 24 శనివారం సాయంత్రం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అభిమాన నటుడు అంబరీష్ తుదిశ్వాస విడిచాడు.

## చింతపండు బస్తాల చోరీ

యాదాద్రి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కొంతమంది ఉద్యోగుల చేతివాటం బయటపడింది. ప్రసాద్ విక్రయశాల గోదాం నుంచిచింతపండు బస్తాలను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న వైనం బయటపడింది. ఆలయ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని స్థానికులు, భక్తులు అంటున్నారు. యాదగిరిగుట్ట కొండపైన గోదాం నుంచి 10 బస్తాల చింతపండు దొంగతనం చేస్తూ సురక్ష ఉద్యోగులు పట్టుపడ్డారు. పూర్తి స్థాయి ఈఓ లేకపోవడంతో అధికారులు ఇష్ట రీతిన వ్యవహరిస్తున్నారు.

### శిశు విక్రయాల ముఠా అరెస్టు

సూర్యాపేట సీసీఎస్ పోలీసులు ఒక అక్రమ శిశు విక్రయాల ముఠా ను అదుపులోకి తీసుకున్నారు. ముఠాలో ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులున్నారు. ముఠా నుంచి 16 నెలల మగ శిశువు స్వాధీనం చేసుకున్నారు. శిశువును.. చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. రాజస్థాన్, అలహాబాద్, గుజరాత్ రాష్ట్రాల నుంచి 22 మంది శిశువులను తెచ్చి విక్రయించినట్లు గుర్తించారు. ఒక్కో శిశువుకు.. 3 లక్షల నుంచి 7 లక్షల వరకు విక్రయించినట్లు సమాచారం. నిందితుల్లో.. హైదరాబాద్, సూర్యాపేట, విజయవాడ వాసులు వున్నారు. గతంలోను నిందితులపై శిశు విక్రయాల కేసులున్నట్లు సమాచారం.

## వెంకటరావుపేటలో రోడ్డెక్కిన రైతులు

రాజన్నసిరిసిల్ల కోనరావుపేట మండలం వెంకటరావుపేటలో రైతులు రోడ్డెక్కారు. సన్న రకం వరిధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ మొలకొచ్చిన ధాన్యం, పురుగుల మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. నిమ్మపల్లి ఎక్స్ రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తారోకో చేసారు. నెలలు గడుస్తున్న ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేసారు. లెక్టర్ రావాలి... సన్న ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యం పండించాలని, 500 బోనస్ ఇస్తామని చెప్పి కొనుగోలు చేయడంలో జాప్యంపై మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు కదలమని భీష్మించుకుని కూర్చుకున్నారు. అధికారులు పట్టించుకోకపోతే పురుగుల మందు తాగి చస్తామని హెచ్చరించారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేసారు.

# తూర్పుగోదావరి జనసేనకు ఇచ్చేశారా...

రాజమండ్రి, మే 28,తూర్పుగోదావరి జిల్లా కాపు సామాజికవర్గం నేతలు టీడీపీలో ఉంటే వారికి భవిష్యత్ లోనూ పదవులు కష్టమేనా? అంటే అవుననే అనిపిస్తుంది. ఎందుకంటే తూర్పు గోదావరి జిల్లాలో కాపు సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేతలకు ఈసారి కేబినెట్ లో స్థానం దక్కలేదు. కాపులు అంటే జనసేన అని ముద్రపడిపోయింది. దీంతో గత కొన్ని దశాబ్దాలుగా టీడీపీ కోసం పనిచేస్తున్న కాపు నేతలు ఈసారి పదవులు లేకుండా పోవడానికి జనసేన కారణమని చెప్పక తప్పదు. ఎందుకంటే మంత్రివర్గం కూర్పులో కాపు సామాజికవర్గానికి చెందిన ముగ్గురికి పదవులు లభించాయి. అందులో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడు, నెల్లూరుకు చెందిన నారాయణ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన అచ్చెన్నాయుడులకు మాత్రమే దక్కాయి. వాసంశెట్టి సుభాష్ కు లభించినా శెట్టి బలిజ కావడంతో కాపులు పరిగణనలోకి తీసుకోరు తూర్పు గోదావరి జిల్లా టీడీపీలో సీనియర్ నేతలు లేరంటే లేరని కాదు. చాలా మంది ఉన్నారు. నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, యనమల రామకృష్ణుడు, జ్యోతుల నెహ్రూ, వేగేళ్ల జోగేశ్వరరావు వంటి వారు ఉన్నప్పటికీ వారికి మంత్రి పదవులు దక్కలేదు. జనసేనకు చెందిన పవన్ కల్యాణ్, కందుల దుర్గేష్ వంటి వారికి పదవులు లభించడంతో ఇక టీడీపీలో కాపు సామాజికవర్గానికి చెందిన నేతలకు మంత్రి పదవులు ఇవ్వలేకపోయారు. ఇక నామినేటెడ్ పదవుల విషయంలోనూ తూర్పు గోదావరి జిల్లాలో జనసేనలో ఉన్న కాపు నేతలకే ప్రాధాన్యత దక్కుతుండటంతో కొంత టీడీపీ నేతల్లో అసహనం వ్యక్తమవుతుంది. టీడీపీలో కూటమి ప్రభుత్వం ఉన్నంత కాలం తమకు పదవులు రావని నేతలు డిసైడ్ అయ్యారు. ఒకరకంగా చెప్పాలంటే తూర్పు గోదావరి జిల్లాను జనసేనకు రాసిచ్చినట్లే కనపడుతుందని ఒక టీడీపీ సీనియర్ నేత వ్యాఖ్యానించారంటే పరిస్థితికి అద్దం పడుతుంది. పవన్ కల్యాణ్ సూచించిన వారికే తూర్పు గోదావరి జిల్లాలో నామినేటెడ్ పదవుల నుంచి అన్ని రకాల పదవులు లభిస్తుండటంతో ఇక అటు వైపు చూడటం కూడా వృధా అని నేతలు భావించే పరిస్థితికి వచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా తూర్పు గోదావరి జిల్లాలో ప్రభావితం చేయగలనేత పవన్ కల్యాణ్ అని భావించి జనసేనకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లాలోని టీడీపీ నేతలు సైకిల్ ఎక్కి రాజకీయంగా ప్రయాణించడం కంటే గాజు గ్లాసు పట్టుకోవడం మంచిదన్న నిర్ణయానికి వచ్చారు. ఒకప్పుడు కంచుకోటగా... తూర్పు గోదావరి జిల్లా అంటే ఒకప్పుడు టీడీపీకి కంచుకోట. బలమైన ఓటు బ్యాంకు కూడా ఉంది. కేవలం కాపు సామాజికవర్గమే కాకుండా ఆ జిల్లాలో ఉన్న బీసీలతో పాటు మిగిలిన సామాజికవర్గం నుంచి కూడా ఎన్టీఆర్ హయాం నుంచి టీడీపీకి అండగా నిలిచింది. అలాంటి చోట గత ఏడాది కాలం నుంచి టీడీపీ నేతల్లోనూ క్యాడర్ లోనూ నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి. కొందరు నేతలు బహిరంగంగానే బయటపడుతున్నప్పటికీ మరికొందరు మాత్రం లోలోపల మదనపడుతున్నారు. అధికారంలో ఉండేందుకు ఇంకా నాలుగేళ్లు సమయం ఉండటంతో వేచి చూద్దామని ధోరణిలో మరికొందరు నేతలున్నారు. అందుకే తమ రాజకీయ భవిష్యత్ ను గోదారిలో కలపవద్దంటూ పార్టీ నేతలు అధినాయకత్వానికి మొరపెట్టుకుంటున్నారు.

# మహానాడులో అంతా చినబాబుదే

కడప, మే 28, కడప మహానాడులో నారా లోకేశ్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. మహానాడు వేదికగా ఆరు శాసనాలను ప్రకటించారు. నారా లోకేశ్ ప్రసంగం కూడా కార్యకర్తలే తనకు అధినేతలు ఆయన చెప్పుకొచ్చారు. భవిష్యత్ లో తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలకే పెద్దపీట వేస్తుందని కూడా మహానాడు వేదికగా లోకేశ్ హామీ ఇచ్చారు. కార్యకర్తలు నేతలపైన ఆధారపడవద్దని జనంలోకి వెళ్లాలని, అప్పుడే వెతుక్కుంటూ తెలుగుదేశం పార్టీ మీ వెంట వస్తుందని నారా లోకేశ్ అసలు సీక్రెట్ చెప్పుకొచ్చారు. కార్యకర్తల సంక్షేమానికి తమ పార్టీ ఎప్పుడూ పాటుపడుతూనే ఉంటుందని, అందుకే దేశంలో ఏ పార్టీకి లేనంతగా కోటి సభ్యత్వాలు ఒక్క తెలుగుదేశం పార్టీకి మాత్రమే ఉన్నాయని లోకేశ్ అన్నారు.. ఇక నారా లోకేశ్ ఈ మహనాడులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికవుతారన్న ప్రచారం ఊపందుకోవడంతో ఉన్నత స్థాయిలో ఉన్న నేతల నుంచి దిగువ స్థాయి నేతల వరకూ నారా లోకేశ్ దృష్టిలో పడటానికి ప్రయత్నించేందుకు ఎక్కువ పాటుపడుతున్నట్లు కనిపించింది. నారా లోకేశ్ ప్రసంగానికి మంచి రెస్పాన్స్ రావడం బట్టి లోకేశ్ నాయకత్వాన్ని తాము సమర్థిస్తున్నామని చప్పట్లతో చెప్పకనే నేతలు, కార్యకర్తలు చంద్రబాబుకు చెప్పేశారు. ప్రధానంగా తనకు పుంగనూరులో అంజిరెడ్డి తాత, మంజుల అక్క, పల్నాడులో తోట చంద్రయ్య తనకు స్ఫూర్తి అంటూ చెప్పుకొచ్చిన లోకేశ్ వారిని ఆదర్శంగా తీసుకుని తాను ముందుకు వెళతానని కూడా చెప్పుకొచ్చి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు... నారా లోకేశ్ కు ఈ మహానాడు ఎంతో ప్రత్యేకం. ఇప్పటి వరకూ ఎన్ని మహానాడులు జరిగినప్పటికీ గత మహానాడులో పార్టీ అధికారంలో లేదు. అయినా లోకేశ్ అప్పుడు తన ప్రసంగంతో కొంత కార్యకర్తల్లో ఉత్సాహం నింపినా, కడప జిల్లాలో జరిగే మహానాడు మాత్రం తనలోని నాయకుడిని కార్యకర్తలకు చూపించిన తర్వాత మాత్రమే ఆయన లీడర్ గా ఎదిగానని చెప్పుకోవడానికి ఏమాత్రం సంకోచించలేదు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలయిన మంగళగిరి నుంచి మాత్రమే పోటీ చేసి తిరిగి గెలవడంతో పాటు యువగళం పాదయాత్రతో కార్యకర్తలను, నేతలను ఏకం చేయడంలో లోకేశ్ సక్సెస్ అయిన తీరు కూడా పార్టీలో ఆయన ఎదుగుదలకు కారణమయిందని చెప్పాలి. అందుకే లోకేశ్ వెనక ఎవరు ఉన్నారన్నది పక్కన పెడితే ఆయన ఆలోచనలు, తీసుకునే నిర్ణయాలు, అందుబాటులో ఉండే సమయం వంటివి అదనపు బలాలుగా మారాయని చెప్పకతప్పదు.

పదవులు తెచ్చే వేదిక

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు బయటకు వస్తాయి. తెలుగుదేశం పార్టీ స్థాపించి దాదాపు నాలుగు వసంతాలు కావడంతో అక్కడ పుట్టి.. పెరిగిన రాజకీయ నేతలు తర్వాత మంచి స్థానంలోకి వెళ్లారు. కొందరు ముఖ్యమంత్రులు కాగా, మరికొందరు కీలకమైన మంత్రి పదవులను దక్కించుకున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ నుంచి వచ్చి బయటకు వెళ్లిన వారు ఇతర పార్టీల్లో చేరి మంత్రులుగా చేరిన వారు అధికంగా కనిపించే వారు. కానీ ఇప్పుడు మాత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వాళ్లే మంత్రులు, ముఖ్యమంత్రులుగా అధికంగా ఉండటం కనిపిస్తుంది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న వాళ్లు వివిధ కారణాలతో పార్టీ మారి ముఖ్యమంత్రులగానో, మంత్రులుగానో మారిపోయారు. తాజాగా మహానాడు కడపలో జరుగుతున్న సమయంలో ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది. ఎన్టీఆర్ హయాం నుంచి మహానాడు ప్రారంభమయింది. నాడు మహానాడులో పాల్గొని తర్వాత రాజకీయాల్లో ఉన్నత స్థాయికి వెళ్లిన వారు, అమాత్యపదవులు అందుకున్న వారు ఎందరో ఉన్నారు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలో ఎక్కువ మంది పొలిటీషియన్స్ తెలుగుదేశం పార్టీలో రాజకీయ ఓనమాలు దిద్ది తర్వాత ఎదిగి బుగ్గకార్లు ఎక్కిన వారు అనేక మంది ఉన్నారు. మహానాడులో ఇది చర్చనీయాంశంగా మారింది. అతెందుకు రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత తెలంగాణకు ముఖ్యమంత్రులు అయిన ఇద్దరూ టీడీపీకిచెందిన వారే. కేసీఆర్, రేవంత్ రెడ్డి అక్కడి నుంచి వచ్చిన వారే. నాడు జరిగిన మహానాడులో వారు చేసిన ఉపన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అందుకే నేటి తరం రాజకీయ నేతలకు మహానాడుతో విడదీయరాని బంధం ఉంది. నాడు మహానాడు వేదికపై ఉన్న రోజా, అవంతి శ్రీనివాస్, కొడాలి నాని, విడదల రజిని వంటి వారు వైసీపీ హయాంలో మంత్రులయ్యారు. ఇక కేసీఆర్ పదేళ్లు పాటు అధికారంలో ఉన్నప్పుడు కేబినెట్ లో ఉన్న వారిలో ఎక్కువ మంది టీడీపీ నుంచి వచ్చిన వారే. గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస యాదవ్ వంటి వారు మంత్రి పదవులు దక్కించుకున్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కేబినెట్ లోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క వంటి వారు కూడా టీడీపీ నుంచి ఓనమాలు నేర్చుకుని వచ్చిన వారే. అందుకే టీడీపీ ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో రాజకీయంగా ఎదిగేందుకు వేదికగా మారిందని చెప్పాలి.

# టీడీపీ టచ్ లోకి మరో ఎంపీ

విజయవాడ, మే28, వైసీపీ నుంచి ఒక్కొక్క నేత పార్టీని వీడి వెళ్లిపోతున్నారు. ముఖ్యమైన నేతలు ఇప్పటికే పార్టీని వదిలివెళ్లిపోవడంతో ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఆ ప్రభావం పడిందనే చెప్పాలి. అదే సమయంలో జగన్ వ్యవహార శైలిని నచ్చని మరికొందరు కూడా పార్టీని వీడి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. త్వరలోనే ఒక ముఖ్యనేత కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేత పార్టీకి త్వరలోనే గుడ్ బై చెప్పనున్నారని అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. టీడీపీ నేతల ప్రలోభాల వల్ల కావచ్చు. లేదా జగన్ వ్యవహార శైలి ఇక మారదని భావించి పార్టీని వీడటమే మంచిదన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు తెలిసింది. వైసీపీని ఇప్పటికే మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసులురెడ్డి, అవంతి శ్రీనివాస్ లతో పాటు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య కూడా పార్టీని వీడారు. దీంతో పాటు విజయసాయిరెడ్డి కూడా పార్టీకి రాజీనామా చేసి రాజకీయాలకు ప్రస్తుతం దూరంగా ఉంటున్నారు. ఇక ఇదే సమయంలో మోపిదేవి వెంకటరమణ నమ్మకమైన నేతగా ఉన్న ఆయన కూడా పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ సభ్యులు నలుగురు రాజీనామా చేసి వెళ్లిపోవడంతో ఇక ఎవరూ రాజీనామా చేసే అవకాశం లేదని చెబుతున్నారు. కానీ వైసీపీ హయాంలో కీలకంగా వ్యవహరించిన వారిపై వరస కేసులు నమోదు అవుతుండటంతో పార్టీని వీడే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. జగన్ ను మానసికంగా దెబ్బకొట్టాలంటే వైసీపీ నుంచి అవసరం లేకపోయినా పార్టీలో తీసుకునేందుకు టీడీపీ సిద్ధమయింది. ఇందులో భాగంగా మరొక రాజ్యసభ సభ్యుడికి గాలం వేసినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యసభ పదవి పొందిన వారిలో ఒకరితో టీడీపీ నేతలు టచ్ లోకి వెళ్లారని చెబుతున్నారు. ప్రస్తుతం వైసీపీలో ఏడుగురు రాజ్యసభ సభ్యులున్నారు. వారిలో వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, నిరంజన్ రెడ్డి, మేడా రఘునాథ్ రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీలు ఉన్నారు. వీరిలో వైవీసుబ్బారెడ్డి జగన్ కు బాబాయి కావడంతో ఆయన బయటకు వెవెళ్లే అవకాశంలేదు. ఆయనకు జగన్ కీలక బాధ్యతలను పార్టీలో అప్పగించే అవకాశాలున్నాయి. ఒక పిల్లి సుభాష్ చంద్రబోస్ జగన్ కు నమ్మకంగా ఉంటున్నారు. నిరంజన్ రెడ్డి, ఆళ్ల అయధ్య రామిరెడ్డి, మేడా రఘునాధరెడ్డి లు తాము పార్టీని వీడేది లేదని చెప్పారు. అయితే వైవీ తప్పించి మిగిలిన ఆరుగురిలో పరిమళ్ నత్వానీ పదవీ కాలం త్వరలోనే పూర్తవుతుంది. దీంతో మిగిలిన ఐదుగురిలో ఒకరిపై తెలుగుదేశం పార్టీ గురిపెట్టింది. వీరిలో ఒకరితో ఇప్పటికే టీడీపీలో టచ్ లోకి వెళ్లినట్లు సమాచారం అందుతుంది. రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో తిరిగి వారికే పదవి ఇస్తామని చెప్పడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి కీలక పదవి ఇస్తామని చెప్పడంతో ఆయన వైసీపీకి రాజీనామా చేయడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

## జూరాల ప్రాజెక్టుకు వరద నీరు షురూ

జోగులాంబ గద్వాల జూరాల ప్రాజెక్టుకు వరద మొదలైంది... ఎగు ఎగువన కర్ణాటక మహారాష్ట్రలో కుదుస్తున్న వర్షాలతో జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్ఫ్లో కొనసాగుతుంది... 2.800 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుంది... జూరాల ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.684 టీఎంసీల నీరు నిల్వ చేరింది... ఎగువ ప్రాంతాల్లో వరద ఇలాగే కొనసాగితే మరో 4,5 రోజుల్లో ప్రాజెక్టు నిండుకుండలా మారే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు...

# కడప గడపలో పట్టు కోసం ప్లాన్

కడప, మే 28, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి సామాన్య టీడీపీ కార్యకర్త వరకూ అందరికీ ఆమోదయోగ్యంగా నిలిచింది కడపలో మహానాడు నిర్వహణ. ఇదే వేడుకలో చిన్నబాబు లోకేష్ ను ప్రమోట్ చేస్తారని వార్తలు వస్తుండగా..మహానాడు వేదికను ఫిక్స్ చేసిన లోకేష్ పార్టీలో అందరి అభిమానాలు అందుకుంటున్నారు.తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడుకు రంగం సిద్ధమైంది. కడప జిల్లాలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు మహానాడు నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కడప నగరం ఎటుచూసినా పసుపే కనిపిస్తోంది. 250 ఎకరాల సువిశాల ప్రాంగణంలో మహానాడు నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయితే ఈసారి కడపలో మహానాడు నిర్వహణకు ఒక ప్రత్యేకత ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో తొలిసారి కడపలో మహానాడును నిర్వహించడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. అయితే ఈ ఆలోచన చేసింది మాత్రం ఒకే ఒకరు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుతో ఊపు మీద ఉన్న తెలుగుదేశం పార్టీకి చిరస్మరణీయమైన గుర్తుగా ప్రత్యర్థి అడ్డాలో మహానాడును నిర్వహిద్దామని యువనేత నారా లోకేష్ ప్రతిపాదన చేశారు. రాయలసీమ.. అందునా వైఎస్ కుటుంబ అడ్డా కావడంతో ఎన్నెన్నో సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ నారా లోకేష్ ప్రతిపాదనకు జై కొట్టింది టీడీపీ హై కమాండ్. లోకేష్ ప్రతిపాదనకు పార్టీ శ్రేణుల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. దాని ఫలితమే పసుపుమయమైన కడన నగరం. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి సామాన్య టీడీపీ కార్యకర్త వరకూ అందరికీ ఆమోదయోగ్యంగా నిలిచింది కడపలో మహానాడు నిర్వహణ. ఇదే వేడుకలో చిన్నబాబు లోకేష్ ను ప్రమోట్ చేస్తారని వార్తలు వస్తుండగా..మహానాడు వేదికను ఫిక్స్ చేసిన లోకేష్ పార్టీలో అందరి అభిమానాలు అందుకుంటున్నారు.నారా లోకేష్ ఒక నాయకుడే అని ఎద్దేవా చేసిన వారు ఉన్నారు. ఆయనకు అంత సీన్ లేదులే అని ఎగతాళి చేశారు. రాజకీయంగా పనికి రారంటూ ముద్ర వేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు .బాడీ షేమింగ్ పై మాట్లాడిన వారు ఉన్నారు. నారా లోకేష్ ను టార్గెట్ చేసుకోవడానికి వందలాది సోషల్ మీడియా సైన్యం.. అంతకు మించి నేతల గణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండేది. కానీ అన్నింటినీ అధిగమించారు. సవాళ్లను ఎదుర్కొన్నారు. తనను తాను నిరూపించుకున్నారు. సుదీర్ఘ కాలం పాదయాత్ర చేశారు. రాళ్లను పూలుగా మార్చుకొని నిలబడ్డారు. పోయిన చోటే వెతుక్కొని పోరాటం చేసి అనుకున్నది సాధించారు. అయితే 2014 నుంచి 2019 మధ్య లోకేష్ అలుపెరగకుండా శ్రమించారు. అన్నింటికీ మించి తెలుగుదేశం పార్టీని ఏకతాటిపైకి తేగలిగారు. పార్టీని కష్టకాలంలో తన పాదయాత్రతో నిలబెట్టారు. తండ్రి చంద్రబాబు అరెస్టుతో పార్టీని నిర్వీర్యం చేయాలన్న ప్రత్యర్థి అంచనాలను తారుమారు చేశారు. ఏకంగా ప్రత్యర్థి ఇలాకాలో టీడీపీ కూటమి విజయాన్ని శాసించారు. దానిని దశాబ్దాల కాలం సుస్థిరం చేసుకునేందుకే కడపలో మహానాడు నిర్వహించాలని ప్రతిపాదన చేశారు లోకేష్. దానికి పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు లభించడంతో రెట్టింపు ఉత్సాహంతో ఇప్పుడు కడపలో మహానాడు మూడు రోజుల పాటు జరగనుంది.రాయలసీమ అంటే వైఎస్సార్ కాంగ్రెస్.. వైఎస్సార్ కాంగ్రెస్ అంటే రాయలసీమ అన్నట్టు పరిస్థితి ఉండేది. అంతలా ఉండేది ప్రాంతీయ అభిమానం. 2014 ఎన్నికల్లో రాయలసీమలో వైఎస్సార్ కాంగ్రెస్ దే పైచేయి. టీడీపీ కంటే వైసీపీ ఎక్కువ స్థానాలు సాధించింది. 2019లో అయితే వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. కుప్పం నుంచి చంద్రబాబు, హిందూపురం నుంచి నందమూరి బాలక్రిష్ణ, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్ మాత్రమే గెలిచారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రాయలసీమపై ఫోకస్ పెంచారు లోకేష్. తన సుదీర్ఘ పాదయాత్రను కుప్పం నుంచి ప్రారంభించారు. దారిపొడవునా వైసీపీ ప్రభుత్వంతో పాటు శ్రేణుల నుంచి అభ్యంతరాలు, ప్రతిఘటనలు ఎదురైనా బలంగా నిలబడ్డారు. వివాద రహితంగా, గాంధేయవాదంతో తాను పాదయాత్రను పూర్తిచేశారు. ప్రజలతో మమేకమయ్యారు. పాదయాత్రకు ఎదురైన అడ్డంకులను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే రాయలసీమ స్వరూపమే మారిపోతుందని హామీ ఇచ్చారు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో రాయలసీమకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. పారిశ్రామికీకరణకు రాయలసీమ సరైన భవిత అని టీడీపీ కూటమి ప్రభుత్వం సంకేతాలు పంపుతుండడంతో రాయలసీమలో టీడీపీ మరింత బలపడేలా ఉంది.కడపలో మహానాడును నిర్వహించడం ద్వారా ప్రత్యర్థికి సరైన సవాల్ పంపాలని నారా లోకేష్ భావించారు. అదే సమయంలో పార్టీలో యువరక్తం ఎక్కించాలని భావిస్తున్నారు. అందుకు మహానాడు కూడా వేదిక కానుంది. పార్టీలో వరుసగా మూడుసార్లు పార్టీ పదవులు చేపట్టిన వారు స్వచ్ఛందంగా తప్పుకోవాలని ప్రతిపాదన పెట్టిన లోకేష్ సంచలనానికి తెరలేపారు.

అందులో భాగంగానే ఈసారి లోకేష్ కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారని అంతా భావిస్తున్నారు. అయితే మరో నాలుగు దశాబ్దాలకుగాను టీడీపీ ఉనికి చాటుకునేలా బలమైన నాయకత్వానికి దిశ నిర్దేశం చేసేలా మహానాడు తీర్మానాలు ఉండబోతున్నాయని తెలుస్తోంది. అందుకే కడప వేదికగా భవిష్యత్ నిర్దేశం చేస్తే బాగుంటుందనే నారా లోకేష్ ఇక్కడే మహానాడును ఫిక్స్ చేశారు. అయితే ఈ నిర్ణయం రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయపరుస్తోంది.

# మూడు మార్గాల్లో సీ ప్లేన్...

కర్నూలు, మే 28, ఏపీలో పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా సీప్లేన్ సేవలను ప్రారంభించనుంది. దీని ద్వారా పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. మొదటి దశలో అమరావతి, తిరుపతి, గండికోట నుంచి సేవలు మొదలుకానున్నాయి. ఈసీ ప్లేన్ ప్రయాణంతో పర్యాటక రంగానికి ఊతమిచ్చినట్లు అవుతుంది. తక్కువ ఖర్చుతో మారుమూల ప్రాంతాలకు విమాన సౌకర్యం కలగనుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడే ఛాన్స్ ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పర్యాటక అభివృద్ధిపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా విదేశీ పర్యటకులను ఆకట్టుకునే విధంగా ఏపీలో పర్యాటక పాలసీ తెచ్చేందుకు ప్రయత్నాలు చేసింది. అవి ఇప్పటికే ఒక కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తున్నాయి. అందులో భాగంగానే రాష్ట్రంలో త్వరలో సీ ప్లేన్ అందుబాటులోకి తీసుకొచ్చే పనిలో పడింది ఏపీ ప్రభుత్వం.సాధారణంగా విమానాలుగాలిలో ఎగురుతాయి. అయితే ఈ సీ ప్లేన్ లు జలాశయంలో నీటిపై తేలియాడుతూ? ఆపై నింగిలోకి ఎగిరి విహరించేలా ప్లాన్ చేస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన సంస్థ దేశవ్యాప్తంగా 56 మార్గాల్లో సీ ప్లేన్ సేవలు అందించేందుకు టెండర్లు పిలిచింది. ఏపీలో 11 ప్రాంతాలను గుర్తించింది. వాటిలో ఎనిమిది ప్రాంతాల నుంచి సేవలు నడిపేందుకు టెక్నో ఫీజుబిలిటీ నివేదిక, డి పి ఆర్ తయారీకి టెండర్లు పిలిచారు. రాష్ట్రంలో మొదటి దశలో మూడు చోట్ల సేవలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ఈ తొలి విడతకు సంబంధించి ప్రకాశం బ్యారేజీ, తిరుపతిలోని కళ్యాణి డాం, గండికోట నుంచి సేవలు ప్రారంభించనున్నారు. అమరావతి తో పాటు గండికోట డిపిఆర్ బాధ్యతలను రైట్స్ సంస్థకు అప్పగించారు. తిరుపతి డిపిఆర్ బాధ్యతలను ఫీడ్బ్యాక్ హైవే సంస్థకు అప్పగించారు. ఆసక్తి ఉన్న సంస్థలతో అధికారులు చర్చలు కూడా జరుపుతున్నారు. అయితే మొత్తం 32 మార్గాలలో ఈ సీప్లేన్ రాకపోకలు సాగించేలా ప్రణాళిక రూపొందించారు. మొదటి దశలో చేపట్టే మూడు మార్గాలకు దగ్గర్లో ఎయిర్పోర్టు ఉండడం విశేషం. సిప్లేన్ సేవలు సాధారణ విమాన సర్వీసులతో కలిపి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. విమాన ఖర్చుల కంటే తక్కువగా టిక్కెట్లు అందుబాటులోకి తేవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే ఏపీలో సీ ప్లేన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత ఏడాది నవంబర్ 9న విజయవాడలోని పున్నమి ఘాట్ నుంచి శ్రీశైలం వరకు సిప్లేన్ ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పరిశీలించిన సంగతి తెలిసిందే. ట్రయల్ రన్ లో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రయాణం చేశారు. అది విజయవంతం కావడంతోనే కొత్తగా మూడు మార్గాల్లో సీ ప్లేన్ సేవలు ప్రారంభించేందుకు నిర్ణయించారు.

## మహిళల భద్రత కోసం శక్తి యాప్

విజయవాడ, మే 28, ఏపీలో మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శక్తి వాట్సాప్ నంబర్ను అందుబాటులోకి తీసుకు వచ్చారు. వాట్సాప్ భాగస్వామ్యంతో అత్యవసర సమయాల్లో మహిళలు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.

వాట్సాప్ కాల్, సాధారణ ఫోన్ కాల్ చేసినా బాధితులను వేగంగా గుర్తించి శక్తి టీమ్స్ సాయం చేస్తాయి.ఏపీలో మహిళల భద్రత కోసం "శక్తి వాట్సప్ నంబర్"ను ఏపీ పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. అత్యవసర సమయాల్లో కాల్ చేసినా, మెసేజ్ చేసినా స్పందించేలా వాట్సాప్ నంబర్ను అందుబాటులోకి తెచ్చాయి.మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శక్తి వాట్సాప్ నంబర్ 79934 85111 ను డీజీపీ హరీష్ గుప్తా మంగళవారం ప్రారంభించారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ భాగస్వామ్యంలో ఈ సేవల్ని ప్రారంభించారు.ఏపీ ప్రభుత్వం కొద్ది నెలల క్రితం తీసుకొచ్చిన "శక్తి" యాప్కు ప్రజల నుంచి చక్కటి ఆదరణ లభించింది. ఈ క్రమంలో మహిళల భద్రత కోసంఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్" ఆధ్వర్యంలో శక్తి వాట్సప్ నంబర్ 79934 85111 అందుబాటులోకి తీసుకు వచ్చారు.మంగళగిరి రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శక్తి వాట్సప్ నంబర్ ను ప్రారంభించారు. ఆపదలో ఉన్న మహిళలు శక్తి వాట్సప్ నంబరుకు కాల్ చేసినా, మెసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ కు సంకేతాలు వెళ్లిన వెంటనే శక్తి టీమ్స్ సత్వరమే స్పందించి ఆపదలో ఉన్న మహిళలను ఆదుకుంటాయని చెప్పారు. 24/7 శక్తి వాట్సాప్ నంబర్ అందుబాటులో ఉంటుందని డీజీపీ వివరించారు. సాంకేతికత సహాయంతో మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలకు చెక్ పెట్టేందుకు ఈ నంబర్ ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళలు విధిగా తమ మొబైల్ లో శక్తి వాట్సప్ నంబర్ ను సేవ్ చేసుకోవాలరి ఐజీ రాజకుమారి కోరారు

# అందాల భామల వెనుక కథలు

హైదరాబాద్, మే 28, నిజంగా కొన్ని చెప్పుకోవాలి. కొన్నింటి గురించి ప్రధానంగా చర్చించాలి.. అలాంటిదే ఇది కూడా. మన సమాజం అందాల పోటీలు అంటే 36 - 24 - 36 కొలతలే అనుకుంటుంది. ర్యాంపు వాకులు.. రాత్రిపూట పార్టీలు.. ఆ తర్వాత జరిగే అసాంఘిక కార్యకలాపాలే అని భావించుకుంటుంది.ముమ్మాటికి ఆ భావన తప్పు. అనుకునే విధానం మరింత తప్పు. ఒక సమస్యను బలంగా చాటి చెప్పాలి అంటే.. సమాజం దృష్టికి తీసుకురావాలి అంటే కచ్చితంగా ఒక బలమైన వేదిక అవసరం. అలాంటి వేదిక మిస్ వరల్డ్ పోటీలు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం మిస్ వరల్డ్ పోటీలకు వేదికగా మారింది. కొద్దిరోజుల నుంచి ప్రచారం కూడా భారీగానే చేస్తోంది. అయితే ఇందులో ఏర్పాట్లలో సరైన సమన్వయం లేకపోవడంతో ఇటీవల ఇంగ్లాండ్ కంటెస్టెంట్ చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. వాటిని కాస్త పక్కన పెడితే.. అందాల పోటీలలో పాల్గొనే సుందరీ మణులు పడుతున్న ఇబ్బందులు.. వారు ఇక్కడదాకా రావడానికి కల్పించిన చాలా భిన్నమైనవి.. వారు తమ ఎదుర్కొన్న కష్టాలు.. పడిన బాధలు చెబుతుంటే హృదయం ద్రవించిపోతుంది.అందాల పోటీలకు వచ్చిన ఓ వనిత చెప్పిన తన కథ నిజంగా బాధేసింది. ఆటవిక ఆచారాల నుంచి తనను తాను కాపాడుకుంది. ఉన్నంత ధైర్యంతో.. మూఢాచారాలపై ఎడతెగని పోరాటం చేస్తోంది. దీనిపై ఆమెకు అనేక బెదిరింపులు ఎదురయ్యాయి. చంపేస్తామనే హెచ్చరికలు కూడా వచ్చాయి. అయినప్పటికీ ఆమె వాటిని ధైర్యంగా ఎదుర్కొంది. తన సమస్యను ప్రపంచం ముందు గట్టిగా చెప్పాలని నిర్ణయించుకుంది. అందువల్లే అందాల పోటీలను ఒక వేదికలాగా భావించింది. ఆ వేదిక మీద దాని ఎదుర్కొంటున్న సమస్యను బలంగా చెప్పగలిగింది. అందువల్లే ఆమె ఇక్కడదాకా రాగలిగింది. తనలాంటి అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను బయటకి వివరించగలిగింది

# కాకాని క్లోజ్... ఇక కొడాలేనా

విజయవాడ, మే 28 ఒకరి తర్వాత ఇంకొకరి వంతు వస్తోంది. వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి ఇలా నోరు జారినోళ్లు..నోటికొచ్చినట్లు మాట్లాడినోళ్ల ఎపిసోడ్ ఒక్కొక్కటిగా అయిపోతోంది. ఇప్పుడు నెల్లూరు పెద్దారెడ్డిగా చెప్పుకునే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎపిసోడ్ కూడా స్టార్ట్ అయిందంటున్నారు టీడీపీ నేతలు. మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిపై రెండు నెలల క్రితమే కేసు పెట్టారు పోలీసులు.నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తాటిపర్తిలోని రుస్తుం మైన్స్ నుంచి అక్రమంగా క్వార్ట్ ఖనిజాన్ని తరలించారనే ఆరోపణలతో కాకాని గోవర్ధన్ రెడ్డిపై కేసు ఫైల్ అయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రుస్తుం మైన్ నుంచి దాదాపు 250 కోట్ల రూపాయల విలువైన క్వార్ట్‌ను అక్రమంగా తరలించారని అప్పట్లో వివాదం చెలరేగింది.ఈ గని లీజు కాలం ముగిశాక కూడా..వైసీపీ నేతలు ఆక్రమించుకుని ఇష్టానుసారంగా మైనింగ్ చేశారని..అంతేకాక రాళ్ళను పేల్చేందుకు పెద్దఎత్తున పేలుడు పదార్థాలను నిల్వ చేశారని పెద్ద ఇష్యూ అయింది. ఈ ఇష్యూపై కూటమి ప్రభుత్వం వచ్చాక కేసు పెట్టింది. అప్పటి కాకాణి తప్పించుకుని తిరుగుతున్నారంటున్నారు టీడీపీ నేతలు. ఎట్టకేలకు ఆయనను కేరళలో అరెస్ట్ చేసి..విజయవాడకు తరలించి కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపించారు పోలీసులుఇక నెక్స్ట్ అరెస్ట్ అయ్యేది మాజీ మంత్రి కొడాలి నానినే అని బలంగా చర్చ జరుగుతోంది. కేసు విచారణకు సహకరించకపోవడంతో పాటు పారిపోతాడనే కారణంతో ఇప్పటికే కొడాలి నానిపై లుక్ అవుట్ వారెంట్ జారీ చేశారు. అయితే గత కొంత కాలం నుంచి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న కొడాలినాని ఆరోగ్యం ఇంకా సెట్ కాలేదని..మెరుగైన ట్రీట్‌మెంట్ కోసం ఆయన అమెరికాకు వెళ్లనున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో కృష్ణా జిల్లా పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.అయితే ఇప్పటికే కొడాలి నానిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయి. అలాగే వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్‌పై అసభ్యకరంగా మాట్లాడారని ఫైలయ్యాయి. వీటితో పాటు ఇసుక, మట్టి, భూకబ్జాలకు సంబంధించి ఆరోపణలు, టిడ్కో ఇళ్ల పంపిణీ, జగనన్న కాలనీలో మెరక పేరుతో రూ.45 కోట్ల అవినీతి, విద్యుత్ అక్రమాలపై విజిలెన్స్ ఆరోపణలు ఉన్నాయి. వీటిన్నింటిపై విచారణ జరుగుతోంది. ఓ వైపు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలోనే కొడాలి నాని హైదరాబాద్‌లోని సంధ్య కన్వెన్షన్‌లో ఓ వివాహ వేడుకకు హాజరైనట్లు తెలుస్తోంది.ఇదే టైమ్‌లో లిక్కర్ స్కాం ఆరోపణలు కూడా వైసీపీ నేతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను కస్టడీకి తీసుకొని విచారించారు పోలీసులు. ఇప్పుడు ఈ ముగ్గురితో పాటు మరోసారి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డినీ కస్టడీకి తీసుకుని ప్రశ్నించనున్నారు. వాళ్లిచ్చే వివరాల ఆధారంగా ఓ వైసీపీ సిట్టింగ్ ఎంపీ అరెస్ట్ ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది.నానిపై కేసులు, లిక్కర్ స్కామ్ ఆరోపణలే కాదు.. మాజీ మంత్రులు విడదల రజిని, ఆర్కే రోజా కూడా కేసులు, ఆరోపణలు ఫేస్ చేస్తున్నారు. విడదల రజినిపై ఇప్పటికే ఏసీబీ కేసు నమోదు అయింది. ఓ క్రషర్ యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలతో..గుంటూరు అప్పటి ఎస్పీతో పాటు సీఐ, విడదల మరిది గోపి, ఆమె పీఏతో పాటు విడదల రజినిపై కూడా ఏసీబీ ఈఎఫ్ఐ కట్టింది.మాజీ మంత్రి ఆర్కే రోజా టార్గెట్‌గా ఆడుదాం ఆంధ్రా ప్రోగ్రామ్‌కు సంబంధించి ఏసీబీ విచారణకు ఆదేశించింది ప్రభుత్వం. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి టార్గెట్‌గా అటవీ భూముల ఆక్రమణలపై దర్యాప్తు కంటిన్యూ అవుతోంది. ఇలా వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలకంగా పనిచేసి..కూటమి నేతల టార్గెట్‌గా విమర్శలు చేసిన లీడర్లను వరుస కేసులు వెంటాడుతున్నాయి. అరెస్టుల ఎపిసోడ్‌లో నెక్స్ట్ ఎవరి వంతు వస్తుందో చూడాలి మరి.

# విజయవాడ నుంచ నేరుగా విదేశాలకు...

విజయవాడ, మే 28, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రముఖుల తాకిడి విపరీతంగా పెరుగుతోంది. దీంతో మరో మూడు నెలల్లోనే ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు ఎయిర్ పోర్టు అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వ్లలభనేని బాలశౌరి తెలిపారు. అలాగే 2028వ సంవత్సరం నుంచి నేరుగా అమెరికాలోని న్యూయార్క్ పట్టణానికి విమానం ఎగిరేలా సేవలు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అలాగే విదేశాలకు చెందిన ఎమిరేట్స్ విమానాలను కూడా నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రముఖుల తాకిడి విపరీతంగా పెరుగుతోంది. దీంతో మరో మూడు నెలల్లోనే నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని పూర్తి చేయాలని ఎయిర్ పోర్టు అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. అంతేకాకుండా 2028 నాటికి విమానాశ్రయం నుంచి నేరుగా అమెరికాలోని న్యూయార్క్ పట్టణానికి విమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు. అలాగే ఇతర దేశాలకు చెందిన ఎమిరేట్స్ విమానాలను కూడా ఇక్కడి నుంచి నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించింది. ఇందులో ఎయిర్ పోర్టు అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, వైస్ ఛైర్మన్ ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఇంఛార్జీ కలెక్టర్ గీతాంజలి శర్మ, డైరెక్టర్ లక్ష్మీకాంత రెడ్డి, జీఎం రామాచారి, ఎస్పీ గాంగాధర రావు, అధికారులతో కలిసి పాల్గొని.. విమానాశ్రయ అభివృద్ధితో పాటు ప్రయాణికుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ప్రతి రాష్ట్రానికి అనుసంధానం అయ్యేలా విమాన సర్వీసులు నడిపేందుకు వివిధ విమానయాన సంస్థలతో సంప్రదించినట్లు చెప్పారు.ఇవి మాత్రమే కాకుండా విజయవాడ నుంచి శ్రీలంక, సింగపూర్, థాయ్ లాండ్, దుబాయ్ లకు ఎమిరేట్స్ విమానాలు అందుబాటులోకి తీసుకు రావాలని ప్రయత్నిస్తున్నామన్నారు. అలాగే ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు 70 శాతం పూర్తి అయ్యాయని మంత్రి బాలశౌరి వివరించారు. అలాగే ప్రతి నెలా ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా సమీక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే విమానాశ్రయంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా టెర్మినల్స్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అందులో ప్రాచీన సంస్కృతి, కూచిపూడి భంగిమలు ఉంటాయన్నారుసీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి లోకేశ్ ల ఆదేశాలతోనే.. 12 డిజైన్లను మార్పు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కేశినేని చిన్నా చెప్పారు. వారణాసి, కొచ్చి, అహ్మదాబాద్ లకు కొత్త సర్వీసులు నడిపేందుకు సమాలోచనలు చేస్తున్నట్లు వివరించారు. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక వేగవంతం అయ్యాయని అన్నారు.

# హెచ్ సీఏ వేధింపులు నిజమే విజిలెన్స్ రిపోర్ట్

హైదరాబాద్, మే 28 ఆ మధ్య హైదరాబాద్ వేదికగా ఐపీఎల్ మ్యాచ్లు జరిగినప్పుడు.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సన్ రైజర్స్ యాజమాన్యాన్ని ఇబ్బందులకు గురి చేసిందని వార్తలు వచ్చాయి. దీనిపై సన్ రైజర్స్ యాజమాన్యం చేసిన ఒక మెయిల్ కూడా కలకలం సృష్టించింది.ఈ వ్యవహారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లడంతో.. ఆయన వెంటనే విజిలెన్స్ బృందాన్ని రంగంలోకి దింపారు. తక్షణమే తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఎప్పుడైతే విజిలెన్స్ బృందం రంగంలోకి దిగిందో.. అప్పుడే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కాళ్ళ బేరానికి వచ్చింది. ఇబ్బందులు పెట్టబోమని.. వేధింపులకు పాల్పడమని సంకేతాలు ఇచ్చింది. దీంతో విజిలెన్స్ విభాగం సైలెంట్ అయిపోయింది. అయితే ఈ విషయాన్ని అంత తేలిగ్గా వదిలిపెట్టనని ముఖ్యమంత్రి అప్పుడే సంకేతాలు ఇచ్చారు. ఈ క్రమంలోనే విజిలెన్స్ బృందాన్ని రహస్యంగా రంగంలోకి దింపారు. స్వయంగా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయడంతో విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ సాగించడంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఇబ్బందులకు పాల్పడిందని.. వేధింపులకు గురి చేసిందని.. అదనపు టికెట్ల కోసం సన్ రైజర్స్ యాజమాన్యానికి చుక్కలు చూపించిందని తేలింది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్రావు, కార్యదర్శి ఒత్తిడి చేశారని విజిలెన్స్ ఎంక్వయిరీలో తేలింది. ఇక దీనికి సంబంధించిన ప్రైమరీ రిపోర్టును ప్రభుత్వానికి అధికారులు సబ్మిట్ చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పై చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వానికి సూచించారు.ఈ సీజన్లో ఐపిఎల్ మొదలైన తర్వాత.. ఉప్పల్ వేదికగా జరిగే మ్యాచ్ల విషయంలో తమకు ఎక్స్ ట్రా టికెట్లు ఇవ్వాలని.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్రావు ఇబ్బందికి గురి చేస్తున్నాడని హైదరాబాద్ యాజమాన్యం ఒక లేఖ రాసింది.. ఇలానే తమన్న బెదిస్తే హైదరాబాద్ వదిలిపెట్టి వెళ్ళిపోతామని స్పష్టం చేసింది. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టిదాకా వెళ్లడంతో ఆయన విజిలెన్స్ విభాగాన్ని రంగంలోకి దింపారు. ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయడంతో విజిలెన్స్ అధికారులు లోతుగా దర్యాప్తు చేశారు. నిబంధనల ప్రకారం 10 శాతం టికెట్ల కంటే.. అదనంగా మరో పది శాతం టికెట్లు కావాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఒత్తిడికి గురి చేసిందని విజిలెన్స్ ఎంక్వయిరీలో తేలింది.. అయితే 10% టికెట్లు ఓపెన్ మార్కెట్లో కొనుగోలు చేయడానికి తమకు అవకాశం ఇవ్వాలని జగన్మోహన్రావు కొడితే హైదరాబాద్ యాజమాన్యం ఓకే చెప్పింది. అయితే వాటికి అదనంగా మరోపరిచారని టికెట్లు ఓపెన్ మార్కెట్లో ఇవ్వాలని జగన్మోహన్రావు హైదరాబాద్ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చారు.. దీనికి సన్ రైజెస్ ఒప్పుకోలేదు.. ఇక కాంప్లిమెంటరీ బాక్స్ టికెట్ల విషయంలోనూ తనకు వచ్చే వాటా ఇవ్వలేదని జగన్మోహన్రావు కక్ష సాధింపు పాల్పడ్డారు. హైదరాబాద్ ? తలపడుతున్నప్పుడు విఐపి బాక్సులకు తాళం వేశారు. దీంతో హైదరాబాద్ యాజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేస్తూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కి లేఖ రాసింది. ఆ లేఖ బయటికి లీక్ కావడంతో ఒకసారి ఆ విషయం బయటకు వచ్చింది.. అయితే విజిలెన్స్ ఎంక్వయిరీ జరుగుతుండగానే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్ రైజర్స్ హైదరాబాద్ పరస్పరం చర్చించుకున్నాయి. సమస్యను పరిష్కరించుకున్నాయి. అయితే విజిలెన్స్ ఎంక్వయిరీ పూర్తి కావడంతో మరోసారి ఈ విషయం సంచలనంగా మారింది. జగన్మోహన్రావు గత ప్రభుత్వ పెద్దలకు అత్యంత దగ్గర వ్యక్తి. పైగా అప్పట్లోనే అతడు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నియమితుడయ్యాడు. అతని వ్యవహార శైలి పై మొదటి నుంచి కూడా రేవంత్ రెడ్డి ఆగ్రహం గానే ఉన్నారు. ఇప్పుడు విజిలెన్స్ నివేదిక నేపథ్యంలో జగన్మోహన్ రావు పై రేవంత్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని వార్తలు వినిపిస్తున్నాయి.

## కొంపల్లిలో కుక్కల హల్ చల్



కుత్బుల్లాపూర్ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కలు పట్టపగలే పాదచారులకు చుక్కలు చూపిస్తున్నాయి. నిన్న ఒక్క రోజే 4గురికి కుక్క కాటుకు గురయ్యారు. కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు కనీస చర్యలు లేకుండా కాలం గడుపుతున్నారని స్థానికుల ఆరోపణ.ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు అంటూ స్థానికుల ఆగ్రహం. చిన్న పెద్ద తేడా లేకుండా పలువురిపై వీధి కుక్కలు ప్రతాపం చూపిస్తున్నాయి. నడి రోడ్డు పైన కుక్కలు గుంపులు గుంపులుగా చేరి స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి అని దూలపల్లి వాసులు.ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నేడే అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవం




ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతల 77వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది, ఇది శాశ్వత శాంతికి సంఘర్షణ పరివర్తనతో నలిగిపోయే దేశాలకు సహాయపడే ఒక ప్రత్యేకమైన మరియు డైనమిక్ పరికరం. 1948 లో మొదటి యుఎన్ శాంతి పరిరక్షణ మిషన్ స్థాపించబడినప్పటి నుండి, హింస, ప్రమాదాలు మరియు వ్యాధుల చర్యల ఫలితంగా 3,000 వేలకు పైగా సైనిక, పోలీసులు మరియు పౌర సిబ్బంది శాంతి సేవలో ప్రాణాలు కోల్పోయారు.1948 నుండి ప్రాణాలు కోల్పోయిన యుఎన్ శాంతిభద్రతలందరికీ గౌరవసూచకంగా యుఎన్ సెక్రటరీ పుష్పగుచ్ఛం ఇవ్వనున్నారు. మే 29 న, అన్ని యుఎన్ కార్యాలయాలు, సభ్య దేశాలు మరియు ప్రభుత్వేతర సంస్థలతో కలిసి, ఓడిపోయిన శాంతిభద్రతలను గౌరవించటానికి కార్యక్రమాలు నిర్వహిస్తారు. శాంతి కొరకు జీవించండి.అంతర్జాతీయ శాంతిభద్రతల చరిత్ర దినోత్సవం మొదటి యుఎన్ శాంతి పరిరక్షణ మిషన్ మే 29, 1948 న స్థాపించబడింది. జనరల్ అసెంబ్లీ మే 29 ను ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతల అంతర్జాతీయ దినంగా పేర్కొంది. 1948 లో "ఐక్యరాజ్యసమితి ట్రూస్ పర్యవేక్షణ సంస్థ" లేదా యుఎన్ టీఎస్‌వోఅనే మొదటి యుఎన్ శాంతి పరిరక్షక మిషన్ పాలస్తీనాలో కార్యకలాపాలు ప్రారంభించిన తేదీ ఇది. అప్పటి నుండి, 1 యుఎన్ కంటే ఎక్కువ మంది మహిళలు మరియు పురుషులు 72 యుఎన్ శాంతి పరిరక్షక కార్యకలాపాలలో పనిచేశారు, మిలియన్ల మంది ప్రజల జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేశారు మరియు లెక్కలేనన్ని ప్రాణాలను రక్షించారు.ఈ రోజున, ప్రజలు యుఎన్ శాంతి పరిరక్షణ కార్యకలాపాలలో పనిచేస్తున్న అన్ని పురుషులు మరియు మహిళల వృత్తి నైపుణ్యం, అంకితభావం మరియు ధైర్యానికి నివాళి అర్పించారు మరియు శాంతి కోసం ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థం గౌరవిస్తారు.ప్రతి సంవత్సరం మే 29 న, ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతల అంతర్జాతీయ దినోత్సవం ప్రపంచ సంస్థ యొక్క పనికి యూనిఫాం మరియు పౌర సిబ్బంది చేసిన అమూల్యమైన కృషికి నివాళి అర్పించింది.

# కంపెనీలు కన్నడ ఎందుకు వీడుతున్నాయి...

బెంగళూరు బహుసాంస్కృతిక, బహుభాషా నగరంగా పేరొందినప్పటికీ, ఇటీవలి కాలంలో కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది.బెంగళూరు, భారతదేశ టెక్ రాజధానిగా పేరొందిన నగరం. ఇటీవలి కాలంలో భాషా సంబంధిత వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. గత వేసవిలో నీటి సమస్య బెంగళూరును వేధించింది. ఈ వేసవిలో వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈక్వల్ లైఫ్ అనే సంస్థ తమ కార్యాలయాన్ని బెంగళూరు నుంచి పుణేకు తరలించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం బెంగళూరు యొక్కవాణిజ్య వాతావరణంపై, ముఖ్యంగా టెక్ రంగంపై, గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.బెంగళూరు బహుసాంస్కృతిక, బహుభాషా నగరంగా పేరొందినప్పటికీ, ఇటీవలి కాలంలో కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది. ఒకప్పుడు మహారాష్ట్రలో మరాఠి ఉద్యమాల తరహాలో బెంగళూరులో కన్నడ ఉద్యమాలు తీవ్రమవుతున్నాయి. స్థానిక కన్నడిగులు తమ భాష, సంస్కృతిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఈ ఉద్యమాలు చేపడుతున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో ఇవి ఘర్షణలకు దారితీస్తున్నాయి. బహుళజాతి సంస్థలు, స్టార్టప్‌లు, ఇతర వ్యాపారాలు బెంగళూరులో విస్తృతంగా ఉన్నాయి, వీటిలో ఉద్యోగులు దేశవ్యాప్తంగా వివిధ భాషా నేపథ్యాల నుంచి వస్తుంటారు. కన్నడ భాషను తప్పనిసరిగా ఉపయోగించాలనే ఒత్తిడి, ముఖ్యంగా బహిరంగ సైన్‌బోర్డులు, కార్యాలయ సమాచారంలో, కొంతమంది ఉద్యోగులకు, సంస్థలకు అసౌకర్యంగా మారింది. ఈక్వల్ లైఫ్ సంస్థ అధినేత కౌశిక్ ముఖర్జీ ఈ భాషా గొడవలు తమ సిబ్బందిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని స్పష్టం చేశారు.ఈక్వల్ లైఫ్ సంస్థ బెంగళూరు నుంచి పుణేకు తమ కార్యాలయాన్ని తరలించాలని నిర్ణయించడం ఒక ముఖ్యమైన అడుగు. కౌశిక్ ముఖర్జీ తన ఎక్స్ పోస్ట్‌లో, 'వచ్చే ఆరు నెలల్లో మా కార్యాలయాన్ని పుణేకు షిఫ్ట్ చేస్తాం. మా సిబ్బందిని ఈ భాషా సంబంధిత గొడవల బాధితులుగా మారనివ్వం,' అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను పరిశీలిస్తే, సంస్థలు తమ ఉద్యోగుల మానసిక శాంతి, ఉత్పాదకత, వ్యాపార స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నాయి. పుణే, బెంగళూరుతో పోలిస్తే, టెక్ హబ్‌గా ఉద్భవిస్తూ, సాపేక్షంగా తక్కువ భాషా సంబంధిత వివాదాలతో వ్యాపార స్నేహపూర్వక వాతావరణాన్ని అందిస్తోంది.పుణే, మహారాష్ట్రలోని మరో ముఖ్యమైన టెక్ కేంద్రం, ఇటీవలి సంవత్సరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. బెంగళూరుతో పోలిస్తే, పుణేలో భాషా సంబంధిత ఒత్తిడి తక్కువగా ఉంది, ఎందుకంటే ఈ నగరం బహుభాషా, బహుసాంస్కృతిక వాతావరణానికి పెట్టింది పేరు. అదనంగా, పుణేలోని హిన్జవాడి, బంజర్, ఖరడి వంటి ప్రాంతాలు టెక్ పార్కులు, స్టార్టప్‌లకు అనువైన మౌలిక సదుపాయాలను అందిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో కూడిన జీవన వ్యయం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, మెరుగైన కనెక్టివిటీ పుణేను కంపెనీలకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చాయి. ఈక్వల్ లైఫ్ ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని పుణేను ఎంచుకున్నట్లు తెలుస్తోంది.ఈక్వల్ లైఫ్ లాంటి సంస్థలు బెంగళూరును వీడడం దీర్ఘకాలంలో నగర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు. బెంగళూరు భారతదేశ ఐటీ రంగంలో సుమారు 40% వాటాను కలిగి ఉంది. అనేక బహుళజాతి సంస్థలు, స్టార్టప్‌లకు గమ్యస్థానంగా ఉంది. భాషా వివాదాలు ఇలాంటి సంస్థలు నగరాన్ని వీడేందుకు దారితీస్తే, ఇది ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. ఇప్పటికే కొన్ని ఇతర సంస్థలు కూడా ఇదే బాటలో పుణే, హైదరాబాద్, లేదా చెన్నై వంటి నగరాలకు షిఫ్ట్ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ పరిణామం బెంగళూరుకు ఉన్న 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా' హోదాకు సవాలుగా మారవచ్చు.బెంగళూరులో భాషా వివాదాలు కేవలం సామాజిక సమస్యలకు మాత్రమే పరిమితం కాదు.. ఇవి రాజకీయ కోణాన్ని కూడా కలిగి ఉన్నాయి. స్థానిక భాష, సంస్కృతిని కాపాడాలనే డిమాండ్లు స్థానిక రాజకీయ పార్టీలు, సంస్థల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. అయితే, ఈ డిమాండ్లు అతిగా మారినప్పుడు, అవి బహుసాంస్కృతిక నగరం స్వభావాన్ని దెబ్బతీస్తాయి. కర్ణాటక ప్రభుత్వం ఇటీవల కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని చట్టాలు తీసుకువచ్చినప్పటికీ, వీటిని అమలు చేసే విధానంలో సమతుల్యత కీలకం. ఈ వివాదాలు కంపెనీల నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయని ఈక్వల్ లైఫ్ ఉదాహరణ స్పష్టం చేస్తోంది.

# అమ్మకానికి హౌసింగ్ బోర్డు ప్లాట్స్

హైదరాబాద్, మే 28, తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం నిధుల సమీకరణకు కీలక నిర్ణయం తీసుకుంది. హౌసింగ్ బోర్డు ఆధీనంలోని వివాదరహిత ప్లాట్లను వేలం వేయనుంది. ఈ వేలం ద్వారా వచ్చే నిధులను ఇందిరమ్మ పథకానికి వినియోగిస్తారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ పథకం మొదటి దశ గృహ ప్రవేశాలు జరగనున్నాయి.తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 70 వేలకు పైచిలుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రతి నియోజవకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించేందుకు సిద్ధమవుతున్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేయనుండగా.. మె?త్తం 4 విడతల్లో ఈ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు నిధుల సమీకరణ కోసం తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర హౌసింగ్ బోర్డు తమ ఆధీనంలోని వివాదరహిత ప్లాట్లను వేలం వేయడానికి సిద్ధమవుతోంది. అన్ని జిల్లాల్లో గుర్తించిన ఈ ప్లాట్ల వివరాలను అధికారులు సిద్ధం చేశారు. త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసి, ఈ వేలం ద్వారా భారీగా రెవెన్యూ సమకూర్చుకోవాలని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నిధులను నేరుగా ఇందిరమ్మ పథకానికి ఉపయోగించాలని భావిస్తోంది.హైదరాబాద్‌తో పాటు జోగులాంబ గద్వాల, జడ్చర్ల, ఇతర జిల్లా కేంద్రాల్లోని ప్లాట్లను వేలం వేయనున్నారు. అధికారులు గుర్తించిన ప్లాట్లలో కోర్టు వివాదాలు లేనివి, ఎలాంటి కేసులు లేనివి, కమర్షియల్ ఏరియాల్లో ఉన్నవి ఉన్నాయి. మొత్తం 1250 జాగాలు (ప్లాట్లు) ఉండగా, ఇవి సుమారు 3.22 లక్షల చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి సమీపంలోని ఖైతలాపూర్‌లోనే 250కి పైగా ప్లాట్లు ఉన్నట్లు సమాచారం. ఈ ప్లాట్లకు మార్కెట్ విలువ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో హౌసింగ్ బోర్డుకు వేల కోట్ల విలువైన వందల ఎకరాల భూములు, ప్లాట్లు ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డితో పాటు మహబూబ్ నగర్, మెదక్, నల్గొండ జిల్లాల్లో ఈ భూములు అధికంగా ఉన్నాయి.అన్యాక్రాంతం కాకుండా వీటిని పరిరక్షించడానికి హౌసింగ్ బోర్డు చర్యలు చేపట్టింది. ప్లాట్ల చుట్టూ గోడలు, ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, అవి హౌసింగ్ బోర్డు భూములు అని తెలియజేస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

# రాజీనా... విభజనా...

హైదరాబాద్, మే 28, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్)కు రాసిన ఆరు పేజీల లేఖ రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ లేఖలో కవిత, బీఆర్ఎస్ ఇటీవల ఎల్కతుర్తిలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ సభలో కేసీఆర్ ప్రసంగం గురించి సానుకూల, ప్రతికూల అంశాలను పేర్కొన్నారు. బీజేపీని కేవలం రెండు నిమిషాలు మాత్రమే విమర్శించడం, వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు, షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ, వక్ఫ్ సవరణ చట్టం వంటి కీలక అంశాలను ప్రస్తావించకపోవడం వంటి అంశాలను విమర్శించారు. ఈ లేఖ బహిర్గతం కావడం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కవితను సున్నితంగా మందలించడంతో పార్టీ కేడర్‌లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. ఇలాంటి తరుణంలో తనను విమర్శినివారితో కాంప్రమైజ్ కాని కేసీఆర్.. ఈసారి మాత్రం సంచలన నిర్ణయం తీసుకున్నారు.తన నిర్ణయాతను తప్పు పట్టేవారు, తన నిర్ణయాలను ధిక్కరించేవారు ఎంతటివారైనా కేసీఆర్ సహించరు. పొమ్మనలేక పొగబెడతారు. ఆలె నరేంద్ర, విజయశాంతి, ఈటల రాజేందర్ వంటివారు ఇందుకు ఉదాహరణ. కానీ, కవిత విషయంలో మాత్రం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారు. కుటుంబ సభ్యురాలినే సస్పెండ్ చేస్తే.. పొమ్మనలేక పొగబెడితే క్యాడర్‌లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న ఆందోళన నెలకొంది. దీంతో తనకు ఆత్మలాంటి నేతలు రాజ్యసభ సభ్యుడు రామోదర్‌రావును రాయబారానికి కవిత వద్దకు పంపించారు. సోమవారం సాయంత్రం 6?7 గంటల సమయంలో కవిత ఇంటికి వెళ్లిన దామోదర్‌రావు తన వెంట న్యాయవాదిని కూడా తీసుకెళ్లారు. దామోదర్ రావు, కేసీఆర్‌తో సుదీర్ఘ అనుబంధం కలిగిన నేతగా, 'నమస్తే తెలంగాణ' పత్రిక స్థాపనలో కీలక పాత్ర పోషించారు. 2022లో కేసీఆర్ ఆశీస్సులతో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇలాంటి నేపథ్యంలో, ఆయన కవితను కలవడం రాజకీయంగా ముఖ్యమైన చర్చలకు దారితీసింది. కేసీఆర్ ఈ సందర్శనకు దామోదర్ రావును పంపించారా లేక ఇది వ్యక్తిగత సందర్శనా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.కవిత లేఖ వెలుగులోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్‌లో అంతర్గత కలహాలు బయటపడ్డాయి. ఈ లేఖ సమయంలో కేసీఆర్‌కు వారసుడిగా కేటీ.రామారావు (కేటీఆర్)ను ప్రకటించే సూచనలు ఉన్నాయి, ఇది కవితకు అసంతృప్తి కలిగించి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత లేఖలో కేసీఆర్ అప్రాప్యత, పార్టీ క్యాడర్‌తో సంబంధం తగ్గడం వంటి అంశాలను ప్రస్తావించడం ద్వారా, ఆమె తనకు పార్టీలో సరైన స్థానం లభించడం లేదనే సంకేతాలు ఇచ్చినట్లు కనిపిస్తోంది. కేటీఆర్ ఈ లేఖపై స్పందిస్తూ, పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా చర్చించడం కాకుండా, పార్టీ వేదికల్లోనే పరిష్కరించాలని పేర్కొన్నారుకవిత లేఖ బహిర్గతం కావడం వెనుక ఒక ఉద్దేశపూర్వక రాజకీయ కుట్ర ఉందని కొందరు భావిస్తున్నారు. ఈ లేఖను కవిత బృందం లీక్ చేసి ఉండవచ్చని, లేదా కేసీఆర్ కుటుంబంలోని కొందరు ఆమెను ఒంటరిచేయడానికి ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని ఊహాగానాలు సాగుతున్నాయి. కొన్ని సమాచారాల ప్రకారం, కవితకు షోకాజ్ నోటీసు జారీ చేయడం లేదా పార్టీ నుంచి సస్పెన్షన్‌కు దారితీసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, కవిత తన లేఖలో పేర్కొన్న అంశాలు సామాన్య కార్యకర్తల అభిప్రాయాలను ప్రతిబింబిస్తాయని, తనకు వ్యక్తిగత ఎజెండా లేదని స్పష్టం చేశారు.కవిత లేఖలో బీజేపీపై కేసీఆర్ మృదువైన వైఖరిని విమర్శించడం, బీఆర్ఎస్ ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం వంటి అంశాలు, పార్టీ బీజేపీతో సంబంధాలు కలిగి ఉండవచ్చనే ఊహాగానాలకు బలం చేకూర్చాయి. కవిత, ఢిల్లీ మద్యం కేసులో తన అరెస్టును బీజేపీతో ముడిపెడుతూ, ఆ పార్టీపై గట్టిగా విమర్శించాలని కేసీఆర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఈ లేఖను ఉపయోగించుకుని బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలను హైలైట్ చేస్తున్నారు.దామోదర్ రావు సందర్శన, కవిత లేఖ వివాదం బీఆర్ఎస్‌లో రాజీకి దారితీస్తాయా లేక పార్టీలో విభజనకు కారణమవుతాయా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. కొందరు రాజకీయ విశ్లేషకులు, కవిత కాంగ్రెస్‌తో చేతులు కలపవచ్చని లేదా కొత్త పార్టీని స్థాపించవచ్చని ఊహిస్తున్నారు. అయితే, కవిత తన విధేయత కేసీఆర్‌కు ఉందని, పార్టీలో చిన్నపాటి లోపాలను సరిదిద్దితే బీఆర్ఎస్ దీర్ఘకాలం అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు.

# ఈ సారి నలుగురికి అవకాశం

హైదరాబాద్, మే28 తెలంగాణలో కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం కూర్పుపై ఢిల్లీలో వరుస సమావేశాలు జరుగుతున్నాయి. కేబినెట్ లో ఆరు పదవులు ఖాళీ ఉండగా.. కొత్తగా నలుగురిని తీసుకోవాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం దక్కనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ సామాజిక వర్గాలకు చెందిన నేతల పేర్లనుసైతం కాంగ్రెస్ హైకమాండ్ ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది.ఢిల్లీ టెన్ జన్‌పథ్‌లోని సోనియాగాంధీ నివాసంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పార్టీ వ్యవహారాల జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ భేటీ అయ్యారు. తెలంగాణ కేబినెట్ లో మొత్తం ఆరు ఖాళీలు ఉండగా అందులో ప్రస్తుతం ఐదింటిని భర్తీ చేయడానికి హైకమాండ్ అంగీకరించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చినప్పటికీ విస్తరణకు ముహూర్తం మాత్రం ఇంకాఖరారు కాలేదు. శు భముహూర్తాలు ఈ నెల మొదటి వారంతో ముగియనుండటంతో ఈ రోజు విస్తరణ జరిగే అవకాశముందని కూడా కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేసీ వేణుగోపాల్, రాహుల్ గాంధీతో చర్చించిన అనంతరం విస్తరణకు రెడీ అయినట్లు సమాచారం.తెలంగాణ మంత్రివర్గ విస్తరణతోపాటు పీసీసీ నూతన కార్యవర్గం అంశాలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అంతేకాక నాలుగు మంత్రి పదవుల భర్తీకి సంబంధించి ఏడుగురి పేర్లు ప్రయారిటీలో ఉన్నాయని వివరించారని, దానిపై లిస్ట్ కూడా అందజేసినట్లు సమాచారం. అదేవిధంగా నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, తక్కువ సంఖ్యతో కూడిన పీసీసీ కార్యవర్గ లిస్ట్ ను సమర్పించినట్లు తెలిసింది. వేణుగోపాల్ తరువాత టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కూడా రాహుల్ తో భేటీ అయ్యారు. కేబినెట్ కూర్పు, పీసీసీ కార్యవర్గం, కవిత లేఖ, రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై రాహుల్ ఆరా తీసినట్లు తెలిసింది.రాహుల్‌తో భేటీ తరువాత మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. మంత్రి వర్గ విస్తరణకు సంబంధించి ఇప్పటికే రెండు సార్లు మా అభిప్రాయాలను అధిష్టానానికి చెప్పామని, కేబినెట్ లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. త్వరలోనే కేబినెట్ కూర్పు ఉంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అయితే, ఒకటి రెండు రోజుల్లో పీసీసీ కార్యవర్గం ప్రకటన ఉంటుందని మహేశ్ గౌడ్ వెల్లడించారు.తెలంగాణ కేబినెట్ లో కొత్తగా నలుగురికి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నాలుగు మంత్రి పదవులకుగాను ఏడుగురు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు, వీరిలో నాలుగు సామాజిక వర్గాలకు చెందిన నలుగురిని కాంగ్రెస్ హైకమాండ్ ఫైనల్ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. వాస్తవానికి మంగళవారమే కేబినెట్‌లో చోటుదక్కించుకున్న వారి పేర్లపై ప్రకటన రావాల్సి ఉన్నా ఏఐసీసీ చీఫ్ మల్లిఖర్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో వాయిదా పడినట్లు తెలిసింది.బీసీ కోటాలో వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు అనుగుణంగా మంత్రివర్గంలో ఎంపిక చేయాలని కూడా అధినాయకత్వంతో రేవంత్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. ఇక హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాలకు కూడా కేబినెట్ లో ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ ఎక్కువగా వినిపిస్తుంది. అయితే దీనిపై ఇంకా నిర్ణయం జరగలేదంటున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండగా ఇప్పటి వరకూ విస్తరణ జరగక పోవడంతో నాయకుల్లోనూ, ఆశావహుల్లోనూ అసంతృప్తి ఎక్కువగా ఉంది. మల్లికార్జున ఖర్గే తో సమావేశం జరిగిన తర్వాత ముహూర్తం విస్తరణకు ఫిక్స్ అయ్యే అవకాశాలున్నాయని తెలిసింది.ఖర్గే ఈనెల 30న ఢిల్లీకి వస్తారని తెలుస్తోంది. ఆయన రాగానే మంత్రి వర్గం విస్తరణపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా వాయిదా పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఆశావహులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

# జూన్ 5న ఏం జరగబోతోంది..,

హైదరాబాద్, మే 28, కాళేశ్వరం కమిషన్ ఎదుటకు విచారణకు హాజరు కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. జూన్ నెల 5వ తేదీన కమిషన్ ఎదుట హాజరు కావాలని కమిషన్ ఇచ్చిన నోటీసులు జారీచేసింది. అయితే ఈ విచారణకు కేసీఆర్ హాజరవుతారా? లేదా? అన్న దానికిసంబంధించి కేసీఆర్ క్లారిటీ ఇచ్చారు. పార్టీలోని సీనియర్ నేతలకు కేసీఆర్ సమాచారం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్దయెత్తున అవినీతి జరిగిందని తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ను నియమించింది. ఈ కమిషన్ కేసీఆర్, ఈటల రాజేందర్, హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసింది. జూన్ ఆరో తేదీన ఈటల రాజేందర్, 9వ తేదీన హరీశ్ రావు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. అయితే కేసీఆర్ హాజరవుతుండటంతో హరీశ్ రావు కూడా హాజరు కానున్నారు. కమిషన్ ఎదుట హాజరయి ప్రశ్నలకు నేరుగా కేసీఆర్ సమాధానం చెప్పాలని నిర్ణయించినట్లు తెలిసిందికాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ ఆ ప్రాజెక్టుపై విచారణకు కమిషన్ వేసింది తెలంగాణ ప్రభుత్వం. జస్టిస్ ఖఅ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా పూర్తయ్యే దశకు చేరుకుంది. ఈ చివరి దశలో అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన ఈటెల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. జూన్ 5న కేసీఆర్, జూన్ 6న ఈటెల రాజేందర్, చివరగా జూన్ 9న హరీష్ రావు హాజరవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.నోటీసు అందుకున్న అప్పటి నుంచి పార్టీలో కాళేశ్వరం కమిషన్ ముందుకు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది. ఇప్పటికీ కెసిఆర్ ఫామ్ హౌస్ లో చాలాసార్లు దీనిపై చర్చించారు. పార్టీతో పాటు న్యాయ నిపుణులతో చర్చలు జరిపి సలహాలు తీసుకున్నారు. గతంలో విద్యుత్ కొనుగోళ్లపై వేసిన కమిషన్ పై నోటీసు అందుకున్న కేసీఆర్ చాలా తీవ్రంగా ప్రతిస్పందించారు. కమిషన్‌కు లేఖ రాస్తూ కమిషన్ ఏర్పాటు, కమిషన్ గా ఉన్న జస్టిస్ నరసింహారెడ్డి అక్కడ కొనసాగడం తప్పంటూ తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు మాత్రం ఆ పంథాలో వెళ్లకూడదని భావిస్తున్నట్లు తెలిసింది.అయితే నిజానికి పోయిన ఏడాది అసెంబ్లీలో కాళేశ్వరంపై కావాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించుకోండి అంటూ సవాల్ విసిరిందే బీఆర్ఎస్. తీరా ప్రభుత్వం విచారణకు ఆదేశించిన తర్వాత హాజరు కాకపోతే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని, కమిషన్‌ను గౌరవించకపోతే అది బీఆర్ఎస్ పై దెబ్బ పడుతుందని భావిస్తున్నారు. హాజరైతే ప్రజల్లో సింపతీ పెరుగుతుందని, ప్రభుత్వం కావాలనే కక్ష గట్టి విచారణలకు తిప్పుతుందని సంకేతాలు వెళ్తాయని భావిస్తున్నారు. మొత్తానికి మొదటిసారిగా ఓ విచారణకు గులాబీ దళపతి హాజరవుతారని తెలుస్తోంది. మరోవైపు పార్టీలో గంభీర వాతావరణం కనిపిస్తుంది. జూన్ 5 బిగ్ డే అంటూ చర్చిస్తున్నారు కార్యకర్తలు.ఇక కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే 400 పేజీల నివేదికను సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో కీలక పోస్టులను డీల్ చేసిన అధికారులు సోమేష్‌కుమార్, స్మిత సబర్వాల్, రజత్‌కుమార్ వంటి వారిని బహిరంగ విచారణకు పిలిచింది. ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టు, కాళేశ్వరంగా రూపాంతరం చెందడం మొదలు, ప్రాజెక్టు డిజైన్‌లు, అనుమతులు, నిధులకు సంబంధించిన కీలక సమాచారాన్ని రికార్డు చేసింది. ముఖ్య ప్రాజెక్టు వ్యయాన్ని లక్ష కోట్లకు పెంచడంపై ఆరా తీసింది. నిర్మాణం పూర్తి కాకుండానే బకాయిల చెల్లింపుపై కూడా కూపీలాగింది.ఈ సమాచారాన్ని క్రోడికరించిన పీసీ ఘోష్ కమిషన్.. గత ప్రభుత్వ హయాంలో కీలక నిర్ణయాలు తీసుకున్న పెద్దలను ప్రశ్నించాలని నిర్ణయించింది. ఆ క్రమంలోనే నోటీసులు జారీ అయ్యాయి. ఇక, మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు హరీష్‌రావు, ఈటల విచారణకు సంబంధించి ఇప్పటికే కొశ్చనరీ సిద్ధమైందా? టెక్నికల్ అంశాలతో పాటు నిధుల వ్యవహారంపై కూడా కమిషన్ ప్రధానంగా ఫోకస్ చేసిందా?. నోటీసులపై బీఆర్ ఎస్, ముఖ్యంగా కేసీఆర్ స్ట్రాటెజీ ఎలా వుండబోతుందన్నది చర్చగా మారింది.

# జూన్ 2 ఏం జరగబోతోంది...

హైదరాబాద్, మే28 సొంత పార్టీపై అసంతృప్తితో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దారెటు అనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీతో దూరంగా ఉంటున్న కవిత.. సొంత పార్టీ దిశగా అడుగులు వేస్తున్నారనే ఊహాగానాలు తెలంగాణ రాజకీయవర్గాల్లో జోరందుకుంది. ఇక నిన్న కవితతో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదరరావుతో పాటు పార్టీ లీగల్ సెల్ ఇంచార్జ్ గండ్ర మోహనరావు సమావేశమయ్యారు. కవితను బుజ్జగించేందుకు ఆ ఇద్దరు నేతలు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని తెలుస్తోంది.మరోవైపు కవిత వ్యవహారంపై బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. తండ్రి, కూతురి మధ్య మధ్యవర్తులెందుకని ప్రశ్నించారు. జూన్ 2న కవిత కొత్త పార్టీ పెడుతున్నారని.. షర్మిల తరహాలో కవిత కూడా పాదయాత్ర చేస్తారని కామెంట్ చేశారు. ఇదిలా ఉంటే తన యాక్షన్ ప్లాన్ అమలు చేసే దిశగా కవిత అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ జాగృతికి సంబంధించి 11 ఏరియాలకు కోఆర్డినేటర్లను నియమించారు. సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి ఏర్పాటు చేశామన్నారు. టీజీబీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామమని.. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందన్నారు. మోదీ కోసమే సీఎం రేవంత్ పనిచేస్తున్నారని విమర్శించారు.ఇటీవలె ఆమె బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వ్యక్తిగతంగా రాసిన ఒక లేఖ లీక్ అయిన విషయం తెలిసిందే. దానిపై కవిత స్పందిస్తూ.. తన లేక ఎలా లీక్ అయింది అంటూ ప్రశ్నించారు. పార్టీలో కోవర్టులు ఉన్నారని, కేసీఆర్ దేవుడే కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ మండిపడ్డారు. కవిత లేకపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పరోక్షంగా స్పందించిన విషయం తెలిసిందే. ఎవరైనా లేఖలు రాయొచ్చని, తమది ప్రజాస్వామ్యం ఉన్న పార్టీ అని.. అయితే సమస్యలుంటే అంతర్గతంగా పరిష్కరించుకుంటామని కూడా ఆయన అన్నారు.

# భూ మాఫియా..ఆరాచకం

అదిలాబాద్, మే 28, తెలంగాణ రాష్ట్రంలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇప్పల్ నవేగామ్ గ్రామంలో భూ మాఫియా రెచ్చిపోతోంది. గ్రామానికి చెందిన వందకు పైగా కుటుంబాలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నాయి. తమ భూమి, ఇళ్లను ఖాళీ చేయాలంటూ ముగ్గురు వ్యక్తులు రెండు సంవత్సరాలుగా నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గ్రామీణులు స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ)ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ఆసిఫాబాద్ మండలానికి చెందిన శ్రీనివాస్, చరణ్ దాస్, మనోజ్ అనే ముగ్గురు వ్యక్తులు ఇప్పల్ నవేగామ్ గ్రామానికి చెందిన భూమి తమదేనని, తమ పేరున పట్టా ఉందని గ్రామస్తులతో ఇళ్లను ఖాళీ చేయాలంటూ బెదిరిస్తున్నారు. గ్రామంలో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నారు. ఇలా వారు గత రెండు సంవత్సరాలుగా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు ఆర్‌డీఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ముగ్గురు వ్యక్తులు తమ పలుకుబడిని ఉపయోగించి.. గ్రామస్తులను మానసికంగా వేధిస్తున్నారని, కొన్నిసార్లు భౌతిక దాడులకు కూడా ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల గ్రామస్థులు నిరంతరం భయంతో బతుకుతున్నారని.. తమ ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.బాధితుల వాదన ప్రకారం.. వారు నివసిస్తున్న ఈ స్థలంలో గత 200 సంవత్సరాలుగా వారి పూర్వీకులు నివసిస్తున్నారు. తరతరాలుగా ఇదే గ్రామంలో నివాసముంటూ.. ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు వంటి అన్ని రకాల ప్రభుత్వ పన్నులను సక్రమంగా చెల్లిస్తున్నట్లు గ్రామస్తులు రుజువులు చూపిస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో కూడా తమ పేర్లు ఉన్నాయని, అన్ని రకాల హక్కులు తమకే ఉన్నాయని వారు బలంగా చెబుతున్నారు. తాము నివసిస్తున్న భూమిపై అసలు ఎలాంటి వివాదం లేదని.. అక్రమంగా ఆ ముగ్గురు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

భూ మాఫియా బెదిరింపుల వల్ల గ్రామంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, తమకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా కూడా నిర్వహించారు. అధికారులు తక్షణమే స్పందించి, బెదిరింపులకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని.. తమ భూములకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గులాబీలో కవిత కలకలం

హైదరాబాద్, మే 28, ఒకే ఒక్క లెటర్..ఆ తర్వాత..మీడియా ముందు స్టేట్‌మెంట్స్. కవిత ఎపిసోడ్ అటు బీఆర్ఎస్‌లో ఇటు తెలంగాణ రాజకీయాల్లో టాక్ ఆఫ్‌ది పాలిటిక్స్‌గా మారింది. ఇదే టైమ్‌లో కవిత..బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్నారని..కేటీఆర్, హరీశ్, సంతోష్‌తో ఆమెకు గ్యాప్ ఉందన్న టాక్ బలంగా వినిపించింది. అంతేకాదు ఆమె కారు దిగి సొంత కుంపటి పెట్టుకుంటారన్న ఊహాగానాలు వినిపించాయి. ఇప్పటికీ ఆ వార్తలు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. కానీ ఇంతలోనే కవిత చిన్న ట్విస్ట్ చేశారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా ఈకార్ రేసులో ఏసీబీ నోటీసులు ఇవ్వడంపై ట్వీట్ చేసి మరోసారి చర్చకు దారి తీశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే రేవంత్ సర్కార్ కుట్రపూరితంగా కేటీఆర్‌కు నోటీసులిచ్చిందన్నారు. కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు కవిత. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా తట్టుకొని నిలబడ్డ చరిత్ర కేసీఆర్ సైనికులదంటూ ఫైనల్ టచ్ ఇచ్చారామె.కవిత బీఆర్ఎస్‌ను వీడుతారని ప్రచార జరుగుతున్న నేపథ్యంలో..ఆమె కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వడాన్ని ఖండించడం హాట్ టాపిక్ అవుతుంది. ఇంతకీ బీఆర్ఎస్‌లో ఏం జరుగుతుందన్న దానిపై ఆసక్తిరేపుతోంది. అయితే కవిత లెటర్ ఇష్యూపై కేసీఆర్, కేటీఆర్ ఫాంహౌస్‌లో రెండున్నగంటల పాటు చర్చించినట్లు వార్తలు వచ్చాయి. కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లాల్సిన కవిత అర్ధాంతరంగా ఆగిపోయారు. కేటీఆర్, కేసీఆర్ మీటింగ్ తర్వాత ఆమె తన కాళేశ్వరం పర్యటనను క్యాన్సల్ చేసుకోవడం చర్చనీయాంశం అయింది. అయితే కేసీఆర్ సూచనతోనే ఆమె తన టూర్ రద్దు చేసుకున్నారా లేక మీడియా ముందుకు మరోసారి రావడం ఇష్టం లేక ఆమెనే ఆగిపోయారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది.మరోవైపు బీఆర్ఎస్ ఎంపీ దామోదర్‌రావు, న్యాయవాది గండ్ర మోహన్ రావు కవితతో భేటీ అయ్యారు. రెండు గంటలకు పైగా ఆమెతో చర్చించారు. అయితే వారిద్దరూ కవితతో ఉన్న సాన్నిహిత్యంతోనే ఆమెను కలిశారు తప్ప..కేసీఆర్, కేటీఆర్‌ల ప్రమేయం ఈ భేటీలో ఏమీ లేదని తెలుస్తోంది. అయితే కవితతో జరిపిన చర్చల సారాంశాన్ని, ఆమె మనోగతాన్ని మాత్రం ఆ తర్వాత గులాబీబాస్‌కు వారు చేరవేశారని అంటున్నారు. అయితే కేసీఆర్ మాత్రం కవిత అంశంపై ఏ మాత్రం తగ్గడం లేదని..ముఖ్యంగా లేఖ ఎలా లీక్ అయిందన్నది గుర్తించే పనిలో ఉన్నారని చర్చ జరుగుతోంది.అయితే తాను పార్టీలో ఎదర్కొన్న ఇబ్బందులు, అవమానాలను కవిత దూతల ముందు ఏకరువు పెట్టినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కేసీఆర్‌కు సన్నిహితంగా ఉండే కొందరి వైఖరి వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారట. అంతే కాకుండా తన తండ్రి కేసీఆర్‌ను కలిసి మిగతా విషయాలు మాట్లాడతానని కవిత చెప్పినట్లు సమాచారం.కేసీఆర్ సమయం ఇస్తే పార్టీలో తన పాత్ర, పదవి, తన వర్గానికి పార్టీ పదవులు వంటి డిమాండ్స్‌ను కేసీఆర్ ముందు ఉంచాలన్న ఆలోచనలో కవిత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కేసీఆర్ మాత్రం ఇప్పట్లో కవితను కలిసేదే లేదని, ఆమెతో మాట్లాడేదే లేదని తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. ఓ వైపు ఇదంతా జరుగుతుండగానే..సింగరేణిలో కవిత తన సంఘాన్ని ఏర్పాటు చేయడం చర్చకు దారితీస్తోంది. సింగరేణి జాగృతి అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తూ ఎమ్మెల్సీ కవిత నిర్ణయం తీసుకున్నారు.పైగా కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా టీబీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పని చేస్తామని ఆమె ప్రకటించడం కొసమెరుపు. మరోవైపు కవిత అనుచరులు మాత్రం..తెలంగాణ ఆవిర్భావం అయిన జూన్ 2నే అక్క పార్టీ పెట్టడం ఖాయమని..పార్టీ పేరు ః౯ఖీఅని? పూర్తి పేరు తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి అని ప్రచారం చేస్తుండటం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో కవిత ఎపిసోడ్ ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి మరి.

# రేషన్ కార్డులలో అక్రమాలపై కొరడా

నిజామాబాద్, మే 28, చాలారోజుల తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. సాధారణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం అక్రమ రేషన్‌కార్డుల గుట్టు రట్టు చేస్తోంది. రేషన్ కార్డుల జారీపై అనుమానాలు వ్యక్తం చేసింది.తెలంగాణలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. లక్షలాది మంది కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరికొందరు మార్పులు, చేర్పుల కోసం అప్లై చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి.. నూతన కార్డులను జారీ చేస్తున్నారు. ఈ సమయంలో.. కేంద్ర ప్రభుత్వం ట్విస్ట్ ఇచ్చింది. కొత్తగా జారీ అవుతున్న కార్డులకు సంబంధించి అక్రమాలు జరిగినట్టు గుర్తించింది.కేంద్ర ప్రభుత్వం అక్రమ రేషన్‌కార్డుల గుట్టు రట్టు చేస్తోంది. ఉదాహరణకు ఒక్క కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 1700 అక్రమ కార్డులున్నట్లు అనుమానం వ్యక్తం చేసింది. ఆ కార్డుల వివరాలను జిల్లాకు పంపించడంతో.. అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే 83 శాతం పూర్తయింది. కేంద్రం అభ్యంతరం తెలిపిన కార్డుల్లో 1400 వరకు వివరాలపై ఆయా మండలాల్లో తహసీల్దార్లు విచారణ పూర్తిచేశారు. మరో 280 పరిశీలించాల్సి ఉంది.ఇప్పటి వరకు విచారణ చేసిన కార్డుల వివరాల నివేదికలను.. అధికారులు ఆన్‌లైన్‌లో కేంద్రానికి పంపిస్తున్నారు. ఇందులో చాలా కార్డులు అనర్హత కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 2.56 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా.. క్షేత్రస్థాయిలో మరోమారు రేషన్‌కార్డులపై విచారణ చేయిస్తే.. మరికొందరు అనర్హుల వివరాలు బయట పడే అవకాశముంది.కేంద్రం ఇచ్చిన జాబితా ప్రకారం.. రేషన్ కార్డులు విచారణ చేసి ఆన్‌లైన్‌లో నివేదిక పంపిస్తున్నామని డీఎస్‌వోలు చెబుతున్నారు. అటు క్షేత్రస్థాయిలో నిర్వహించిన విచారణలో.. విస్తుపోయే విషయాలు తెలుస్తున్నాయి. మైనర్ల పేరిట కూడా కార్డులు జారీ అవుతున్నట్టు విచారణలో తేలింది. నకిలీ ఆధార్ కార్డులు పెట్టి రేషన్ కార్డులు పొందిన వారు కూడా ఉన్నారు.ఇతర రాష్ట్రాలతో పాటు తెలంగాణలోనూ రేషన్ కార్డులు ఉన్నట్లు విచారణలో తేలింది. ఇవే కాకుండా.. రేషన్‌కార్డులో పేరొకరిది.. ఆధార్‌కార్డు మరొకరిది ఉన్నవి కూడా బయటకు వస్తున్నాయి. సైలెంట్ కార్డులు భారీగా ఉన్నట్టు తెలుస్తోంది. వీరు ఆరు నెలల నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా బియ్యం తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. కొందరు మృతిచెందినా.. వారి కార్డులు రద్దు కాలేదు. మరికొందరికి బియ్యం అవసరం లేకున్నా కార్డులు తీసుకున్నారు. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైన తర్వాత.. ప్రతీ నెల 10 నుంచి 15 శాతం మంది రేషన్ సరకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు.

# కవితకు బలాలు ఏంటీ... బలహీనతలు ఏంటీ

హైదరాబాద్, మే 28, కల్వకుంట్ల కవిత. తెలంగాణలో కేసీఆర్ కుమార్తెగా ప్రజలకు పరిచయం అయిన కవిత ఆ తర్వాత కాలంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. అటు ఉద్యమంలో, ఇటు రాజకీయాల్లో తనకుంటూ ఓ స్థానం ఏర్పాటు చేసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారు ఉండరు. తెలంగాణలో ఇక చెప్పనక్కరలేదు. తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఉన్న ప్రతీ ఒక్కరికీ కవితకు ఉద్యమ రాజకీయాలు, తెలంగాణ రాజకీయాలతో ఉన్న సంబంధాలు తెలుసు. అయితే మైడియర్ డాడీ అంటూ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ ఇప్పుడు సంచనలమైంది. బీఆర్ఎస్ పార్టీ చీలుతుందా అన్న చర్చ దగ్గరి నుంచి కవిత కొత్త పార్టీ పెట్టేస్తున్నారనే వార్తలు చక్కర్లు కొట్టే స్థాయికి చేరాయి. అయితే బీఆర్ఎస్ లో ఏదో జరుగుతుందన్నది మాత్రం ఆమె లేఖ ద్వారానే బహిర్గతమైంది. అయితే ఇప్పటి వరకు దీనిపై పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ నర్మగర్భంగా మాట్లాడటం మినహా అందరూ సైలంట్ గా ఉన్నారు. ఈ అంశాలపై చర్చించేందుకు కేసీఆర్ నుంచి కవితకు ఎలాంటి పిలుపు రాలేదు. అయితే కేసీఆర్ దూతలుగా రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు, పార్టీ లీగల్ సెల్ ఇంఛార్జి గండ్ర మోహన్ రావు మూడు గంటల పాటు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో తన లేఖను బయటపెట్టిన వ్యక్తులెవరో తెల్చాలని, తన రాజకీయ భవిష్యత్తుపై హామీ ఏంటని, పార్టీలో తన స్థానం ఏంటని కవిత ప్రశ్నించినట్లు తెలిసింది. కేసీఆర్‌తో నేరుగా చర్చించాలని తాను అనుకుంటున్నట్లు వారితో కవిత చెప్పినట్లు సమాచారం. రానున్న రోజుల్లో దీనిపై బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఏం నిర్ణయం తీసుకుంటారు. ఒక వేళ ఈ విషయంలో ఆయన మౌనం దాల్చితే కవిత ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడే చేప్పలేం. అయితే ఒక వేళ ఈ చర్చలు విఫలమై కవిత పార్టీ పెడితే ఎలా ఉంటుంది? అసలు పార్టీ పెట్టే శక్తి కవితకు ఉందా? తెలంగాణలో కొత్త పార్టీకి అవకాశం ఉందా ? కవిత కొత్త పార్టీ పెడితే ఏ పార్టీ నష్టపోతుంది ? అన్న అంశాలు చూద్దాం.

కవిత ప్లస్ పాయింట్స్ ఏంటంటే??

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ కూతురుగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. అదే రీతిలో పార్టీలో కేసీఆర్ తర్వాత కేటీఆర్, హరీశ్ రావుకు ఎలాంటి ఫాలోయింగ్ ఉందో అలాంటి ఫాలోయింగ్ ను కవిత సంపాదించుకున్నారు. కొత్తగా తనను తాను తెలంగాణ ప్రజలకు పరిచయం చేసుకోనక్కరలేని మంచి అవకాశం కవితకు ఉంది. ఇది ఓ పార్టీ పెట్టడానికి మంచి బలాన్ని ఇచ్చే అంశంగా చెప్పవచ్చు. తెలంగాణ ఉద్యమంలో కవిత పాత్రకు మంచి గుర్తింపు ఉంది. తెలంగాణ జాగృతి వంటి సంస్థను స్థాపించి, ఆ సంస్థతో తెలంగాణ భాష, సంస్కృతి, పండుగల పట్ల ప్రజల్లో ఓ చైతన్యాన్ని తీసుకురావడంలో సఫలీకృతం అయ్యారు. ఈ సంస్థ ద్వారా తెలంగాణ ప్రజలో ఓ సంబంధాన్ని ఏర్పరుచుకోగలిగారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు ఈ సెంటిమెంట్ ఏదో రూపంలో ఉపయోగపడుతుంది. కవిత కొత్త పార్టీ పెడితే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తీరు, ఉద్యమ కేసుల్లో ఉండంటం వంటి అంశాలు ప్రజలను దగ్గర చేసేందుకు ఉపయోగపడతాయి. పార్టీ ప్రారంభానికి ఇది ఓ ఉపయోగపడే అవకాశం ఉంది. కవిత ఇప్పటికే అధ్యక్షురాలిగా ఉన్న తెలంగాణ జాగృతి సంస్థ కొత్త పార్టీ ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇప్పటికే తెలంగాణలోని గ్రామ స్థాయి వరకు తెలంగాణ జాగృతి సంస్థను కవిత విస్తరింప జేశారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ అంతటా ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లోను, విదేశాల్లోను జాగృతి శాఖలు ఉన్నాయి. కొత్త పార్టీ పెట్టేందుకు ఈ బేస్ కవితకు బాగా లాభిస్తుంది. కొత్తగా పార్టీ ఏర్పాటు చేసే లాంఛింగ్ సమస్యలు ఏవీ కవితకు వచ్చే అవకాశం లేదు. ఇలా తెలంగాణ జాగృతి సంస్థ కొత్త పార్టీ ఏర్పాటుకు లాంఛింగ్ పాడ్ లా ఉపయోగపడుతుంది.

తెలంగాణలో ప్రజాకర్షణ గల మహిళా రాజకీయ నాయకుల కొరత ఉంది. మహిళా ఓటర్లను తమ వైపు తిప్పుకునే శక్తి ఉన్న మహిళా నేతలు తెలంగాణలో లేరనే చెప్పాలి. ఈ లోటును కవిత పూడ్చే అవకాశం ఉంది. మహిళలను ఆకట్టుకునే నాయకురాలిగా ఎదిగే అవకాశం ఉంది. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ జాగృతి సంస్థ, మహిళా రిజర్వేషన్లపై చేసిన కార్యక్రమాలు, కవితకు ఉన్న రాజకీయ అనుభవం కొత్త పార్టీ పెట్టేందుకు కలిసి రావచ్చు. ఉద్యమ నాయకురాలిగా, పార్లమెంట్ సభ్యురాలిగా, శాసనమండలి సభ్యురాలిగా ఉన్న అనుభవం పార్టీ నడపడంలో కొంత బలాన్ని ఇస్తుంది. అంతే కాకుండా కేసీఆర్ కూతరు కావడంతో తన తండ్రి పార్టీని నడిపిన తీరు, సంక్షోభ సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు వాటి వల్ల వచ్చిన విజయాలు, ఓటములు దగ్గర నుంచి చూసిన అనుభవం కూడా కలిసి వస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల పట్ల విముఖత ఉన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఓ కొత్త ప్రత్యామ్నాయాన్ని చూస్తుంటారు. అలాంటి సందర్భంలో కవిత పెట్టే పార్టీకి ఈ రాజకీయ పరిస్థితులు కొంత మేర కలిసి రావచ్చు. అలాంటి నేతలు కొత్త పార్టీలోకి వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి చేరికలు కొత్త పార్టీలో జోష్ నింపుతుందనడంలో సందేహం లేదు.



బలహీనతలు ఏంటీ...

తెలంగాణలో ఇప్పటికే కేసీఆర్ కుటుంబపై ఉన్న ప్రధాన ఆరోపణ కుటుంబ రాజకీయాలు అనే ముద్ర. బీఆర్ఎస్ నుంచి వీడి కొత్త పార్టీ పెట్టినా కవితకు ఆ ముద్ర తప్పదు. అటు విపక్షాలు, ప్రజల నుంచి వచ్చే రాజకీయ విమర్శలు కొత్త పార్టీ పెట్టే విషయంలో ప్రతికూలం కావచ్చు. లిక్కర్ స్కాంలో ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలతో కవిత జైలుకు వెళ్లి రావడం ప్రధాన ప్రతికూలాంశంగా మారవచ్చు. అయితే కేసు నుంచి కవిత బయటపడే వరకు విపక్షాలు కవితను రాజకీయంగా వెనక్కు నెట్టే అస్త్రంగా లిక్కర్ స్కాం కేసును ఉపయోగిస్తాయనడంలో సందేహం లేదు. కొత్త పార్టీ పెట్టే వ్యక్తి రాజకీయ జీవితం మచ్చ లేనిదిగా ఉంటేనే పార్టీ నడపటం కష్టమైన ప్రస్తుత రాజకీయాల్లో లిక్కర్ స్కాంలో ఆరోపణలతో పార్టీని పెట్టి దాన్ని నడపడం కవితకు కత్తిమీద సామే అని చెప్పాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో కవిత కొత్త పార్టీ పెట్టేందుకు తెలంగాణలో రాజకీయ వాతావరణం అనుకూలంగా లేదనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలో ఉండటం, బీజేపీ క్రమ క్రమంగా తన బలాన్ని పెంచుకుంటూ ఉన్న తరుణం ఇది. బీఆర్ఎస్ పార్టీ కూడా భారీ బహిరంగ సభను వరంగల్ లో నిర్వహించి ప్రజాకర్షణ శక్తి ఏ మాత్రం తమ చీఫ్ కేసీఆర్‌కు తగ్గలేదని నిరూపించుకుంది. ఈ ఉత్సాహంతో ముందుకు సాగుతుంది ఇలాంటి రాజకీయ వాతావరణంలో కవిత కొత్త పార్టీ పెడితే ప్రజల నుంచి అనుకున్న రీతిలో మద్ధత్తు వస్తుందని ధీమాగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. కవిత కొత్త పార్టీ పెడితే బీఆర్ఎస్‌కు నష్టం కలిగించడమే ప్రధాన లక్ష్యం అవుతుంది. ఆ పార్టీ ఓటర్లలోనే ఎక్కువ చీలిక వస్తుందన్నది నిజం. ఆ పార్టీలోని అసంతృప్త నేతలు, కార్యకర్తలు, ఓటర్లు కొద్ది మంది కవిత వైపు తిరగవచ్చు. కాని ఇది బీఆర్ఎస్‌కు, అటు కవితకు లాభం చేకూర్చేది కాకుండా కాంగ్రెస్, బీజేపీలకు లాభించే అవకాశం ఉంది ఏ పార్టీ స్థాపించినా దానికో లక్ష్యం ఉంటుంది. అయితే తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటికే కాంగ్రెస్ , బీజేపీ, బీఆర్ఎస్, వామపక్షాల వంటి పార్టీలు ఓ బలమైన కారణాలతో పురుడు పోసుకున్నవి . పక్క రాష్ట్రంలో తీసుకున్నాటీడీపీ , వైసీపీ ఆవిర్భావం వెనుక బలమైన ప్రజా లక్ష్యాలు ఉన్నాయి. అయితే కవిత పెట్టే కొత్త పార్టీ తనకు అన్యాయం జరిగిందని చెబితే ప్రజలు ఆమోదం తెలిపే స్థితిలో లేరు. ఓ బలమైన ప్రజల ఆకాంక్షలను లక్ష్యంగా పెట్టుకొని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాంటి సెంటిమెంట్ ఉంటే తప్ప కొత్త పార్టీ నిలదొక్కుకునే పరిస్థితి ఉండదు.కొత్త రాజకీయ పార్టీ స్థాపన అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. నిధులు భారీగా అవసరం. కేసీఆర్ కుమార్తెగానో లేదా జాగృతి అధ్యక్షురాలిగానో నిధుల సేకరణ అంత సుళువుగా సాధ్యమయ్యే పని కాదు. కొత్త నాయకులను, కార్యకర్తలను తన వైపు తిప్పుకోవడం కూడా అంత ఈజీగా జరిగే పని కాదు.

మొత్తానికి అసంతృప్తితో ఉన్న కవిత కొత్త పార్టీ పెడుతారా లేకుంటే టీ కప్పులో తుపాను లా బీఆర్ఎస్ లో ఈ సంక్షోభం ముగియనుందా? అన్నది వేచి చూడాల్సిందే. అయితే కొత్త పార్టీ స్థాపనకుపై అంశాలు ప్రభావితం చూపే అవకాశం మాత్రం ఉన్నాయి. కవిత కొత్త పార్టీ పెట్టడం అనేది మాత్రం సాహసోపేతమైన చర్యగా చూడాల్సిందే. బీఆర్ఎస్‌లో డైనమిక్‌గానే కవిత వ్యవహార శైలి ఉంటుందని గులాబీ నేతలు చెబుతుంటారు. కేసీఆర్‌కు కవిత లేఖ రాయడం, ఆ లేఖ బహిర్గతం కాగానే సైలంట్‌గా ఉండకుండా తన లేఖను బయపెట్టింది కేసీఆర్ చుట్టు ఉన్న దయ్యాలే అని, కోవర్టులే అని మీడియా ముందుకు వచ్చి ధైర్యంగా మాట్లాడటం ఇవన్నీ కవిత ఓ కచ్చిత నిర్ణయానికి వచ్చి చేస్తున్న చర్యలుగానే చూడాల్సి వస్తుంది. పార్టీలో తన స్థానం ఏంటో తెలుసుకునేందుకు ఈ రీతిలో కవిత స్పందన ఉందన్నది బీఆర్ఎస్ కీలక నేతల మాట. ఇనాళ్లు పార్టీలో ఉండి పని చేసిన తన లాంటి నేతను పక్కన పెడితే చూస్తూ తాను ఊర్కునే రకం కాదన్న హెచ్చరిక గత రెండు మూడు రోజుల పరిణామాలు చెబుతున్నాయన్నది రాజకీయ విశ్లేషకుల మాట. అయితే కేసీఆర్ లాంటి లెంజదరీ నాయకుడ్ని, కేటీఆర్, హరీశ్ రావు లాంటి రాజకీయ చతురత ఉన్న నేతలను కాదని కవిత తన రాజకీయ భవిష్యత్తు కోసం పార్టీ పెట్టి వారికి ఎదురెళ్లుతుందా ? అంత సాహసం చేస్తుందా ? అన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో ఉంది.

## అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య



ఏలూరు తీసుకున్న అప్పు చెల్లించకపోవడంతో ప్రైవేట్ ఫైనాన్సు రికవరీ ఏజెంట్లు ఒత్తిడి తేవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి తోటలో ఆత్మహత్యకు పాల్పడి ఘటన పెదవేగి మండలం కే కన్నాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కమిలి భాస్కరరావు 35 స్థానికంగా కూలీ పనులు చేస్తూ భార్య పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు అయితే గత కొంత కాలం క్రితం మహేంద్ర ఫైనాన్స్ అనే ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నుండి గృహ నిర్మాణ అవసరాల నిమిత్తం అప్పు తీసుకొని తిరిగి చెల్లించలేదు దీంతో రికవరీ ఏజెంట్లు ఇంటికి అతనిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు

## ప్రభుత్వ ఆసుపత్రి లో జిల్లా కలెక్టర్ సతీమణికి కాన్పు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ప్రభుత్వ ఆసుపత్రి లో జిల్లా కలెక్టర్ సతీమణికి కాన్పు జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి లో జిల్లా కలెక్టర్ జీతేష్ వి పాటిల్ సతీమణి శ్రద్ధ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. కలెక్టర్ సతీమణి చాలకాలం గా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి లోనే పరీక్షలు చేయించుకుంటున్నారు. కలెక్టర్ ప్రభుత్వ వైద్యం పై నమ్మకం పెంచారు.

## యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

విశాఖపట్నం జూన్ 21న విశాఖ వేది కగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను ప్రపం చ స్థాయి ప్రమాణాలకు అనుగుణం గా చేయాలని, చిన్నపాటి సమన్వ యం లోపం కూడా తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. యోగా దినోత్సవ ఏర్పాట్లు, క్షేత్రస్థాయి పరిస్థితుల పరిశీలన నిమిత్తం జిల్లాకు విచ్చే సిన ఆయన జిల్లా కలెక్టర్, జాయిం ట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి మీటింగు హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అధికారులకు దిశాని ర్దేశం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని చాలా ప్రతిష్టాత్మ కంగా తీసుకున్నారని, దాన్ని దృష్టి లో పెట్టుకొని ప్రతి ఒక్కరూ బాధ్య తాయుతంగా వ్యవహరించాలని, పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకొని కార్యక్రమాన్ని సజావుగా నిర్వహిం చాలని సూచించారు. ఇటీవల జరిగిన నీతీ ఆయోగ్ సమావేశంలో కూడా ముఖ్యమంత్రి యోగా దినో త్సవం గురించి, నిర్వహణ, ప్రపంచ రికార్డు సాధించేందుకు అనుసరించే విధానాల గురించి వివరించారని కృష్ణబాబు గుర్తు చేశారు. దీన్నిబట్టి యోగా దినోత్సవ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, దానికి తగ్గట్టుగా సన్నద్ధం కావాలని అన్నారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** వీర్ సావర్కర్ జయంతి సందర్భంగా, బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు, తరంజీత్ సింగ్, రవీందర్, గోపాల్, మల్లన్న, అంకితభావంతో ఉన్న సభ్యులతో కలిసి కాచిగూడ ఎక్స్ రోడ్స్‌లోని వీర్ సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ గొప్ప దేశభక్తుడి త్యాగాలను మరియు దార్శనికతను మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకుందాం అని అన్నారు.

## జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర.

### – ముఖ్య అతిథిగా పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్..

జయశంకర్ భూపాలపల్లి భూపాలపల్లి మున్సిపాలిటీలోని 11, 15 వార్డులు వేశాలపల్లి, కాకతీయ కాలనీలల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూ, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూల మాల వేశారు. రెండు కాలనీలల్లో నాయకులతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యాత్రనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. అదేవిధంగా, పలువురు కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు ఉన్నారు.

# జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

**ఇప్పటిదాకా 2,49,372మెట్రిక్ టన్నుల సేకరణ**

**తుదిదశకు ధాన్యం కొనుగోళ్లు, 133 కేంద్రాల మూసివేత**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



రాజన్న సిరిసిల్ల జిల్లా, మే -28 (ప్రజా బలం ప్రతినిధి)జిల్లాలో యాసంగి సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యాసంగి సీజన్ వడ్ల సేకరణ కోసం మొత్తం 242 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ నెల 28-5-2025 వరకు జిల్లాలోని 37,223 మంది రైతుల నుంచి రూ.578 కోట్ల విలువైన 2,49,372మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. వీటిలో 2,16,258 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలు ఆన్లైన్ చేశామని, 34,479 మంది రైతుల ఖాతాలో 447 కోట్ల రూపాయలు జమ అయ్యాయని వెల్లడించారు. మిగతా రైతుల బ్యాంకు ఖాతాలో త్వరలో డబ్బులు జమ కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం సేకరణ తుది దశకు వచ్చిందని, జిల్లాలోని 133 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు వెల్లడించారు చివరి గింజ వరకు ధాన్యం సేకరిస్తామని స్పష్టం చేశారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. తడిసిన ధాన్యం సైతం సేకరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. గత మూడు రబీ సీజన్ లలో ధాన్యం సేకరణ వివరాలు

రబీ సీజన్ (2022- 2023) 28-05-2023 రోజు వరకు జిల్లాలో 1,64,044 మెట్రిక్ టన్నుల ధాన్యం..

రబీ సీజన్ (2023- 2024) 28-05-2024 రోజు వరకు 2,49,514 మెట్రిక్ టన్నుల ధాన్యం..

ఈ రబీ సీజన్ (2024- 2025) 28- 05-2025 ఈ రోజు వరకు 2,49,372 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

## ఐ ఎన్ టి యు సి సంఘాన్ని కాంగ్రెస్ నాయకులు విమర్శించడం అర్థరహితం

### -ఆగ్రహం వ్యక్తం చేసిన కార్మిక సంఘం నాయకులు



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 28:కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రెస్ మీట్ లో ఐఎన్టీయుసి సంఘాన్ని విమర్శించడంపై బుధవారం ఐ ఎన్ టి యు సి నాయకులు ధ్వజమెత్తారు. మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎన్టీయూసీ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, నరేందర్ లు మాట్లాడుతూ ఐ ఎన్ టి యు సి కార్మిక సంఘం కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంఘమని కాంగ్రెస్ పార్టీ వేరు ఐఎన్టీయూసీ సంఘం వేరు కాదని అన్నారు. కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఎంపీ లతో ప్రాబల్యం పెంచుకోవడానికి ఐఎన్టీయూ సంఘాన్ని సంఘ నాయకుడు జనక్ ప్రసాద్ ను విమర్శించడం తగదన్నారు. అహర్నిశలు కార్మిక సంక్షేమం కోసం హక్కుల కోసం పోరాడుతున్న ఐ ఎన్ టి యూ సి కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో సత్సంబంధాలు కలిగి ఉండటానికి ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంత లాభం కోసం రాజకీయ లబ్ధికోసం ప్రెస్ మీట్ లు పెట్టి ఐఎన్టీయూసీ కార్మిక సంఘాన్ని సంఘ నాయకులను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఐఎన్టీయూసీ కార్మిక సంఘం ఒకటేనని గుర్తించాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి సంఘ నాయకులు పానుగంటి వెంకటస్వామి, డి.శంకరరావు, సంఘ బుచ్చయ్య, జగన్నాథ చారి, జక్కుల ఓదెలు, దార బిక్షపతి, శనిగారపు రాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ గ్యాస్ వినియోగదారుల ఈ- కెవైసి పై అవగాహన




ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 28:ఇండియన్ డిస్ట్రిబ్యూటర్ సింగరేణి కాలరీస్ కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్ లో డెలివరీ బాయ్స్ సిస్టం ఆపరేటర్స్ ను ఉద్దేశించి డివిజనల్ మేనేజర్ సింగరేణి సూపర్ బజార్ శ్రీరాంపూర్ బెల్లంపల్లి పాలకుర్తి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ వారి ఆదేశానుసారము ప్రతి ఒక్క వంటగ్యాస్ వినియోగదారుడు వారి గ్యాస్ కనెక్షన్ నిమిత్తము ఈ - కే.వై.సి అనుసంధానం చేసుకునే కొరకై సహకరించాలని కాల పరిమితి అయిపోయిన గ్యాస్ పైప్ ను వెంటనే మార్చుకోవాలని లేని యెడల ప్రమాదాలు సంభవిస్తాయని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో సింగరేణి సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ పాలకుర్తి రాజు బ్రాంచ్ మేనేజర్ సుదర్శన్ ఎల్.పి.జి కోఆర్డినేటర్ రాజు ఇండియన్ డిస్ట్రిబ్యూటర్ ఇన్చార్జ్ మాధవరావు ప్రసాద్ మరియు డెలివరీ బాయ్స్ సిస్టం ఆపరేటర్స్ రామకృష్ణాపురం, మందమర్రి, బెల్లంపల్లి పాల్గొన్నారు.

**మియాపూర్ లో హైడ్రా కూల్చివేతలు**

హైదరాబాద్ మియాపూర్ మైత్రి నగర్ పార్కు స్థలంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. మైత్రి నగర్ ఫేస్ -1 కాలనీ పార్కు ఎకరా స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు మట్టి కుప్పలు వేసారు. పార్కు స్థలాన్ని కాపాడాలని కాలనీ వాసులు హైడ్రా కు ఫిర్యాదు చేసారు. దాంతో హైడ్రా అధికారులు పార్కు స్థలంలో మట్టి కుప్పలు తొలగించారు. పార్కు చుట్టు హైడ్రా అధికారులు నోటీస్ బోర్డులు ఏర్పాటు చేశారు.

# మునీర్ మరణం సమాజానికి తీరని లోటు

### -ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

### -ఎండి మునీర్ తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న నాయకులు




ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 28:తెలంగాణ ఉద్యమకారుడు సీనియర్ పాత్రికేయులు ఎండి మునీర్ మరణం సమాజానికి తీరని లోటని పలువురు నాయకులు సన్నిహితులు పేర్కొన్నారు. మందమర్రి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముందుగా మార్కెట్ లోని కాన్వెంట్ వి.టి అబ్రహం స్తూపం నుండి ప్రారంభమై మార్కెట్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన మునీర్ చిన్నతనం నుండే ఉద్యమ బాటలో పయనించి బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఉద్యమించారని అన్నారు. సింగరేణి సంస్థలో కర్మిక గా పని చేస్తూ కార్మికుల పక్షాన ఉంటూ ఎలాంటి సమస్యలు వచ్చిన యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే వారని తెలిపారు. సింగరేణి ప్రాంతంలోని దొరల దౌర్జన్యానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి ప్రజల సమస్యలను తీర్చే వారని చెప్పారు. సకల జనుల సమ్మె కాలంలో కార్మికులందరినీ ఒక తాటికి తీసుకువచ్చి సకల జనుల సమ్మె విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. మునీర్ మరణం పాత్రికేయ రంగానికే గాక తెలంగాణ సమాజానికి తీరని లోటని చివరి వరకు పాత్రికేయులుగానే కొనసాగుతూ అనేక సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ప్రజాసేవ చేశారన్నారు. ఆయన అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం తెలుపుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, సింగరేణి కార్మికులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# యోగాంధ్ర లక్ష్యం.. ప్రతి ఒక్కరికీ యోగ ప్రయోజనాలు దక్కేలా చూడడమే.

యోగా మన జీవితంలో ఒక భాగం కావాలి

మానసిక ప్రశాంతత.. సంపూర్ణ ఆరోగ్యం.. యోగాతో సాధ్యం

సమాజంలో ఉన్న వివిధ వర్గాలను భాగస్వాముల్ని చేసే క్రమంలో 25 రోజుల యోగా సాధన కార్యక్రమం

రాజమహేంద్రవరం కేంద్రకారాగారంలో అద్భుతంగా జరిగిన యోగాంధ్ర రాష్ట్రస్థాయి కార్యక్రమం మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి ప్రశాంతి

రాజమహేంద్రవరం కేంద్రకారాగారంలో అద్భుతంగా జరిగిన యోగాంధ్ర రాష్ట్రస్థాయి కార్యక్రమం

రాజమహేంద్రవరం దట్ కాలం నాటి చారిత్రక నిర్మాణాలు ఓవైపు..చరిత్రకు సాక్షిభూతంగా నిలిచిన ఏళ్ల నాటి వృక్షాలు మరోవైపు..మనసుకి ఆహ్లాదం కలిగించే కమనీయ ఉద్యానవనాలు ఇంకోవైపు. వీటి నడుమ భానుని ప్రభాత కిరణాల వెలుగుల్లో, జీవ వైవిధ్య పురస్కారం పొందిన రాజమహేంద్రవరంలోని కేంద్రకారాగారంలో యోగాంధ్ర రాష్ట్రస్థాయి కార్యక్రమం అద్భుతంగా జరిగింది. కారాగారాలు (ప్రిజన్స్) అనే ఇతివృత్తంతో చేపట్టిన ఈ యోగా సాధనలో కేంద్రకారాగారంలోని 1300 మంది ఆశ్రమ వాసులు సహా దాదాపు 1500 మంది యోగ సాధన చేశారు. రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ విశిష్ట అతిథిగా, శాసన పరిషత్ (కౌన్సిల్) సభ్యులు సోము వీర్రాజు, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, సంయుక్త కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జైలు పర్యవేక్షణ అధికారి రాహుల్ అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో గిన్నిస్ రికార్డు గ్రహీత కె.ఎల్. వి.శ్రీధర్ రెడ్డి ఆశ్రమ వాసులచే యోగాసనాలు వేయించారు. అత్యంత సంక్లిష్టమైన గండభేరుండాసనం, ఊర్ధ్వ కుక్కుటాసనం, బ్రహ్మాస్త్రాసనం, కైలాసాసనం, మలయాసనం, సుగ్రీవాసనం వంటి ఆసనాలను ఆయన కుమారుడు, ఎస్.కె.వి.టి ప్రభుత్వ పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి అయిన కార్తీక్ రామచంద్ర రెడ్డి అద్భుతంగా ప్రదర్శించారు. ఒక ఆసనం నుంచి మరొక ఆసనానికి సెకన్ల వ్యవధిలోనే మారి అందరిని అబ్బురపరిచారు. అతిథుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జూన్ 21వ తారీఖున అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు ప్రధానమంత్రి విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని, ఈ నేపథ్యంలో నెలరోజులపాటు యోగా ఆవశ్యకతను వివరిస్తూ వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా యోగాభ్యాసన చేస్తున్నారని,వారి మార్గదర్శకత్వంలో యోగాంధ్ర కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. జూన్ 15వ తేదీన తిరుపతిలో సినిమా రంగ ప్రముఖులతో (సెలబ్రిటీలు) ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. గుజరాత్ రాష్ట్రం సూరత్ లో 1,23,000 మందితో యోగా సాధన చేసి నెలకొల్పిన రికార్డును అధిగమించాలన్న సంకల్పంతో విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇది రికార్డుల కోసం చేపట్టిన కార్యక్రమం కాదని, మానసిక శారీరక ఆరోగ్యానికి యోగ దోహదపడుతుందనే సందేశం ప్రతి ఒక్కరికి చేర్చి, వారు యోగ సాధన చేసేలా ప్రోత్సహించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలియజేశారు. యోగాను జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలని,ప్రజలంతా యోగాభ్యాసం చేయాలని మంత్రి కోరారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ.. యోగ సాధన ఒక రోజుతో పూర్తి కాదని ఇది నిరంతర ప్రక్రియని, ప్రతి ఒక్కరూ యోగ ప్రయోజనాలు పొందాలి అనే ఉద్దేశ్యం తో నెల రోజులపాటు యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఐదు రోజులపాటు ప్రధాన శిక్షకులకి (మాస్టర్ ట్రైనర్స్) శిక్షణ ఉంటుందని, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ర్యాలీలు,పోటీలు నిర్వహిస్తారని తెలియజేశారు. యోగ ఒక మతానికి సంబంధించినది కాదని,ఇది శరీరాన్ని, మనసుని సమన్వయపరిచే ప్రక్రియని వివరించారు. యోగాను ఆరోగ్య శాఖతో, యోగా సంఘాలతో సంబంధించిన వ్యవహారంగా చూడరాదని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా యోగా సాధన చేయాలని సూచించారు. శాసన పరిషత్ (కౌన్సిల్) సభ్యులు సోము వీర్రాజు మాట్లాడుతూ... యోగా అనేది ఋషులు ప్రవచించిన విద్య అని, వేల సంవత్సరాల నుంచి భారతదేశంలో యోగ సాధన చేస్తున్నామని తెలియజేశారు. భారతదేశం ప్రపంచానికి మార్గదర్శి, తత్వవేత్త (గైడ్ & ఫిలాసఫర్) అని, ఏనాటికైనా భారత్ "విశ్వ గురు" స్థానాన్ని అలంకరించాలని ఆకాంక్షించారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మన ఆరోగ్యం సరిగా ఉంటుందని, తద్వారా వైద్యంపై ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదని, దీనిని గ్రహించే స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర వంటి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. ఈ యోగాంధ్ర కూడా అదే కోవలోకి వస్తుందని యోగా సాధన తో మానసిక, శారీరక ఆరోగ్యం పొందవచ్చని వివరించారు. అయ్యంగార్ వంటి వారు అంతర్జాతీయ స్థాయిలో యోగా బోధన చేశారని చెప్పారు. ఆశ్రమ వాసుల్లో కొందరు యోగా శిక్షకులుగా మారాలని, నిరంతరం యోగ సాధన చేయాలని ఆయన సూచించారు. అమరావతికి ప్రధాని నరేంద్ర మోదీ వచ్చినప్పుడు యోగ, ధ్యానం గురించి పేర్కొంటూ అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు విశాఖపట్నం వస్తున్నానని చెప్పారని, ఆ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.అంతకుముందు కారాగార ఆశ్రమ వాసులు పండించిన కూరగాయలు, తయారుచేసిన బీరువాలు, ర్యాక్ లు, మేజా బల్లలు (టేబుల్స్), కుర్చీలు, పుస్తకాలు, షర్టులు ప్యాంట్లు, చీరలు, బెడ్ షీట్లు వంటి వాటిని పర్యవేక్షణ అధికారి రాహుల్ అతిథులకు చూపించారు. కొన్ని వస్త్రాలను రాష్ట్రంలోని ఇతర జైళ్లకు ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు. ఎక్కువ సంఖ్యలో ఆర్డర్లు ఇస్తే పాఠశాల ఏకరూప దుస్తులు (స్కూల్ యూనిఫామ్ లు) సహా ఇతర దుస్తులు కుట్టి ఇస్తున్నట్లు తెలిపారు.ఈ ఉత్పత్తులు కారాగారం వెలుపల గల విక్రయ కేంద్రంలో అందుబాటులో ఉంచామని చెప్పారు.

ఈ యోగా సాధన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్ రాహుల్, అదనపు ఎస్పీ రమేష్ బాబు , జిల్లా రెవెన్యూ అధికారి టి . సీతారామ మూర్తి, సెంట్రల్ జైలు అధికారులు బి. రత్న రాజు, ఆర్. శ్రీనివాసులు, జిల్లా ఆయుష్ వైద్యులు కే రమేష్, రాష్ట్రపతి అవార్డ్ పురస్కార గ్రహీత, సెంట్రల్ జైలు ఉపాధ్యాయులు కే. శ్రీనివాస రావు, యోగాంధ్ర జిల్లా సమన్వయ కర్త పి. కేజియ , జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా కె వెంకటేశ్వర రావు, యోగా గురువు కే ఎస్ వి శ్రీధర్ రెడ్డి, మాస్టర్ కె.కార్తీక్, ఇతర జిల్లా అధికారులు, జైలు సిబ్బంది దుర్గా రమేష్, సురేష్, రమేష్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క






**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28** :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం జరుగుతుందని,అర్హులైన లబ్దిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీధర్,ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా 50 వేల రూపాయల నుండి 1లక్ష రూపాయల యూనిట్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి జూన్ 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో మొదటి విడత మంజూరు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు, ఇతర వెనుకబడిన తరగతుల వర్గాలలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని,అర్హులకు అవకాశం కల్పించడం ద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనిట్లు కలిపి 4 లక్షల 93 వేల 234 మంది లబ్ధిదారులకు 6 వేల 250 కోట్ల రూపాయల సహాయాన్ని అందించడం జరుగుతుందని,జూన్ 2వ తేదీన దాదాపు 85 వేల మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జూన్ 2వ తేదీ సాయంత్రం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున అన్ని నియోజకవర్గ కేంద్రాలలో 50 వేల రూపాయల నుండి 1లక్ష రూపాయల వరకు గల యూనిట్ల లబ్దిదారులకు ఆయా నియోజకవర్గాల శాసనసభ్యుల ద్వారా మంజూరు పత్రాలు అందించాలని తెలిపారు. రాష్ట్రంలోని అర్హత గల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని చేపట్టిందని,ఈ క్రమంలో అర్హులకు యూనిట్లు కేటాయించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించి రాష్ట్ర జి.డి.పి.ని పెంపొందించాలని తెలిపారు. యూనిట్లు పొందిన లబ్దిదారులకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని,పథకం అమలులో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.

అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారి జాబితాను జిల్లా ఇన్చార్జ్ మంత్రి అందించాలని,జూన్ 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు సాయంత్రం 4 గంటలకు నియోజకవర్గ కేంద్రంలో శాసనసభ్యులతో యూనిట్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి,జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి,జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి జనార్ధన్,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల కారణంగా నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28 :** వర్షాకాలం సమీపిస్తున్నందున భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో జిల్లాలోని చెరువులు పూర్తి స్థాయిలో నిండి పంటలకు, ప్రజలకు ఎలాంటి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో నీటి పారుదల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...వర్షాకాలంలో జిల్లాలో కురిసే భారీ వర్షాల కారణంగా జిల్లాలోని చెరువులు నిండి గండి పడే ప్రమాదం ఉన్నందున అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. చెరువుల కారణంగా పంట నష్టం,రహదారులు తెగిపోవడం వంటి ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తత చర్యలు తీసుకోవాలని,చెరువులు 90 శాతం నిండిన యెడల సంబంధిత అధికారిక గ్రూప్లో సమాచారం అందించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటి పారుదల శాఖ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని నీల్వాయి ప్రాజెక్టు, కరకట్ట నిర్మాణ పనుల పురోగతి వివరాలు తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని నీటి ప్రాజెక్టులలో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని,ఎల్లంపల్లి ప్రాజెక్టులో సరిపడా నీటి మట్టం ఉందని,త్రాగునీటికి జిల్లాలో ఎలాంటి కొరత లేదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నీటిపారుదల ఎస్.ఈ. విష్ణుప్రసాద్,మంచిర్యాల, చెన్నూర్ డివిజన్ల డి.ఈ. ఈ.లు,ఎ.ఈ.ఈ.లు, సంబంధిత అధికారులను తదితరులు పాల్గొన్నారు.

# లయోలా కాలేజ్ మోసం చేసింది

అల్వాల్ విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి లయోలా కళాశాల యాజమాన్యం, ఉద్యోగ నియామక అధికారి మోసం చేశారంటూ విద్యార్థులు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. విదేశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిగ్రీ పూర్తికాక ముందే విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కన్సల్టెన్సీ నుండి వాట్సాప్ ద్వారా తమకు సందేశాలు పంపినట్లు విద్యార్థులు తెలిపారు. పది లక్షల రూపాయల చొప్పున ఒక్కో విద్యార్థి నుండి తీసుకుని విదేశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని కళాశాల యాజమాన్యం కన్సల్టెన్సీ అధికారి చెప్పారని విద్యార్థులు తెలిపారు. వారు చెప్పిన విధంగానే మొత్తం ఐదు మంది విద్యార్థులు ఒక్కొక్కరు పది లక్షల రూపాయలను ఇచ్చినట్లు తెలిపారు. ఇంట్లో తమ తల్లుల బంగారాన్ని అమ్మి సైతం 10 లక్షల రూపాయలు జమ చేసి వారికి పంపినట్లు తెలిపారు. తీరా నకిలీ విదేశీ ఐడీని సృష్టించి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. ఇదే విషయమై కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమాధానాలు ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. గత మూడు నెలల నుండి ఉద్యోగాల విషయమై కళాశాలకు వచ్చి వెళ్తున్నప్పటికీ తమను పట్టించుకోకుండా తమపైనే పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారని కేసులు పెడుతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డబ్బులు తిరిగి ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. వెంటనే తమకు డబ్బులు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

## నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేయడం రాజీవ్ యువ వికాసం పథకం ముఖ్య ఉద్దేశ్యం

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 28:** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారి కాళ్లపై వార నిలబడి, వారి కుటుంబాన్ని చక్కగా పోషించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలనే మంచి ఉద్దేశ్యంతో రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టడం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.




బుధవారం సచివాలయం నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్డు రవాణ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు అన్ని జిల్లా కలెక్టర్లందరితో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించినారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నిరుద్యోగయువతను ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యఉద్దేశ్యమని అన్నారు. జూన్ నెలలో 50 వేల నుండి లక్ష వరకు గల దరఖాస్తులకు, లక్ష నుండి 2 లక్షల వరకు జూలై మాసంలో, 2 లక్షల నుండి 4 లక్షల వరకు గల దరఖాస్తులను ఆగస్టు, సెప్టెంబరు మాసాలలో మంజూరీ ఉత్తర్మలు, గ్రౌండింగ్ చేయడం వంటి ప్రక్రియ జరుగుతుందన్నారు. జూన్ నెలలో అందించే 50 వేలు, లక్ష లోపు దరఖాస్తుదారుల జాబితాలను పరిశీలించి తమ తమ జిల్లా ఇంఛార్జి మంత్రులకు కలెక్టర్లు అందజేయాలని సూచించినారు. చిన్న చిన్న గ్రామాలలో ఒకేరకమైన యునిట్లను గ్రౌండింగ్ చేయకుండా, భవిష్యత్తులో కూడా కొనసాగించే విధంగా యూనిట్లను ఎంచుకునేలా అభ్యర్థులకు అవసరమైన కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. యువతకు వారి సామర్థ్యం పై నమ్మకంతో ఇన్వెస్ట్ చేసుకునేలా వారు వ్యాపారం చేసి లాభం పొందేలావారికి అవగాహన కల్పించాలన్నారు. భవిష్యత్తులో కూడా ప్రత్యేక అధికారులను నియమించి వారికి ఏవైన సమస్యలు ఎదురైతే అవసరమైన సహాయ సహాకారాలు అందించాలన్నారు.




ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు గౌతం, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డిఆర్డిఓ సాంబశివరావు, బిసి వెల్ఫేర్ అధికారిఝాన్సీలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, ఎల్డిఎం, ఎస్సీ కార్పొరేషన్ఈడి బాబు మోసెస్, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 3 నుండి ఎస్.ఎస్.సి.అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు

## జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28 :** జిల్లాలో జూన్ 3వ తేదీ నుండి ఎస్.ఎస్.సి.అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3,4,5,6,11,12,13 తేదీలలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం12.30 గంటల వరకు,3వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-1,2 పరీక్ష ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం12.50 గంటల వరకు,9,10 తేదీలలో ఉదయం9.30 గంటల నుండి11 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణ కొరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని,విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు,పారిశుద్ధ్యం,విద్యుత్ సరఫరా,వైద్య సిబ్బంది నియామకం,పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సులు నడపడం,ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 28:** ఈ రోజు పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణ బాయి ఏదులాబాద్, మాదారం మరియు ప్రతాపసింగారం దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనికి నిర్వహించి కొనుగోలు కేంద్రం రికార్డులు పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా కొనుగోలు కేంద్రాలలో తగినంత హమాలీలను ఏర్పాటు చేసి, దాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, ధాన్యం తూకం చేసిన వెంటనే రైస్ మిల్లుకి తరలించవలసినది గా సూచించడం జరిగింది మరియు ధాన్యం కొనుగోలు చేయునప్పుడు అవసరమైన టార్పాలిన్లు మరియు తూకం యంత్రాలు, తేమ మీటర్ లను తగు మొత్తంలో ఏర్పాట్లు చేయవలసిందిగా కొనుగోలు కేంద్ర ఇన్చార్డ్ లకు ఆదేశాలు జారీచేయడం జరిగింది.

కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొన్న వెంతనే ట్యాబ్ (ఆన్లైన్) లో రైతు వివరములు నమోదుచేయవలసిందిగా దాన్యం కొనుగోలు ఇన్చార్జిలకు ఆదేశాలు జారీచేయడం జరిగింది.రైతు తమ ధాన్యం అమ్మిన 48 గంటలలో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమచేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే హౌజ్ అరెస్టు

కొమురం భీం ఆసిఫాబాద్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్ ను మేడిగడ్డకు తరలిస్తుంటే మాజీ ఎమ్మెల్యే కోనప్ప అసెంబ్లీ లో గాని బయటగాని నోరు మెదపలేదని సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు ఆరోపించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేయకపోవడం వలన తూర్పు ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయని ... ఈ విషయంలో తుమ్మిడిహెట్టి వద్ద బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. దాంతో బుధవారం ఉదయం ఇరువురిని హౌజ్ అరెస్ట్ చేసారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సవాలుకు సిద్ధమైన కోనేరు కోనప్ప ని తుమ్మిడిహెట్టి ప్రాణహిత నది ప్రాంతానికి వెళ్తుండగా అడ్డుకున్నారు. అటు బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు నివాసం వద్ద కూడా ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసారు.

# మణికొండలో సంవత్సరాలుగా తిష్ట వేసుకొన్న సమస్యలు.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 28 మే 2028**మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ చేపట్టిన గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమస్యలు వివరించడం మరియు వారికి చట్టం పట్ల అవగాహన కల్పించడం జరుగుతున్నది. మణికొండలో కొన్ని సంవత్సరాలుగా పలు ప్రజా సమస్యలు తిష్ట వేసుకుని కూర్చున్నాయి, అట్టి పేరుకు పోయిన ప్రజా సమస్యల పరిష్కార దిశగా గత మూడు నెలలుగా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కోనసాగిస్తున్న గుడ్ మార్నింగ్ మణికొండ అలుపు ఎరుగకుండా సేకరిస్తున్న ప్రజా సమస్యల విషయమై ప్రతీ రోజు మున్సిపల్ మరియు ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తేవడం జరుగుతున్నవి. తిష్ట వేసుకొని కూర్చున్న సమస్యల విషయమై చెప్పడానికి నిదర్శనంగా స్థానిక కాలనీ సంక్షేమ సంఘులు, కొంత మంది సంఘ సేవక ఉత్సాహకులు సోషియల్ మీడియా వేదికగా లేవనెత్తు తున్నారు. ప్రజా సంక్షేమ దృష్ట్యా ఇట్టి అన్ని విషయలలో బి.ఆర్.ఎస్ పార్టీ లేవనెత్తుతున్న సమస్యలకు సహకరించి కొంత మేర పనులు జరుగుతున్నందు వలన కాస్త ఉపశమనం కలుగుతుందని స్థానికులు తెలియ జేస్తున్నారని



బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారం ధూళిపాళ, ఉపేందర్నాథ్ రెడ్డి, గోరుకంటి విఠల్, సంగం శ్రీకాంత్, యాలల కిరణ్, రాజేంద్రప్రసాద్, సుమనళిని, షేక్ ఆరీఫ్, ఆరీఫ్ మొహమ్మద్, చెరుకూరి బాలాజీ, రమణ మూర్తి తది తరులు బుధవారం రోజున తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భముగా తెలియ జేసినారు. స్థానిక అవసరాలలో ముఖ్యంగా అంబేద్కర్ భవన నిర్మాణం మొదలెట్టాలని, పుప్పాలగూడ శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలనీ, రహదారు లన్నింటికి కనీసం ప్యాచ్ వర్క్ లు అయినా చేయించాలని, అన్యాక్రాంతం అవుతున్న సర్కారు స్థలాలను పరిరక్షించాలని, డ్రైనేజ్ వ్యవస్థను బాగు చేయాలని, ఇళ్ల నిర్మాణాలు అనుమతులు ఉన్నంత వరకే కట్ట నివ్వాలనీ, పుర వీదులలో, ఖాళీ స్థలాలలో ఉన్న చెత్తా చెదారాన్నీ తొలగించాలని, దోమలను అరికట్టాలని, శునకాలకు షెల్టర్ షెడ్ నిర్మించాలనీ, రహదారి కూడలిలో వర్షం నీరుకు హార్వెస్టింగ్ పిట్ లను కట్టాలనీ, పెంచిన ఆస్తి పన్నును తగ్గించాలని, విద్యుత్ ఫ్లక్చ్యుయేషన్ లేకుండా సరఫరా నిర్వహించాలని, నీటి వ్యాపారం చేయకుండా అందరికీ సమ న్యాయంగా నీటి సరఫరా చేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టిస్తున్న అడ్డంకిలను తొలగించాలని స్థానిక ప్రజల తరపున కోరడమైనది.



## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది అని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు



**పరకాల నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాబలం) మే 28 :** బుధవారం గీసుగొండ మండలం అనంతారం గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో శాస్త్రవేత్తలు,వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...రైతులు ఆధునిక వ్యవసాయ విధానంలో ఉత్పత్తి పెంచుకొని ఆదాయం పొందాలని రైతులు కాలానికి అనుగుణంగా మారాలి అని,పంట మార్పిడి తో అత్యధిక దిగుబడి వచ్చి లాభాలు ఆర్జించవచ్చు అన్నారు.రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయడం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు.నిత్యం ఫెర్టిలేజర్ ఎరువుల పై ఆధారపడటం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు.రైతులు శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు తీసుకోవడం వల్ల రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు.ప్రతి మండలంలో 125 ఎకరాల భూమిలో సేంద్రియ వ్యవసాయం చేసి రైతులను చైతన్యం చేయబోతున్నామని అన్నారు.వ్యవసాయం లో నూతన సాంకేతికత ఉపయోగం పెరిగింది అని రైతులు ఆవిధంగా ఆలోచన చేయాలి అన్నారు.పాడి పరిశ్రమల అభివృద్ధికి తాను కృషి చేస్తున్నానని దాని ద్వారా ఎరువులు సేంద్రియ వ్యవసాయం లభ్యమవుతుందన్నారు

## స్వర్గీయ నందమూరి తారక రామారావు 102 వ జయంతి..



**కూకట్పల్లి (ప్రజబలం) మే 28 :** కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వసంత నగర్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయనతో ఉన్న అనుబంధము గుర్తు చేసుకున్నారు తెలుగు వారి ఖ్యాతిని విశ్వ వ్యాప్తం చేసిన గొప్ప మహానుభావుడు అని రాజకీయంగా ఎన్టీఆర్ విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని కిలో 2 రూపాయల పథకం అమలు చేసి నిరుపేదల పాలిట దేవుడు అయ్యారని క్రమశిక్షణ కు మారుపేరు ఎన్టీఆర్ అనీ ఆయన చూపిన మార్గం లోనే మేము ఇప్పటికీ నడుచుకుంటున్నాం అని అన్నారు కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు,నాయకులు సాయి బాబు చౌదరి,శ్యామల రాజు కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు..

# వరి ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం

### వర్షానికి తడిసి మొలకెత్తిన వరి ధాన్యం నిర్లక్ష్యం వహించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి,, రైతులు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే 28 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, చౌటకూర్ మండలంలోని, వివిధ గ్రామాలలో (డిసిఎంఎస్ ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన,వరి కొనుగోలు కేంద్రాలలో అధికారుల నిర్లక్ష్యం వలన, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో వరి ధాన్యం కొనుగోలు కాలేదు, దాంతో రైతులు రోడ్లపై ఆడబెట్టిన వరి ధాన్యం, ఇటీవల కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు, కాగా (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో సుమారు 8 నుంచి 9 గ్రామాలు ఉండగా ఈ ఒక్క గ్రామంలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు మండిపడుతున్నారు, రైతులు ఆరుగాలం కష్టపడి శ్రమించి పంట పండించిన, (డీసీఎంఎస్)సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో, వరి ధాన్యం పూర్తిగా తడిసి మొలకెత్తిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు, కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించకుండా అక్కడే ఉంచి రైతులకు ఇబ్బంది పెడుతున్నారు, అదేవిధంగా రైతులకు సరిపడా టాపర్లు అందజేయకపోవడంతో, రోడ్లపై వరిధాన్యం మొలకెత్తిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు, కావున జిల్లా కలెక్టర్ మండలంలో పర్యటించి, అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు, ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్య ధోరణి చేశారని, సకాలంలో ధాన్యం కాంట వేయకపోవడమే కాకుండా, లేబర్ ను తేవడంలో నిర్లక్ష్యం వహించిన (డీసీఎంఎస్) అధికారులను, వెంటనే సస్పెండ్ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# అన్నదాతలకు అవగాహన సదస్సు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (మే 28 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, పుల్కల్ మండల పరిధిలో గల,ఇసోజీపేట గ్రామములో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, అన్నదాతల అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త, కోఆర్డినేటర్ శాస్త్రవేత్త, రాహుల్ విశ్వకర్మ, మాట్లాడుతూ,తక్కువ యూరియా వాడడం వల్ల, సాగు ఖర్చును తగ్గించవచ్చని, అవసరం మేరకు రసాయనాలను వినియోగించి, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు, పంట మార్పిడి వల్ల అధిక లాభాలు గడించవచ్చు అని తెలిపారు, అలాగే చిరుధాన్యాల సాగు వల్ల, విలువ ఆధారిత ఉత్పత్తులు చేయడం వల్ల రైతుకు అదనపు లాభం చేకూరుతుందని తెలిపారు, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల కంది శాస్త్రవేత్త, వీరన్న, మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు, అవసరాల నిమిత్తం దుకాణాల నందు కొనుగోలు చేసేటప్పుడు రసీదులు భద్రపరచుకోవడం వల్ల, కష్టకాలంలో నష్టపరి హారాన్ని, పొందవచ్చు అని తెలియజేయడం జరిగింది, అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చు అని రైతులకు సవివరంగా తెలిపారు, సహాయ వ్యవసాయ సంచాలకులు జోగిపేట్ డివిజన్, జి రమాదేవి మాట్లాడుతూ జి,రమాదేవి, మాట్లాడుతూ, మేలైన మెలకువలు పంటలో పాటిస్తే సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చు అని తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని, చైతన్య, వ్యవసాయ విద్యార్థులు, గ్రామ రైతులు, ఏరువాక కేంద్రం వై పి-1, ఎన్, శ్రీకాంత్, కె, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు....

# కూకట్పల్లి ప్రెస్ క్లబ్ స్థలము,భవన నిర్మాణం కొరకు వినతి పత్రం

### ౹కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ కి కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య అందజేత..

**కూకట్పల్లి, (ప్రజబలం) మే 28 :** కూకట్పల్లి ప్రెస్ క్లబ్ స్థలము భవన నిర్మాణం కొరకు కాంగ్రెస్ పార్టీ కూకట్పల్లి ఇంచార్జ్ బండి రమేష్ ని కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య,కార్యవర్గం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం



అందజేశారు.ఈ సందర్భంగా కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య మాట్లాడుతూ కూకట్పల్లి నియోజకవర్గంలో ప్రెస్ క్లబ్ స్థలము, భవనం లేక ప్రింట్ అండ్ ఎలెక్ట్రానిక్ మీడియా విలేకరులు ప్రెస్ మీట్లు,యూనియన్ మీటింగులు, సమస్యల గురించి చర్చించుకుందామంటే సరైన షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఇక్కడ విలేకరుల ఐక్యతా లోపమో మరి ఇంకేదైన కారణమో ఇప్పటి వరకు ఏ విలేకరి ప్రెస్ క్లబ్ కొరకు ఆలోచన చేయలేదు.అలాగే విలేకరులను సంఘటితం చేయలేక పోయారని ఆయన వివరించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై స్పందిస్తూ సమాజ హితం కోసం పనిచేసే జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ ను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించుకుని, జర్నలిస్టులకు అందుబాటులోకి వెంటనే తీసుకువస్తానని,అలాగే జర్నలిస్టులందరికీ సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చర్యలూ తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. కూకట్పల్లి ప్రెస్ క్లబ్ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ కోశాధికారి నగేష్,జాయింట్ సెక్రెటరీ నాగుల అంజిబాబు, వి.సుజాత, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.లక్ష్మి,కర్ణ కుమార్, ఈసీ మెంబర్ రవీందర్ రెడ్డి,అనిల్ కిషోర్,వీర శేఖర్ రెడ్డి, శైలజ, సునీత రాణి తదితరులు పాల్గొన్నారు.

## లక్షెట్టిపేట సిఐ అల్లం నరేందర్ బదిలిపై వెలుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సన్మానం



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మే 28 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని కే ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లోని లక్షెట్టిపేట సిఐ అల్లం నరేందర్ బదిలిపై వెలుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... లక్షెట్టిపేట సిఐ అల్లం నరేందర్ బదిలిపై వెలుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు సన్మానించడం సన్మానించడం జరిగింది తెలుపారు.ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, లక్షెట్టిపేట మండల అధ్యక్షుడు పింగళి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమేల రాజు, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ చెల్లా నాగభూషణం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ ఆరిఫ్,ఆర్ టి వో జిల్లా నాయకులు అంకతి శ్రీనివాస్,లక్షెట్టిపేట మండలంలోని,గ్రామాల నాయకులు,మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## నూతన వధూవరుల ను ఆశీర్వదించిన మేకల మల్లిబాబు యాదవ్ చిత్తారు సింహాద్రి యాదవ్



**ఖమ్మం ప్రతినిధి మే 28 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా డిసిసిబి డైరెక్టర్ నూకల సైదులు– రజిని యాదవ్ ల కూతురు వేదశ్రీ – వీరబాబు ( కూసుమంచి మండలం నేల పట్ల గ్రామానికి చెందిన జాల తిరపయ్య– వీరమ్మ దంపతుల కుమారుడు)ల వివాహం మరియు రఘునాథపాలెం మండలం వి వెంకటాయి పాలెం. దొనబండ గ్రామానికి చెందిన లకావత్ బాలాజీ నాయక్ – శాంతి ల కుమారుడు రవీందర్ నాయక్ శ్రీ కావ్య ( వి. వెంకటాయ పాలెం గ్రామానికి చెందిన బానోత్ రాందాస్ నాయక్ అశ్విని గార్ల కూతురు )ల స్థానిక కళ్యాణమండపంలో ఘనంగా జరిగింది. డిసిసిబి డైరెక్టర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ లు వివాహల కార్యక్రమంలో పాల్గొని అక్షంతలు వేసి నూతన వధూవరులను చల్లగా నూరేళ్లపాటు సుఖంగా జీవించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. కొండాపురంలో జరిగిన యాదవుల ఇష్టా గోష్టి కార్యక్రమంలో బిసి కులాలలో అత్యధిక జనాభా కలిగిన యాదవులు ఐక్యత లేకపోవడం వలన జన సంఖ్య లేని కులాలు అభివృద్ధిలో ముందుంటున్నాయని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో యాదవులు ఐక్యంగా సత్తా చూపించాల్సిన అవసరం ఉందని, గ్రామాలలో మండలాలలో యాదవ జనాభాకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం కల్పించాలని, యాదవులు ఎక్కడ పోటీ చేసిన రాజకీయాలు వర్గాలకు అతీతంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు ఈకార్యక్రమం లో టిఆర్ఎస్ జిల్లా నాయకులు బెల్లం వేణు, మేకల కృష్ణవేణి, నూకల నరసింహారావు, నూకల నరసింహారావు, జర్పుల లక్ష్మణ్,ఊదర ఉపేందర్ భజన కోటేశ్వరరావు శ్రీరాముల అచ్యుత్ మరియు తదితర బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు



## వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28 :** జిల్లాలోని నెన్నెల మండలంలో ఎర్రవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం జిల్లాలోని నెన్నెల మండలంలో కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు,ఇందిరమ్మ ఇండ్లు, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహశిల్దార్ మహేంద్రనాథ్ కలిసి సందర్శించి అధికారులకు,పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...వర్షాకాలం రాబోతుందని,ఈ నేపథ్యంలో మండలంలోని ఎర్రవాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మండలంలోని జంగల్ పేటలోని కొత్తగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.నిరుపేదల కొరకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్దిదారులకు మాత్రమే పథకం ఫలాలు అందే విధంగా జాబితా రూపకల్పనలో పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు.ఈ ప్రాంతంలో అటవీ శాఖ అభ్యంతరం చెబుతున్న భూములను పరిశీలించి వాటికి సంబంధించిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని తెలిపారు.అనంతరం జోగాపూర్,ఆవుడం గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు,నీడ,ఓ.ఆర్.ఎస్.ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు,టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు.కొనుగోలు కేంద్రాల నిర్వహకులు వారికి కేటాయించిన,లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి దేవేందర్రెడ్డి, ఎస్.ఐ.,మండల పంచాయతీ అధికారి,ఎ.పి.ఓ., ఎ.పి.ఎం.,ఆర్.ఐ.,కార్యదర్శులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఇదేమి గో(స) శాల,

### కోట్ల రూపాయల ఆదాయం ఉన్న, కోడెల సంరక్షణలో అధికారులు అలసత్వం.


### బురదలో మగ్గుతున్న గోశాలలోని కోడెలు.

### భక్తులు విరాళంగా ఇచ్చిన గడ్డి బురద పాలు.

### నీ గోవులను కాపాడే దిక్కు ఎవరు రాజన్న.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రెండు గోశాలలు కలవు. ఒకటి రాజన్న ఆలయానికి అతి సమీపంలో జగిత్యాల బస్టాండ్ వద్ద గల గోశాలలో కోడెలకు శిక్షణ ఇచ్చిన, వీటిని రాజన్న ఆలయంలో ప్రతిరోజు రాజన్న భక్తులు కోడె మొక్కులు చెల్లించుటకు విడుతలవారీగా రాజన్న ఆలయంలో కోడెలను తిప్పుతుంటారు. మరొక గోశాల వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపురంలో గోశాల కలదు. రెండవ గోశాలలో స్థలభావం వల్ల కేవలం రెండవ గోశాలలో 400 నుండి500 లోపు వరకు మాత్రమే గోశాలలో స్థలము కలదు. వాటికి సరిపడా షెడ్లు మాత్రం కూడా అందులో లేవు. అయితే కొన్ని నెలలుగా రాజన్న గోశాలకు కోడెలను భక్తులు భారీ సంఖ్యలో రాజన్నకు మొక్కుల రూపంలో సమర్పిస్తుండడంతో గోశాలలో కోడెల సంఖ్య పెరిగి ప్రస్తుతము1400 పైచిలుకు కోడెలు ఉన్నట్లు గోశాల సిబ్బంది తెలిపారు. ఇట్టి1400 కోడెలకు సపరి చర్యలు చేయడానికి ఔట్సోర్సింగ్ పద్ధతిలో 24 మంది సిబ్బంది మాత్రమే కోడెల సంరక్షణ పనులు చేస్తుండడంతో కోడెల ఆలన, పాలన వాటికి అనారోగ్యం కలిగితే మందులు ఇతర సపరి చర్యలు చేయడానికి ఉన్న సిబ్బంది సరిపోవటం లేదు. దీనితో కోడెల సంరక్షణ సిబ్బందికి కష్టతరంగా మారింది. రాజన్న ఆలయానికి కోడెమొక్కుల రూపంలో సింహభాగం ఆదాయం ఆలయానికి సమకూరుతున్న, కోడెల సంరక్షణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోడలు చనిపోవడం ఇక్కడి గోశాలలో సర్వసాధారణ విషయంగా మారింది. వేములవాడ పట్టణంలో మంగళవారం రోజు సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా గోశాల మొత్తం బురదమయంగా మారి 1400 కోడెలు బురదతో సహజీవనం చేస్తున్నాయి. 24 గంటల పాటు బురదలో కోడెలు నిలబడి ఉండడం వలన, కోడెలు తినే గడ్డి సైతం బురదలో ఉండడం వలన కోడెలు ఆహారాన్ని తీసుకోలేకపోతున్నాయి. దీనితో అవి తీవ్ర అనారోగ్యం పాలవుతున్నాయి.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గోశాలపై ప్రత్యేక దృష్టి సారించి గోశాల అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయించిన, కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు కుంటి నడకన సాగుతున్నాయి. గతంలో గోశాలలో కోడెలు అధిక సంఖ్యలో ఉండడం వలన, అనారోగ్యంతో మరణించడం వలన, అందులో కొన్ని వందల కోడెలను నిజమైన రైతులకు పట్టాదారు పాసు బుక్కు, ఆధార్ కార్డు ఆధారంగా ఒక్కొక్కరికి రెండు చొప్పున రాజన్న కోడెలను రైతులకు ఉచితంగా ఇవ్వడం జరిగింది.

కోడెల పంపిణీలో అకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఉచితంగా రైతులకు పంపిణీ చేసిన కోడెల పంపిణీని ఆలయ అధికారులు నిలిపివేయడంతో ప్రస్తుతం గోశాలలో పరిమితికి మూడు రెట్లు మించి కోడెలు ఉన్నాయి. ప్రస్తుతం గోశాలలో మూడు షెడ్ లు కొత్తగా నిర్మించిన ఉన్న కోడెలకు అవి ఏ మాత్రం సరిపోవడం లేదు.

రాజన్న పై భక్తితో, మూగజీవాలపై మమకారంతో కొంతమంది రైతులు తమ పంట పొలాలలోని వరిగడ్డిని రాజన్న గోశాలకు వారి సొంత రవాణా ఖర్చులు భరించి ఉచితంగా ఇస్తే అట్టిగడ్డిని వర్షాకాలంలో గోశాల సిబ్బంది వర్షం నీటితో తడవకుండా కనీసం గడ్డి పై టార్పాలిన్ కవర్లు కప్పకపోవడంతో దాతలు ఉచితంగా ఇచ్చిన గడ్డి కూడా బురదలో కలిసి గోవులు తినకుండా తయారైంది. గోశాలలోని గోవులను, ఆలయ అధికారులు పట్టించుకోవడంలేదని రాజన్న భక్తులు, స్థానికులు తమ ఆవేదనను తెలుపుతున్నారు.

కోట్ల రూపాయల ఆదాయం సమకూర్తున్న రాజన్న ఆలయనికి అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి వేములవాడ పట్టణానికి కొంత దూరంలో నైనా 20 నుండి 30 ఎకరాల వరకు సొంత స్థలాన్ని కొనుగోలు చేసి, గోశాలలో సిబ్బందిని పెంచి, అక్కడికి గోశాలను తరలించి గోవులను కాపాడని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

## సింగారం గ్రామ మాజీ సర్పంచ్ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి.

## వేములవాడ అర్బన్ బిజెపి అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ డిమాండ్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బుధవారం రోజున వేములవాడ అర్బన్ భారతీయ జనతా పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో, మంగళవారం రోజున ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో 40 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఒక మతానికి సంబంధించిన వారు అక్రమ కట్టడం కట్టుచున్నారని తెలిసి, దానిని ఆపాలి అని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులపై సింగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లేశం అనే వ్యక్తి బిజెపి నాయకుల పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చంపుతా, నరుకుతా అంటూ వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్ కు ఫిర్యాదు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చంద్రగిరి ప్రశాంత్, జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెకార్ల లక్ష్మణ్, నాయకులు నాగుల పూర్ణ చందు గౌడ్, పోచంపల్లి భాను, కొలనూరి సంజీవరెడ్డి, చొక్కాల మధు, కంసాని రాములు తదితరులు పాల్గొన్నారు.

## కిరాయికి వుంటున్న వారే నిందితులు

కుత్బుల్లాపూర్... జీడిమెట్ల పియస్ పరిదిలో నిన్న మావోయిస్టుల పేరుతో లేఖరాసి సంచలనం సృష్టించిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసారు. భాదితుడు కూన రాఘవేంద్ర గౌడ్ ఇంట్లోనే కిరాయికి ఉంటున్న వారిగా గుర్తించారు. జీడిమెట్ల పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు వున్నారు.

# మారుపాక గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మరియు బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో మే 28వ తేదీ రైతులతో, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం మారుపాక గ్రామ రైతు వేదిక కార్యాలయం వద్ద జరిగింది.

ఈ కార్యక్రమంలో రైతులకు ఆరు అంశాల పైన అవగాహన కల్పించారు. పంటలకు సిఫార్సు చేసిన మోతాదులోనే యూరియాను ఉపయోగించడం, పచ్చి రొట్టె ఎరువులు, వర్మీ కంపోస్ట్, పశువుల ఎరువు వాడడం, భూసార పరీక్ష ఫలితాలను బట్టి పంటకు ఎరువులను అందించడం, రసాయన ఆధారిత పురుగు మందులను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించడం మరియు పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించడం, పంట వైఫల్యాల సమయంలో పంట బీమా పొందడానికి మరియు నష్టపరిహారం కోసం పంట కోసం కొనుగోలు చేసిన వివిధ విత్తనాలు, రసానిక ఎరువులు మరియు రసాయనిక మందుల కొనుగోలు రసీదులను భద్రపరచడం, సాగునీటి యాజమాన్యం, బిందు మరియు తుంపెర సేద్యం, మల్చింగ్ పద్ధతులు, సుస్థిరమైన వ్యవసాయం కోసం పంట మార్పిడి మరియు పంట వై విద్దీకరణ, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటడం, పి జె టి ఏ యు వారి చేను కబుర్లు రేడియో కార్యక్రమాన్ని ఉపయోగించడం ద్వారా వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని తెలుసుకోవడం, వర్మి కంపోస్ట్ తయారీ మరియు పుట్టగొడుగుల పెంపకం పై అవగాహన, వెదురు మొక్కల మరియు ఆయిల్ ఫామ్ సాగు,



అనంతరం రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలతో మరియు అధికారులతో పంటకు సంబంధించిన విషయాలపై చర్చించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రైతులు ఈ కార్యక్రమంలో తెలుసుకున్న అంశాలను పాటిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల సిరిసిల్ల, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎండి. రజియా సుల్తానా, పి. మాధవి, ఏఎంసీ చైర్మన్ ఆర్. రాజు, ఏఎంసి డైరెక్టర్ జి. విద్యాసాగర్, వ్యవసాయ డివిజనల్ అధికారి రామారావు, జి. సాయి కిరణ్, మండల వ్యవసాయ అధికారి, ఉద్యాన శాఖ అధికారి లోకేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎండి. ఇనామిల్, డి.రాజు, వ్యవసాయ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులు, జి. మణికంఠ, బి. శాలిని, రైతులు మరియు మహిళలు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలులో అధికారుల అలసత్వం, మందు డబ్బాలతో రైతులు రోడ్డుపై ధర్నా.

## వెంకట్రావు పేట గ్రామ రైతులు నిమ్మపల్లి ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డుపై బైఠాయించి మందు డబ్బాలతో నిరసన.





**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ),** కొనరావుపేట మండలం వెంకట్రావు పేట గ్రామంలో వడ్ల కొనుగోలు లో ఆలస్యంతో రైతులు రోడ్డెక్కారు. నిమ్మపల్లి ఎక్స్ రోడ్డు వద్ద రైతులు మందు డబ్బాలతో రోడ్డుపై బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నప్పటికీ నేటి వరకు వడ్లు కొనుగోలు చేయకపోవడంతో తాము నష్టాల్లో కూరుకు పోతున్నామని కొనుగోలు కేంద్రాల పోసిన వడ్లు వర్షాలతో మొలకెత్తడంతో రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. తాము కష్టపడి పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో భారీ వర్షాలకు తడవడంతో నాణ్యత కోల్పోతుందని, ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకొని వడ్లు తూకం వేసి కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని రైతులు హెచ్చరించారు. నిరసనలు భాగంగా రైతులు చేతుల్లో మందు డబ్బాలతో రోడ్డుపై బైఠాంచి తమ నిరసన వ్యక్తం చేయడంతో ధర్నా ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సంఘటన స్థలానికి కోనరావుపేట పోలీసులు చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నా విరమింప చేశారు

# రాజన్న ఆలయ 13 రోజుల హుండీ లెక్కింపు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం రోజున నిర్వహించినారు. ఈ లెక్కింపులో రూపాయలు1 కోటి,44 లక్షల,25 వేల,031 రూపాయలు.(1,44,25,031). బంగారం107 గ్రాముల500 మిల్లి గ్రాములు. వెండి07 కిలోల900 గ్రాముల ఆదాయం లభించినట్లు ఆలయ వర్గాలు తెలిపారు.

హుండీ లెక్కింపు నందు కార్యనిర్వాణాధికారి వినోద్, ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏ ఈ ఓ లు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీఎఫ్ మరియు హెూంగార్డు సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేశారు.

ఇట్టి హుండీ లెక్కింపు నందు శ్రీ శివరామకృష్ణ భజన మండలి వారు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో జీలుగా విత్తనాలు

## శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మే 28** ఇల్లందకుంట మండల కేంద్రంలో సీతారామచంద్రస్వామి దేవస్థాన చైర్మెన్ రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఖరీఫ్ సీజన్ లో రైతులకు జీలుగా విత్తనాలను సబ్సిడీ పై పంపిణీ చేస్తుందన్నారు. ఇల్లందకుంట,సిరిసేడు, మల్యాల గ్రామాలలో 100 క్వింటాల జీలుగు విత్తనాల బస్తాలు ఉన్నాయన్నారు. అవసరం ఉన్నటువంటి రైతులు వినియోగించుకోవాలన్నారు.మన ఇల్లందకుంట మండలంలో అత్యధికంగా వరి సాగు చేస్తున్నారని అన్నారు.ఎరువుగా వాడే జీలుగ, విత్తనాలు సబ్సిడీపై కొనుగోలు చేసి ప్రతి యేటా మే నెల రైతులకు సరైన సమయం అని ఈ సంవత్సరం రుతుపవనాలు ముందుగా వస్తున్నాయని వాతావరణ శాఖ పలుమార్లు సూచించిందన్నారు. జీలుగా విత్తనాలను రైతులకు సరఫరా చేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిగా నిమగ్నమయ్యారన్నారు. రైతులకు ఎలాంటి అవసరాలు ఉన్న సంబంధిత వ్యవసాయ శాఖ ఏవో,ఏఈఓ ను సంప్రదించాలని అన్నారు. జీలుగు విత్తనాలు పొలంలో చల్లడం ద్వారా ఎరువుగా మారి అధిక పంట దిగుబడి వస్తుంది అన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు రాని బాధితులు రోడ్డు ఎక్కి నిరసన




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మే 28** జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని రోడ్డెక్కిన గ్రామస్తులు. జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టానుసారంగా తమ బంధువులకు వారికి అనుగుణంగా ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం జరిగింది అని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించలేదు అని గ్రామస్తులు గ్రామ కార్యదర్శిని నిలదీయగా, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన వారిని ఎంపిక చేయడం జరిగింది. మా చేతిలో ఏమీ లేదు అని తెలిపారు. గ్రామ కార్యదర్శి మాటలు విన్న గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శేఖర్ రెడ్డి మడిపల్లి గ్రామానికి చేరుకొని గ్రామస్తులకు సద్ది చెప్పడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమాల్లో దూడపాక సుశీల, తాళ్లపల్లి నాగరాజు, ఎండి చాన్ పాషా, నేరెళ్ల తిరుపతి, అంబాల సమ్మక్క, దేవునూరి విజయ, అంబాల భారత సంద గళ్ళ మమత తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో 23 వేల 715 మంది రైతుల ఖాతాలలో 249 కోట్ల రూపాయల జమ

## జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 28 :** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 23 వేల 715 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 68 వేల 519 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 249 కోట్ల 60 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 176 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది,హమాలీలు యజ్ఞంలాపని,చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు,జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు.ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ,సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు,నీడ,ఓ.ఆర్.ఎస్.,గోనె సంచులు,టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com